ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

fb.com/vaartha Digital


Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-4-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 82 పేజీలు: 10+4 వెల: 6.50


విదేశీ అతిథుల పర్యటనల్లోనే ఉగ్రదాడులు

శాంతి చర్చలకు సిద్ధమే: పుతిన్

5లో



# నేర చరితులతో ఎప్పటికీ ప్రమాదమే

## వీరయ్య చౌదరి కుటుంబం నా కుటుంబమే

### మృతుని కుటుంబాన్ని ఓదార్చిన సిఎం చంద్రబాబు

ఒంగోలు (నాగులుప్పలపాడు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త: నేర చరిత్ర కలిగిన వారు భూమిపై ఉండరాదని వారితో ప్రమాదం ఎప్పుడైనా పొంచి ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. బుధవారం నాగులుప్పల పాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి నివాళులర్పించారు. తొలుత చదలవాడ రఘుశంకర్ హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గంలో వీరయ్య చౌదరి స్వగ్రామమైన అమ్మనబ్రోలు చేరుకున్నారు. అప్పటికే వేలాది మంది ప్రజలు చౌదరి నివాసంతో పాటు గ్రామమంతా రహదారుల వెంట చంద్రబాబు రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ఆయన వస్తున్నట్లు సంకేతం తెలుసగానే ఒక్కసారిగా ముప్పవరపు వీరయ్య చౌదరి అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడు చౌదరి సతీమణి సుచరిత కుమారుడు చంద్ర సిద్ధార్థను ఓదార్చి ఇక నుండి మీ కుటుంబం నా కుటుంబంతో కలిసి ఉంటుందని భరోసా ఇచ్చారు. నేరస్తులు ఎక్కడ ఉన్నా వెతికి శిక్షించేవేక విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్సీ ప్రభుత్వంలో నేర ప్రవృత్తి పెరిగిపోయిందని నేరస్తులు ఎంతకైనా తెగిస్తున్నారని ఎంతో మంది తెలుగుదేశం కార్యకర్తలను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

**పార్టీలో ముప్పవరపు గుర్తింపు**

హత్యకు గురైన ముప్పవరపు వీరయ్య చౌదరి తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంతో పాటు చీరాల నియోజకవర్గం బాధ్యతలను ఆయనకు అప్పగించడంతో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఘనత వీరయ్య చౌదరికి దక్కిందన్నారు. పార్టీలో క్రమశిక్షణ కలిగిన యువ నేతగా ఎదుగుతున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరమన్నారు. యువగళం పాదయాత్ర వంద రోజులు చేపట్టిన నారా లోకేష్‌కి వెంట ఉండి ఆయన సంకల్పాన్ని నెరవేర్చిన వారిలో వీరయ్య చౌదరి ఒకరన్నారు. అమరావతి రైతుల పాదయాత్రకు మద్దతు పలికిన ఆయన ఏంటో మరోసారి నిరూపించుకున్నారని చౌదరి ఘనత >>2



బుధవారం పహల్గాం దాడికి సంబంధించి రక్షణ, భద్రతా వ్యవహారాల కేబినెట్ సమావేశం దృశ్యం

# దేశం వీడాల్సిందే

## సార్క్ వీసా పాక్ పౌరులు సైతం వెళ్లాల్సిందే

### ఇండస్ నదీ జలాల ఒప్పందం రద్దు

### ఇరు రాయబార కార్యాలయాల్లో సిబ్బంది కుదింపు

### మే 1వ తేదీలోపు అమలు: భద్రతా కేబినెట్ కమిటీ నిర్ణయాలు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భద్రతా కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఉగ్రదాడుల్లో మృతులకు సంతాపం తెలిపింది. ఉగ్రదాడికి ప్రతిగా కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960లో కుదిరిన ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అటారీ చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్లు >>2

# పిఎస్ఆర్‌కు రిమాండు

విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర ఇంటలిజెన్స్ మాజీ ఛీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులును విజయవాడ కోర్టు రిమాండ్ విధించింది. ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసులో మంగళవారం ఆయనను అరెస్ట్ చేసిన విషయం విదితమే. బుధవారం ఉదయం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం మూడవ అదనపు ఛీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. మే 7 వరకు న్యాయమూర్తి ఆయనకు రిమాండును విధించారు. దీంతో ఆయనను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.



## లిక్కర్ స్కాం బిగ్‌బాస్ గుట్టు తీస్తాం

-మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి: మద్యం స్కాంలో బిగ్ బాస్ బండారం బయట పెడతామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని స్కాములకు కేంద్రంగా మార్చారని ఆయన మండిపడ్డారు. జగన్ రెడ్డికి అడ్డగోలుగా సహకరించిన వారంతా జైలు పాలవ్వడం తథ్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మద్యం స్కాం వెనుక పెద్ద రాకెట్ ఉందని విజయసాయి బయటపెట్టారని తెలిపారు. స్కాముల్ని కప్పిపుచ్చుకోవడానికే గోవుల మరణాల డ్రామా అని మంత్రి దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. మంత్రి జగన్ పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఒక్కో ఇటుక పేర్చి బాగు చేస్తున్నామన్నారు. >>2

# కెసిరెడ్డికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి: మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి విజయవాడ ఎసిబి ప్రత్యేక కోర్టు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ మేరకు న్యాయాధికారి భాస్కరరావు మంగళవారం అర్ధరాత్రి 12.30కు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయనను పోలీసులు విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. అంతకుముందు కెసిరెడ్డిని కోర్టులో హాజరుపర్చిన సందర్భంగా న్యాయాధికారి ప్రాథమిక దశలో అభ్యంతరం వ్యక్తం చేశారు. సిఐడి కోర్టులో కూడ హాజరుపర్చాల్సిందని వ్యాఖ్యానించారు. ఒ దశలో రిమాండ్‌ను తిరస్కరిస్తాను మెమోను సవరించుకొని సిఐడి కోర్టులో హాజరుపర్చండి అని సూచించారు. సిఐడి తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్,పీపీ కళ్యాణి వాదనలు వినిపిస్తూ అవినీతి నిరోధక చట్టం(పీసీ యాక్ట్)తో ఈ కేసు ముడిపడి ఉంది. నిందితుడు కెసిరెడ్డికి జ్యుడీషియల్ రిమాండ్ విధించే విచారణాధికార పరిధి ఏసీబీ కోర్టుకు ఉంది. ఇదే కేసులో మూడో నిందితుడు అప్పటి ప్రత్యేక అధికారి సత్యప్రసాద్‌ను సిసి చట్టం క్రింద విచారించేందుకు కాంపిటెంట్ అథార్టీ నుండి సెక్షన్ 17(ఎ) అనుమతి లభించిందని న్యాయాధికారి దృష్టికి తెచ్చారు. కెసిరెడ్డి విషయంలో 17(ఎ) అనుమతి అవసరం లేదా? అని న్యాయాధికారి భాస్కరరావు ప్రశ్నించగా అవసరం లేదని ఏజి బదులిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఐటి సలహాదారుగా ఉంటూ ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో అధికారులను కెసిరెడ్డి ప్రభావితం చేశారు. ఆ కార్పొరేషన్‌లో ఆయన ప్రభుత్వ ఉద్యోగి కాదు. అందులో అధికారిక విధులు నిర్వర్తించలేదు. కాబట్టి 17(ఎ) అనుమతి అవసరం లేదు అని వాదించారు.

**రిమాండ్ రిపోర్టులో సెక్షన్ల మార్పు**

ఇక ఎసిబి ప్రత్యేక కోర్టులోనిందితుడు కెసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదిస్తూ రిమాండ్ విధించే పరిధి ఎసిబి కోర్టుకు లేదు. అరెస్టుకు గల కారణాలను పేర్కొంటూ సోమవారం నిందితుడికి అందజేసిన మెమోలో పీసీ యాక్ట్ లోని సెక్షన్లు లేవు. తాజాగా సిఐడి అందజేసిన రిమాండ్ రిపోర్టులో పీసీ యాక్ట్ సెక్షన్లను చేర్చారు. రిమాండును తిరస్కరించాలని కోరారు. దమ్మాలపాటి జోక్యం చేసుకొని రిమాండ్ నివేదికలో పీసీ యాక్ట్ ప్రస్తావన ఉంటే వాలన్నారు. ఏ3 విచారణ నిమిత్తం సెక్షన్ 17(ఎ) అను మతి లభించిన విషయాన్ని గుర్తు చేశారు. >>2

# పదవ తరగతిలో బాలికలదే పైచేయి

### 84.09 శాతం ఉత్తీర్ణత సాధించిన బాలికలు, బాలుర ఉత్తీర్ణత 78.31 శాతమే

### కాకినాడకు చెందిన నేహాంజని అనే విద్యార్థినికి 600కు 600 మార్కులు

### యలమంచిలికి చెందిన అనిత అనే విద్యార్థినికి 599 మార్కులు

విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో 10వ తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. మంత్రి లోకేశ్ ఆన్‌లైన్‌లో ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మొత్తం 81.14 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 93.90 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నిలవగా 47.64 శాతం ఉత్తీర్ణతతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. 84.09 శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించగా 78.31 శాతం ఉత్తీర్ణతతో బాలురు నిలిచారు. మే 19 నుంచి 28 వరకూ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తరగతి పరీక్షలకు 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 4,98,585 మంది ఉత్తీర్ణత సాధించారు. 1,680 పాఠశాలల్లో వందశాతం ఫలితాలు వచ్చాయి. కాకినాడ చెందిన నేహాంజని అనే విద్యార్థిని 600కు 600 మార్కులు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది.నగరంలోని భాష్యం పాఠశాలలో బాలిక చదువుతోంది. యలమంచిలి చైతన్య స్కూల్‌లో చదువుతున్న ఎండ అనిత అనే విద్యార్థిని 599 మార్కులు సాధించింది. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి 598 మార్కులువచ్చాయి. ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్‌లో చదువు



తున్న పావని చంద్రిక ఈ ఘనత సాధించింది. టెన్త్ ఫలితాలను గమనించినప్పుడు సబ్జెక్టులవారీగా ఉత్తీర్ణత పరిశీలిస్తే మొదటి ల్యాంగ్వేజ్‌లో 95.94శాతంమంది, రెండవ ల్యాంగ్వేజ్‌లో 99.51శాతం, థర్డ్ ల్యాంగ్వే >>2

# వివిపి బ్రేక్ దర్శనాల సమయం మార్పు

## ట్రయల్‌రన్‌కు 'బ్రేక్'?

### వేసవిసెలవుల్లో సామాన్యభక్తులకే ప్రాధాన్యం!



తిరుమల,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి విఐపి బ్రేక్‌దర్శనాల సమయం మార్పు దిశగా అడుగులేస్తోమని, ప్రస్తుతం అమలవుతున్న విధానంలో ఏకధాటిగా మూడు, మూడున్నరగంటలపైగా విఐపిలకే సమయం సరిపోతోందని టిటిడి ట్రస్ట్‌బోర్డు ప్రకటనచేసింది. సర్వ్యా నెలరోజుల క్రితం తిరుమలలో బోర్డు సమావేశంలో విఐపి బ్రేక్ దర్శనాల సమయాన్ని రెండేళ్లక్రితం అమలైన పాత విధానం ఉదయం 5గంటల నుండి 8గంటల వరకు తిరిగి పునః ప్రవేశపెడతామని, ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని ప్రకటించారు. అయితే నెలరోజులు కావస్తున్నా ఇప్పటికే బ్రేక్ దర్శనాలు ఉదయం 10గంటలకే అమలవుతున్నాయి. దీనివల్ల కంపార్టుమెంట్లలో భక్తులు గంటలతరబడి వేచివుండే పరిస్థితులు పునరావృతమవుతున్నాయి.ఈ సమయాన్ని మార్పుచేస్తామని బోర్డు ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. కానీ కొత్తసమయం ఇంకా అమలుకు నోచుకోలేదు. రానున్న రెండున్నరనెలలు వేసవిసెలవులు కావడంతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు వేసవిసెలవులు మొదలవడంతో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇప్పటికే గత పది రోజులుగా తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా కొనసాగుతోంది. సర్వదర్శనానికి 20గంటలపైగానే సమయం పడుతోంది. 2022వ సంవత్సరం సెప్టెంబర్‌నెలనుండి విఐపి బ్రేక్ దర్శనాల వేళలను అప్పటి వైవిసి ట్రస్ట్‌బోర్డు మార్పుతీసుకువచ్చింది.

**2022లోనే బ్రేక్ దర్శనాల సమయం మార్పు:**

ఇష్టదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునే విధానంలో విఐపి బ్రేక్‌దర్శనాలకు కొంత ప్రత్యేకత వుంది. ఈ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులను కులశేఖరపడి,రాములవారిమాడ గడప వరకు అనుమతిస్తారు. 2002 సెప్టెంబర్‌కు ముందు తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాల వేళలు ప్రోటోకాల్ విఐపి దర్శనాలు >>2

# టెక్నాలజీ అతి వినియోగం అనర్ధమే

## - మంత్రి పార్థసారథి

విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి: ఏ సాంకేతిక పరిజ్ఞానాన్నైనా ఎంత వరకు జీర్ణించుకోగలమో అంత వరకే వినియోగించుకోవాలని సూచిస్తూ అతిగా వినియోగిస్తే మాత్రం ఇబ్బందులకు దారి తీస్తుందని సమాచార ,పౌరసంబంధాల శాఖామంత్రి కె పార్థ సారథి, వ్యాఖ్యానించారు. ఏ సాంకేతిక పరిజ్ఞానాన్నైనా మానవాళి అభివృద్ధి మాత్రమే వినియోగించుకోవాలని అన్నారు. ఎలా వినియోగించుకోవాలనే విచక్షణ కోల్పోతే మాత్రం వైపరీత్య పరిణామాలు సంభవిస్తాయని అన్నారు. >>2




# పిఓకెలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు

శ్రీనగర్, ఏప్రిల్ 23: భారతదేశ వ్యతిరేకంగా పాకిస్తాన్ ఉగ్రవాద కార్యాలను నడుపుతోంది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పీఓకేలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇవి నియంత్రణ రేఖకు సమీపంలోనే ఉన్నట్లు నిఘా వర్గాలు తాజాగా గణాంకాలు విడుదల చేశాయి. అందులో వందల సంఖ్యలో ముష్కరులు శిక్షణ పొందుతున్నట్లు సమాచారం. పహల్గాం సమీపంలోని పర్యాటక కేంద్రం బైసరన్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఉగ్ర తండాల వివరాలను నిఘావర్గాలు వెల్లడించాయి. నియంత్రణ రేఖకు సమీపంలోని పీవోకేలో ఉన్న 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాల్లో 115 నుంచి 130 మంది ఉగ్రవాదులు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అందులో 115 మంది పాకిస్తాన్ జాతీయులని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక జమ్ముకశ్మీర్ వివయానికొస్తే 130 నుంచి 140 మంది వరకు ఉగ్రవాదులు ఉండొచ్చని భద్రతా దళాలు అంచనా వేశాయి. కశ్మీర్ లోయలో 70నుంచి 75 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గాఉన్నట్లు సమా >>2

# బిసి హాస్టళ్లలో ఇన్వర్టర్లు, సిసి కెమెరాలు

## - సిఎం చంద్రబాబు నాయుడు

విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి: బిసి హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సిఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భాగంగా ప్రతి హాస్టల్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ ఇన్వర్టర్లతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని స్పష్టంచేశారు.తాజాగా టెన్త్ ఫలితాల్లో బిసి హాస్టళ్ల విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించడం అభినందనీయమన్నారు. ఏపి చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా బిసిల అభ్యున్నతికి అత్యధిక నిధులు కేటాయించామన్నారు. అందులో భాగంగా బిసి హాస్టళ్ల మరమ్మతులకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. బిసి హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యంగా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా హాస్టళ్లలో ఇన్వర్టర్లతో పాటు విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తల్లిదండ్రులు ఏ నమ్మకంతో అయితే తమ పిల్లలను బిసి హాస్టళ్లకు పంపుతున్నారో, ఆదే భరోసాతో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతున్నామన్నారు. 2014-19లో అప్పటి టిడిపి ప్రభుత్వం బిసి భవన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ భవనాలన్నీ 70 నుంచి 80 శాతం పూర్తయ్యాయన్నారు. తరవాత వచ్చిన జగన్ ఆ నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బిసి భవన్లతో పాటు కొత్త జిల్లాల్లోనూ నూతన భవనాలు నిర్మించనున్నామన్నారు. ఏపి బడ్జెట్లో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.39 వేల కోట్లకు పైగా కేటాయించామన్నారు. గత ప్రభుత్వం బిసి హాస్టళ్లను కూడా గాలికి వదిలేశారన్నారు. హాస్టళ్ల మరమ్మతులకు రూపాయి కూడా నిధులివ్వలేదని, చివరికి విద్యార్థుల డైట్ బిల్లులు కూడా చెల్లించలేదని అన్నారు. రంగుల రెడ్డికి భవనాలకు రంగుల వేయడంపై ఉన్న శ్రద్ధ హాస్టళ్ల నిర్వహణపై చూపలేదని జగన్‌పై తీవ్ర ఆగ్రహం >>2

# సీమలో అధునాతన శాప్ క్రీడా కాంప్లెక్స్‌లు

## - క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతి క్రీడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: రాయలసీమకు తలమానికమైన తిరుపతిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో శాప్ ఆధ్వర్యంలో క్రీడా సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేశామన్నారు. తాజాగా తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏపి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన అత్యాధునీకరణ పనులను ముఖ్యఅతిథిగా హాజరైన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, శాప్ ఛైర్మన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా >>2

వార్త, కడప, గురువారం 24, ఏప్రిల్ 2025



శ్రీనగర్‌లో సొంతూళ్లకు వెళ్లేందుకు వేచిఉన్న పర్యాటకులు

# ఎప్పటికీ ప్రమాదమే

>> ఆమోఘం అన్నారు.

**మంత్రులు, ఎమ్మెల్యేల రాక:**

అమ్మనబ్రోలులో నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, ఇతర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, మంత్రి బాలవీరాంజనేయస్వామి, అనగాని సత్యప్రసాద్, వీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్లజనార్దన్, మార్కెటింగ్ బోర్డుచైర్మన్ సత్య, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, ఒంగోలుఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతాపం తెలియజేశారు.

**హత్య చేసిన వారి గురించి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వొచ్చు: చంద్రబాబు**

వీరయ్య చౌదరిని హత్య చేసిన వారి గురించి ఆచూకీ తెలిస్తే ఎవరైనా సమాచారం ఇవ్వొచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. వీరయ్య చౌదరిని హత్య చేసిన వాళ్ల గురించి గోప్యంగా తెలియజేయాలంటే టోల్ ఫ్రీ నెంబరు 9121104784 కు ఫోన్ చేసి చెప్పొచ్చన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.



బుధవారం అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కుటుంబ సమేతంగా తాజ్‌మహల్‌ను సందర్శించిన దృశ్యం

# శాప్ క్రీడా కాంప్లెక్స్‌లు

>> స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అత్యాధునికరించిన ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రం, రైఫిల్ షూటింగ్ రేంజ్, మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ, స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరినా, పికిల్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, విద్యుత్ లైటింగ్ ఆధునీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మండిపల్లి మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ సిటీ, సీఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులను కల్పించడంతో పాటు పేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశానికి ఆదర్శవంతంగా హైదరాబాద్‌లో ఆనాడే అత్యుత్తమ క్రీడాసదుపాయాలను సీఎం చంద్రబాబు నాయుడు నెలకొల్పారన్నారు. క్రీడాకారులకు మేలు చేయడంతోపాటు వారికి గౌరవాన్ని కల్పించేలా క్రీడలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అనేక పనిచేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ. 120కోట్లు కాజేసిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే 16,400 పోస్టులకు మెగా డీఎస్సీని విడుదల చేయడంతోపాటు స్పోర్ట్స్ కోటా కింద 3శాతం అమలు చేస్తూ క్రీడాకారులకు 450కి పైగా ఉద్యోగాలు కల్పించనున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాజధాని అమరావతిలో వెయ్యి ఎకరాల్లో త్వరలోనే స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని, దానికి సంబంధించి మంత్రివర్యులు నారాయణ కూడా కసరత్తు చేస్తున్నారన్నారు. టీటీడీ నిధుల దుర్వినియోగంపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని, వైసీపీ నేతల్లా కరుణాకర రెడ్డి పేరుతో శ్రీవెంకటేశ్వరుని నిధులను మేమేమీ కాజేయలేదని హెచ్చరించారు. క్రీడల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, క్రీడాకారులకు ముందస్తుగానే ఆర్థిక ప్రోత్సాహకాలు, రవాణా భత్యాలు అందజేస్తున్నామ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు అన్నారు. కూటమి ప్రభుత్వంతో క్రీడలకు పూర్వవైభవం చేకూరుతోందని, తిరుపతి వేదికగా క్రీడాసదుపాయాలను నెలకోల్పడం సంతోషదాయకమని ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు వివరించారు. సమర్థవంతంగా క్రీడల అభివృద్ధి.. తిరుపతిలో సమర్థవంతంగా క్రీడలను అభివృద్ధి చేయంతోపాటు క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు సాయశక్తులా కృషి చేస్తున్నామని శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రతినబూనారు.

# పిఒకెలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు

>> వారం. 60 నుంచి 65 మంది జమ్ము, రాజౌరీ, పూంచ్ రీజియన్లలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. జమ్ము కశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నారని భద్రతాసంస్థలు వెల్లడించాయి. వారిలో అత్యధికంగా లష్కరే తోయిబా ముఠా సభ్యులే ఉన్నట్లు పేర్కొన్నాయి. అందులో 18 మంది జైషే మహమ్మద్, 35 మంది లష్కరే తోయిబా, ముగ్గురు హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందినవారు ఉన్నారు. మరో 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదులతో పోలిస్తే స్థానిక ఉగ్రవాదుల సంఖ్య తక్కువగా ఉంది. విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని అధికారులు అంటున్నారు. మంగళవారం జరిగిన ఉగ్ర దాడిలో ఇద్దరు విదేశీయులుసహా 26 మంది పర్యాటకులు చనిపోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ దాడికి లష్కరే తోయిబాకు అనుబంధంగా పనిచేస్తున్న ది రెసిస్టెంట్ ఫ్రంట్ బాధ్యత తీసుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని సమాచారం. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నారు. కశ్మీర్‌లో గత కొంతకాలం నుంచి పర్యాటకుల తాకిడి పెరిగిన తరుణంలోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భద్రతా దళాలు భావిస్తున్నాయి.

# 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

>> రిమాండ్‌కు డిఫెండ్ చేసుకోవడానికి నిందితునికి అన్ని వివరాలు అందచేసామన్నారు. తన వాదనలకు బలం చేకూరేలా పలు తీర్పులను ఉటంకించారు. రూ. 3,200 కోట్ల మద్యం కుంభకోణంలో కెసిరెడ్డి కీలక పాత్ర పోషించారని,నేర తీవ్రత దృష్ట్యా నిందితునికి జ్యుడిషియల్ రిమాండ్ విధించాలని కోరారు. న్యాయమూర్తి భాస్కరరావు నిందితుడు కెసిరెడ్డితో మాట్లాడారు. సిఐడి అధికారులు అరెస్ట్‌కు గల కారణాలను తెలియచేశారా? విచారణకు హాజరుకావాలంటూ నోటీసులిచ్చారా? ఇంట్లో తనిఖీలు చేశారా? తెలియచేశారా?విచారణకు హాజరుకావాలంటూ నోటీసులిచ్చారా?ఇంట్లో తనిఖీలు చేశారా?ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం నిందితునికి మే 6 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చారు.

# బాలికలదే పైచేయి

>> జ్‌లో 96.10 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. గణితంలో అత్యల్పంగా 86.92 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా సైన్స్ సబ్జెక్టులో 90.17 శాతం మంది, సోషల్‌లో 92.90 శాతం మంది పాసయ్యారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 83.19 శాతం మంది పాస్ కాగా తెలుగు మీడియం విద్యార్థులు 58.59 శాతం మంది పాసయ్యారు. హిందీ మీడియంలో 100 శాతం మంది, ఉర్దూ మీడియంలో 70.71 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను జిల్లాలవారీగా పరిశీలిస్తే 93.90 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానం, 91.43 శాతంతో బీ.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 2వ స్థానం, 89.14 శాతం ఉత్తీర్ణతతో విశాఖ జిల్లా మూడవ స్థానాల్లో నిలిచాయి. గుంటూరు, అనకాపల్లి, తూర్పుగోదావరి, విజయనగరం, ఎన్టీఆర్, ప్రకాశం, కృష్ణా జిల్లాలు ఆ తర్వాతి 10 స్థానాల్లో నిలిచాయి. పల్నాడు, బాపట్ల, నెల్లూరు, శ్రీకాకుళం, కాకినాడ జిల్లాలు ఆ తర్వాతి 15 స్థానాల్లో నిలిచాయి. 16వ స్థానంలో పశ్చిమ గోదావరి, 17వ స్థానంలో నంద్యాల, 18వ స్థానంలో కడప, 19వ స్థానంలో తిరుపతి, 20వ స్థానంలో అన్నమయ్య జిల్లాలు నిలవగా ఏలూరు, సత్యసాయి, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఫలితాల్లో బాలురతో పోలిస్తే బాలికలు 5.78 శాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. 19 పాఠశాలల్లో సున్నాశాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యధికంగా 95.02 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత 10 ఏళ్ల ఫలితాలతో పోలిస్తే 2015 నుంచి 2019 వరకు 90శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2020, 2021ల్లో కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించకుండానే విద్యార్థులందరినీ పాస్ చేయడంతో 100 శాతం ఫలితాలు నమోదయ్యాయి. 2022లో అతి తక్కువగా 65.26శాతం ఫలితాలు నమోదయ్యాయి. మార్కుల వారీగా ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లను ఆయా పాఠశాలలకు పంపించనున్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్లు విద్యార్థులకు వాటిని అందచేయాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినవిద్యార్థులు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఉత్తీర్ణత సాధించనివారు నిరుత్సాహపడకుండా సప్లమెంటరీలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీకౌంటింగ్ లేదా రీవెరిఫికేషన్‌కు రేపటి నుంచి (24ఏప్రిల్) మే 1వ తేదీ వరకూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ ఫలితాలను వెబ్‌సైట్ చూసుకునే అవకాశం కల్పించారు.మనమిత్ర వాట్సప్, లీప్ యాప్‌లోనూ పదోతరగతి ఫలితాలు. వాట్సప్ నెంబర్ 95523 00009కు హాయ్ అని మెసేజ్ పంపి పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని, వారి రోల్ నంబర్‌ను నమోదు చేస్తే ఫలితాల పిడిఎఫన కాపీ ద్వారా వస్తాయి.

# లిక్కర్ స్కాం బిగ్‌బాస్ గుట్టు తీస్తాం

>> వైఎస్సార్సీ అరాచకం కారణంగానే అమరావతి, పోలవరం నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిందని విమర్శించారు. ఆడబిడ్డల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. దాడులు, హత్యాయత్నాలు చేసినోళ్లకు పదవులిచ్చిన ఘనత జగన్ రెడ్డిదని విమర్శించారు. దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది పేర్ని నాని వ్యవహారమని మంత్రి ఎద్దేవా చేశారు.పేదల బియ్యం గురించి ప్రశ్నిస్తే మట్టి దోపిడీ అంటూ హడావుడి చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు.

మట్టి దోపిడీ ఎవరి హయాంలో జరిగిందో ప్రజల్ని అడిగి తెలుసుకుందామని సవాల్ చేశారు. ఫిషింగ్ హార్బర్, బందరు పోర్టు పనులు ప్రారంభించింది టిడిపి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం అజెండాగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మచిలీపట్నంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. పి4 కార్యక్రమం ద్వారా మచిలీపట్నంలో పేదరికాన్ని నిర్మూలిస్తానన్నారు. ప్రజాస్వామ్యంలో సంఘు విద్రోహ శక్తులకు స్థానం లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. త్వరలో మాజీ సీఎం జగన్ అవినీతి గుట్టురట్టుకావడం ఖాయమన్నారు.ఒక్కో దొంగ బయటకు వస్తున్నారన్నారు.ఎవ్వరిని వదిలేది లేదన్నారు.

# దేశం వీడాల్సిందే

>> ప్రకటించడంతో పాటు పాకిస్థాన్ పర్యాటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. కేబినెట్ భేటీలో తీసుకున్న కీలక నిర్ణయాలను భారత విదేశంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు తెలిపారు. 1960లో కుదిరిన ఇండస్ జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తోంది. ఇది తక్షణమే అమల్లోకి వస్తోంది. సరిహద్దు ఉగ్రవాదాన్ని పాక్ నిలిపివేసేంత వరకూ ఈ నిర్ణయం అమలు చేయనుంది. అటారి ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ తక్షణమే మూసివేత. ఇప్పటికే ఆ మార్గం ద్వారా వచ్చిన వారు 2025 మే 1లోగా తిరిగి వెళ్లవచ్చు.పాకిస్తాన్ పౌరులకు వీసాలపై భారతదేశ ప్రవేశం నిషిద్ధం. ఇంతకుముందు జారీచేసిన వీసాలురద్దు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాక్ పౌరులు 48 గంటల్లోగా దేశం విడిచివెళ్లాలి. సార్క్‌వీసాలకు ఇచ్చిన మినహాయింపును కూడా నిలిపివేసింది. ఈ వీసాతో ఉన్నవారంతా కూడా రెండు రోజుల్లో దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. పాకిస్థాన్, భారత్ సరిహద్దులో ఉన్న అట్టారి సమీకృత చెక్‌పోస్టునుకూడా వెంటనే మూసివేయాలని నిర్ణయించినట్లు విక్రమ్ మిస్రీ తెలిపారు. ఆ దారిలో భారత్‌కు వచ్చిన పాకిస్తాన్‌వాసులు వచ్చేనెల ఒకటవ తేదీలోపు వెళ్లిపోవాలని ఆదేశించింది. న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నౌకాదళ, వాయుసేన సలహాదారులను 'పర్సోనా నాన్ గ్రాటా'గా ప్రకటించి, వారిని వారంలోగా దేశం విడిచి వెళ్లమని ఆదేశించింది. భారత హైకమిషన్, ఇస్లామాబాద్ నుంచి భారత్ తన సలహాదారులను వెనక్కి వచ్చేయాలని ఆదేశించింది. ఈ పదవులను రద్దు చేసింది. అలాగే 5 మంది సపోర్ట్ స్టాఫ్ కూడా వెనక్కి పిలిపించనుంది. భారత్, పాకిస్తాన్ హైకమిషన్లలోని సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి తగ్గించనుంది. ఈ మార్పులు 2025 మే 1లోగా అమల్లోకి వస్తాయి. దేశ భద్రతా పరిస్థితిని సమీక్షించింది. అన్ని భద్రతా బలగాలు అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్న ఆదేశాలు ఇచ్చింది.ఈ ఉగ్రదాడికి పాల్పడిన వారిని చట్టానికి లోబడి శిక్షించడమే కాక, వారికి మద్దతు ఇచ్చిన వారినీ చర్యలను బహిరంగంగా బహిర్గతం చేసి చర్యలు తీసుకుంటామని సంకల్పించింది. తహవ్వూర్ రాణాను భారతదేశానికి అప్పగించిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, ఉగ్రవాదం పట్ల కఠినమైన ధోరణిని భారత్ కొనసాగిస్తుందని స్పష్టం చేసింది.

**పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి లష్కర్ ఏ తోయిబా టెర్రరిస్టు ఖలీద్**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో బైరసీన్ వద్ద పర్యాటకులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబాకు చెందిన గజ టెర్రరిస్టు ఖలీద్‌గా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) తేల్చింది. ఈ దాడిలో 27 మంది ప్రాణాలు కోల్పోగా మరో 20 మందిగా యపడిన విషయం తెలిసిందే. ఈ ఘటన తరువాత విచారణ నిమిత్తం రంగంలో దిగిన ఎన్ఐఎ అనేక విషయాలను వెలుగులోకి తెచ్చింది. ఇందులో ముఖ్యమైనది ఈ దాడికి సూత్రధారి ఖలీద్‌గా తేల్చింది. దాడికి పాల్పడిన ముగ్గురు ముష్కరుల రేఖా చిత్రాలను ఎన్ఐఎ విడుదల చేసింది. లష్కర్ ఏ తోయిబాలో ఖలీద్ కీలక వ్యక్తి. పాక్‌కు చెందిన 30 ఏళ్ల వయస్సున్న ఖలీద్ అసలు పేరు సైఫుల్లా కసూరి. లష్కర్ ఏ తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడు. ఖలీద్ ప్రస్తుతం లష్కర్ ఏ తోయిబా పెషావర్ ప్రధాన కార్యాలయానికి అధిపతిగా వున్నాడు. ఇదే సమయంలో మిల్లీ ముస్లిం లీగ్ సంస్థకు అధ్యక్షుడు కూడా. ఈ సంస్థ హాఫీజ్ సయీద్‌కు చెందిన జమాత్ ఉద్ దవాకు రాజకీయ విభాగంగా పనిచేస్తోంది. జమాత్ ఉద్ దవా ప ంజాబ్ ప్రావిన్స్ సమన్వయ విభాగం కూడా ఖలీద్ చూస్తున్నాడని ఎన్ఐఎ విచారణలో తేలింది. జమాత్ ఉద్ దవా లష్కర్ ఏ తోయిబాతో సంబంధాలు వున్నట్లు తేలడంతో దీనిపై అమెరికా ఉగ్రవాద సంస్థ ముద్రవేసి నిషేధం విధించింది. కాగా పహల్గాం దాడికి సూత్రధారి ఖలీద్ కాగా దాడికి పాల్పడ్డ ఉగ్రమూకల బృందానికి నాయకత్వం వహించింది మాత్రం ఆసిఫ్ ఫౌజీగా ఎన్ఐఎ విచారణలో తేలింది. ఇతను కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ ఎఫ్)లో కీలక నేతగా ఎన్ఐఎ తేల్చింది. పాక్ కేంద్రంగా పనిచేసే బడా ఉగ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబాకు టిఆర్‌ఎఫ్ మరో అనుబంధ సంస్థ. కాగా ఫౌజీ జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వాడు. ఇతను పాకిస్తాన్ ఆర్మీతో కలిసి పనిచేయడం వల్ల ఫౌజీ అని పేరు చేరింది. కాగా పహల్గాం దాడి తరువాత ఉగ్రవాదులు ముజఫరాబాద్ లోని సేఫ్ హౌజ్ దిశగా వెళ్లారని ఎన్ఐఎకు ఆధారాలు లభించాయి. పహల్గాం దాడికి పాల్పడ్డ నలుగురు ఉగ్రవాదుల ఫోటోలను ఎన్ఐఎ విడుదల చేసింది. కాగా పహల్గాం దాడికి కారణమైన టిఆర్‌ఎఫ్ 2017లో కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తరువాత ఏ ర్పాటవగా అప్పటి నుంచి కాశ్మీరేతరులు, వలస కూలీలను టార్గెట్ చేస్తోంది. 2021లో శ్రీనగర్‌లో వాయుసేన స్థావరంపై డ్రోన్ల దాడులకు కూడా ఈ సంస్థ కారణంగా తేలింది. 2020 నుంచి ఈ సంస్థ జమ్మూ కాశ్మీర్‌లో 50 మంది వరకు వలస కూలీలు, కాశ్మీరేతరులు, భద్రతా బలగాలను అంతమొందించింది. ఈ సంస్థ కమాండర్‌గా వున్న సజ్జాద్ గుల్‌ను కేంద్రం ఇప్పటికే ఉగ్రవాదిగా ప్రకటించగా ఇతను పాక్‌లో తలదాచుకున్నాడు. టిఆర్‌ఎఫ్‌లో వున్న ఉగ్రవాదుల్లో ఎక్కువగా స్థానికులే వున్నట్లు పోలీసు చెబుతున్నారు. టిఆర్‌ఎఫ్ సభ్యులకు కాశ్మీర్‌లోని పలు చోట్ల ఆశ్రయాలు లభిస్తుం డడంతో పాటు వారికి ఆహారం ఇతర సహాయాలు అందుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# కుట్రలు పన్నేవారిని ఊరికే వదలబోం!

## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టి బదులిస్తుందని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆ ఉగ్ర దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదనవ్యక్తంచేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని, ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని రాజ్‌నాథ్ సింగ్‌చెప్పారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వాళ్లను, కుట్ర పన్నిన వాళ్లను బయటకు లాగి తగిన బుద్ధి చెబుతామన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 24-04-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.ఏకాదశి మ.2.27
శతభిషం ఉ.10.45
వర్జ్యం మ.3.48-సా.5.03
దు.ఉ.10.00-10.51, 2) మ.3.03-3.54
శుభసమయం : ఉ.6.20-6.50
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులుపెడతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృషభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్ధవంతంగా నిర్వ హిస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మిథునం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**సింహం:** ఋణ వత్తిడులు ఎదురైన చికాకులు పెడతాయి. కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**తుల :** వృత్తి, వ్యాపారాలు అనుకూలంగా వుంటుంది. బంధువుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి.

**మకరం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కుంభం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం

**మీనం:** వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇన్వర్టర్లు, సిసి కెమెరాలు

>> వ్యక్తంచేశారు. హాస్టల్ భవనాలకు రంగు మార్చో...పేరు మార్చో...నిర్మాణాలు పూర్తి చేసి ఉంటే బిసి విద్యార్థులకు ఎంతో మేలు కలిగేదన్నారు. గత 5 ఏళ్లు బిసిలను అన్ని విధాలా అన్యాయం చేసి.. బిసి ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బిసి కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు అందజేయనున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను రూపొందించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. బిసి హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. హస్టళ్ళను సందర్శించినప్పుడు...తీవ్రమైన సమస్యలను గుర్తించామన్నారు. విద్యార్థులకు డైట్ బిల్లులు కూడా రాలేదని వార్డెన్లు తెలిపారన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి...డైట్ బకాయిలు చెల్లించామన్నారు. ఇప్పుడు అన్ని హాస్టళ్లలోనూ నాణ్యమైన ఆహారం విద్యార్థులకుఅందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు హాస్టల్ లోని అన్ని గదులు శుభ్రంగా ఉండాలన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, బిసిలు అభివృద్ధికి ప్రాధాన్యం లభిస్తుంటుందని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ఎస్టీ, బిసి, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లను గాలికొదిలేసిందన్నారు. నా ఎస్సీలు...నా ఎస్టీలు...నా బిసిలు...అంటూ బడుగు బలహీన వర్గాల వారిని జగన్ ఓటు బ్యాంకుగా చూశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి బిడ్డలు చదువు కోవడం జగన్ కు ఇష్టంలేదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోలేదన్నారు. చిన్న చిన్న మరమ్మతులకు నిధులు కూడా మంజూరు చేయలేదన్నారు. చివరికి విద్యార్థులకు ఇవ్వాల్సిన డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించలేదన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల మరమ్మతులకు, విద్యార్థుల డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించిన విషయాన్ని మంత్రి సవిత తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసి బిడ్డల విద్యకు, అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.

# బ్రేక్ దర్శనాల సమయం మార్పు

>> ఉదయం 5గంటలకు మొదలైతే, శుక్రవారం రోజు 6గంటలకు అనుమతినిచ్చేవారు. విఐపిల సిఫార్సులేఖల ద్వారా టిక్కెట్లు కలిగిన భక్తులను ఆది,సోమ,మంగళ,బుధ వారాలు ఉదయం 6.30గంటలకు, గురువారం 7.30గంటల ప్రాంతంలో, శుక్రవారం 8.30గంటల సమయంలో ఇలా అనుమతించారు. దీనివల్ల వేర్వేరు సమయాలు అమలవుతుండటంతో సామాన్యభక్తుల సర్వదర్శనాల సమయం మరింత ఆలస్యమయ్యేది. రాత్రి సమయంలో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో రాత్రంతా గంటలుగంటలు వేచివుండే సామాన్యభక్తులు శ్రీవారి దర్శనం ముగించేలోపు ఉదయం 11గంటలుదాటిపోయేదని అప్పట్లో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అదేగాక విఐపి దర్శనాలు ఉదయత్పూర్వంవేళ ఉండటంతో అతిదిగృహాలు, విశ్రాంతి గృహాల గదులు మధ్యాహ్నం 1గంట వరకు కూడా చాలావరకు ఖాళీ చేయలేకపోయారు. సామాన్యభక్తులకు గదుల కేటాయింపు గగనంగా మారింది. అప్పట్లోనే బ్రేక్ దర్శనాల సమయంలో మార్పుచేస్తే విఐపిలు ఉదయం వేళ కొండకు చేరుకుని నేరుగా స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్ళిపోతారనే అభిప్రాయం వ్యక్తమైంది.

**సామాన్యభక్తులకు త్వరగా దర్శనానికే మార్పు!:**

తిరుమలకు వచ్చిన భక్తులు ఎక్కువ సమయం కంపార్టుమెంట్లలోనే వేచివుండేవారు. అప్పట్లో గదుల కొరత, మంచినీటి సమస్య ఎదురవడంతో విఐపి భక్తుల దర్శనాల వేళలను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు మార్పుచేశారు. కానీ ఇప్పుడు మధ్యాహ్నం 1గంట వరకు బ్రేక్ కొనసాగుతుండటం విశేషం. సామాన్యభక్తులను వేకువజామున 3.30-4గంటలకే దర్శనాలకు క్యూలైన్లలో అనుమతించి గంటసమయంలోనే శ్రీవారి దర్శనంచేసుకునేలా ఏకధాటిగా ఉదయం 7గంటల వరకు అమలవుతోంది. ఇప్పుడు చాలావరకు తిరుమలలో భక్తులకు గదుల కొరత తీరడం, నీటి సమస్య అధిగమించడంతో ప్రస్తుత కూటమి టిటిడి బోర్డు మళ్ళీ ఉదయం 5గంటలకే విఐపి బ్రేక్ దర్శనాలు అమలుచేస్తే మంచిదని అభిప్రాయంతో ముందుకు కదులుతోంది. ఇందుకు ట్రయల్‌రన్‌గా వారంరోజులు పరిశీలించాలని సూచించారు. అయితే గతనెలరోజులుగా ఈ నిర్ణయాలు అమలుకు నోచుకోలేదు. దర్శనాలు అమలుచేసే విదానంలో లోటుపాట్లు, సామాన్యభక్తుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని విఐపి బ్రేక్ సమయం మార్పుచేయడం మంచిదనే విషయంపై అధికారవర్గాలు ఆలోచనతో ఉన్నారు.

# టెక్నాలజీ అతి వినియోగం అనర్థమే

>> ఈ ఆలోచనలతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం నడుస్తోందని వాఖ్యానిస్తూ సాంకేతికను వినియోగించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందంజలో ఉందన్నారు. నేషనల్ పి ఆర్ డే సందర్భంగా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ వారు ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి కె పార్థ సారథి, ఆంధ్ర కేసరి యూనివర్శిటి,ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి, వైస్ ఛాన్సలర్, విజయవాడ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే నస్రత్ యం మండ్రూప్కర్, వారు ప్రధాన ఉన్యాసకులుగా పాల్గొన్నారు. విజయవాడలోని పి బి సిద్దార్థ కాలేజి ఆఫ్ ఆర్ట్స్ సైన్సెస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముందుగా సాంప్రదాయబద్దమైన జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ ప్రభుత్వ పనిని వాట్సప్ ద్వారా అందించే స్థాయిలో నేటి ప్రభుత్వం ఆధునిక సాంకేతక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో దేశానికే మార్గదర్శకునిగా ఉందన్నారు. సాంకేతికతను ప్రభుత్వ పనిని మెరుగు పరచుకోవడానికి ఎలా వినియోగించుకోవాలో ఆలోచించే వ్యక్తి చంద్రబాబు నాయుడు గారని ప్రశంసించారు. చంద్రబాబు నాయుడు కేవలం నేటి గురించి ఆలోచించే వ్యక్తి కాదని గతంలో 2020 విజన్ పేరుతో కొన్ని దశాబ్దాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పని చేసిన వాడని నేడు కూడా అదే రీతిలో 2047 విజన్ పేరుతో రాష్ట్రం, దేశ బాగు కోసం ఆలోచించే వ్యక్తని అన్నారు. అటువంటి వ్యక్తి ఆలోచనలను నేడు యువనాయకుడు లోకేష్ ముందుకు తీసుకొని వెళుతున్నారని ఇది రాష్ట్ర భవిష్యత్తు సురక్షితంగా ఉందనే భావనను అందించగలుగుతున్నారని ప్రశంసించారు.

ఇక మీడియా సాంకేతికతను వినియోగించుకోవాలని అదే సందర్భంలో దానిని ఎలా మంచికి వినియోగించుకోవాలనే విచక్షతతో పని చేయాల్సిన భాధ్యత మీడియా పైనే ఉంటుందన్నారు. ఇటీవల తెలంగాణలో ఒక భూమి అంశంపై ఏఐ వినియోగంపై జరిగిన రాద్దాంతం ఉదాహరణగా భావిస్తే టెక్నాలజీ ఎలా తప్పును ఒప్పుగా మారుస్తుందనే విషయాన్ని అందరి దృష్టికి తెచ్చిందని అలా జరుగుకుండా సాంకేతికను ఎలా, ఎంతవరకూ వినియోగించుకోవాలనే నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదే సందర్భంలో మీడియా కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఇతరులను బ్లాక్ మెయిల్ చేయడానికి కాకుండా మానవాళిని మంచి చేయడానికి వినియోగించుకోవాలని సూచించారు. ఇక సోషల్ మీడియా మితిమీరిన వినియోగం కూడా సరైనది కాదని అభిప్రాయపడ్డారు. ఛైర్మన్ అమరావతి చాప్టర్ వారు చాప్టర్ డా. జి. అనిత సంస్థ యొక్క కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమం యొక్క థీమ్ రెస్పాన్సిబిల్ యూజ్ ఆఫ్,రోల్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ రిలేషన్స్ (కృత్రిమ మేధస్సు యొక్క భాద్యతాయుతమైన వినియోగం - ప్రజా సంబంధాల పాత్ర ప్రాధాన్యతను వివరించారు. ఇప్పటికే సోషల్ మీడియా కారణంగా కొనసాగుతున్న గందరగోళాన్ని మరింత సంక్లిష్టపరుస్తోందని తెలిపారు.

నస్రత్ యం మండ్రూప్కర్ ప్రసంగిస్తూ సాంకేతక పరిజ్ఞానం కారణంగా ఎన్ని ఉపయోగాలున్నాయో అదే సందర్భంలో దానిని భాద్యతతో వినియోగించుకోకుండా, దుష్ఫలితాలను సరిగ్గా అంచనా వేయకుండా ముందుకు సాగితే సమాజానికి హాని కలిగే ప్రమాదముందని హెచ్చరించారు. అట్లని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోకుండా ఆపితే దాని వలన వచ్చే మంచి ఫలితాలకు దూరమయ్యే ప్రమాదముందని రైల్వే విభాగంలో ఏఐతో ఎలా మంచి ఫలితాలను రాబడుతున్నారో సోదాహారణంగా వివరించారు డివిఆర్ మూర్తిమాట్లాడుతూ ప్రింట్ మీడియా రోజుల నుండి నేటి సోషల్ మీడియా రోజులను నిశితంగా పరిశీలిస్తే పని తీరు, వార్తల ఎంపికతో పాటూ ప్రసార శైలి దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఏఐ వినియోగంతో ఈ పరిస్థితి మరింత జఠిలంగా మారుతోందని అన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి కె పార్థ సారథి మాట్లాడుతూ నేడు సోషల్ మీడియా దోరణులు చాలా దారుణంగా ఉన్నాయని దీనిని అరికట్టాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు.

**పర్యాటకులపై కాల్పులు అత్యంత హేయమైన చర్య: మంత్రి పార్ధసారధి**

జమ్మూ కాశ్మీర్‌లోని బైసరన్, పహల్గామ్, అనంత్‌నాగ్‌లలో అమాయక పర్యాటకులు, స్థానికులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడిని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి తీవ్రంగా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న, అనేక మందిని గాయపరిచిన సంఘటన అనాగరిక చర్య అన్నారు. మానవత్వం, శాంతి, కాశ్మీర్ ఆతిథ్య స్ఫూర్తిపై దాడిగా ఆయన పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సాను భూతిని తెలియజేస్తూ గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా మన్నారు. నాగరిక సమాజంలో ఇటువంటి హింసకు స్థానం లేదన్నారు. అత్యంత హేయమైన దాడికి పాల్పడిన హంతకులు, వారి వెనుకవున్నవారిని న్యాయస్థానం ముందుకు తీసుకురావాలన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మరియు జమ్మూ కాశ్మీర్ ప్రజలతో సంఘీభావంగా భారత్ ఐక్యంగా నిలుస్తుందన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో తిరుమల విద్యార్థుల విశేష ప్రతిభ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో ఏప్రిల్ 23 ప్రభాతవార్త** పదో తరగతి పరీక్షా ఫలితాలలో తిరుమల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. యేలూరి లాశ్య శ్రీ సాయి 597 మార్కులు, ఉప్పాల జశ్వంత్ పవన్, సిహెచ్. సుప్రూత భరద్వాజ్, కొట్టిన దుర్గ కశ్యప్, కూసుమంచి శ్రీవల్లి 596 మార్కులు సాధించారని, 595 పైన 12 మంది విద్యార్థులు, 592 పైన 54 మంది విద్యార్థులు, 590 పైన 99 మంది విద్యార్థులు, 575 పైన 869 మంది విద్యార్థులు, 550 పైన 1798 మంది విద్యార్థులు సాధించారని మరియు 100 ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను డైరెక్టర్ నున్న సరోజినీదేవితో కలిసి ఆయన అభినందించారు.

## మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్‌గా పురందేశ్వరి

**విజయవాడ ఏప్రిల్ 23 ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంటు మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్‌గా రాజమహేంద్రవరం భాజపా ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి నియమితులయ్యారు. 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో ఏర్పాటైన కమిటీలో సభ్యులుగా విభిన్న పార్టీలకు చెందిన మహిళా ఎంపీలు నియమితులయ్యారు. ఇందులో మహబూబ్‌నగర్, వరంగల్ ఎంపీలు డీకే అరుణ, కడియం, కావ్య, సినీ నటి హేమామాలిని, సుధామూర్తి, పాత్రికేయురాలు సాగరిక ఘోష్, ఢిల్లీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ సతీమణి సునేత్ర అజిత్‌పవార్ తదితరులు ఉన్నారు.

## రైల్వే సిసిటిసి పరీక్షా ఫలితాలు వెల్లడి

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 23,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో సిసిటిసి పోస్టుల భర్తీకి నిర్వహించిన వ్రాతపరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. డివిజన్ పరిధిలో కమర్షియల్ విభాగంలో ఖాళీగా ఉన్న 42సిసిటిసి పోస్టులను 331/3శాతం డిపార్ట్‌మెంటల్ కోటాలో భర్తీ చేసేందుకు సంబంధిత ఉన్నతాధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 7న వ్రాత పరీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను సంబంధిత ఉన్నతాధికారులు విడుదల చేశారు. జనరల్ స్టాండర్డ్ విభాగంలో 90మంది, రిలాక్స్‌డ్ విభాగంలో మరో 8మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరికి సీనియారిటీ, సర్వీసు రికార్డుల ప్రాతిపదికన పోస్టింగ్స్ కల్పించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## రోగులకు ఎండ వేడి నుండి రక్షణ

**- తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణంలో చలువపందిళ్లు**



**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమకే తలమానికంగా ఉన్న తిరుపతి రుయా ఆస్పత్రికి రోజువారీగా వేలాదిమంది పలు రకాల అనారోగ్యకారణాలతో వైద్యంకోసం వస్తుంటారు. ఈ ఆస్పత్రి తిరుపతి ఎస్వీవైద్యకళాశాలకు అనుబంధంగా ఉండటంతో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులైన వైద్యులతోబాటు వైద్య విద్యార్థులు, పిజి విద్యార్థులు, మెడికోలు వైద్యసేవలందిస్తారు. వచ్చిన ప్రతిరోగిని సొంతవారిలా చూడాలనేది వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉండటంతో ఆయన నేతృత్వంలో రుయా ఆస్పత్రి ప్రాంగణంలో పూర్తిగా చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల కావడంతో రోగులు, వారి సహాయకులకు విపరీతమైన ఎండవేడినుండి కొంతవరకు ఉపశమనం కోసం ఈ చలువపందిళ్ళు ఏర్పాటుతో రోగులు ఉపశమనం చెందుతున్నారు. 8.5లక్షల రూపాయలు వ్యయంతో చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు. ప్రత్యేకంగా అత్యవసర విభాగం, క్యాజువాలిటీ, ఓపి విభాగం, సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్,రక్తపరీక్షల కేంద్రాల వద్ద ఈ చలువపందిళ్ళు రోగులకు కాస్త వేడినుండి రక్షణ కల్పిస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లోనే ప్రభుత్వ ఆస్పత్రి రుయాలో ఈ ప్రత్యేకత కల్పించడం అభినందనీయం.

# ఉగ్ర దాడిలో అసువులు బాసిన కావలివాసి మధుసూధన్

## భార్య, బిడ్డల కళ్లెదుటే జరిగిన దారుణం

**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** విహారయాత్రకు వెళ్లి ఉగ్రవాదులచేతుల్లో చిక్కి అతి కిరాతకంగా, దారుణంగా హత్యగావింపబడిన కావలివాసి సోమిశెట్టి మధుసూధన్ విషాదవార్త కావలిని కుదిపేసింది. భార్య, బిడ్డల కళ్లెదుటే ఉగ్రవాదులు కిరాతకంగా హత్యచేసిన సన్నివేశంనుంచి వారు కోలుకోలేకపోయారు. శోకసముద్రంలో మునిగిపోయారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కావలి పట్టణానికి చెందిన ఆనాలవారి వీధిలో నివసిస్తున్న అరటికాయల వ్యాపారి సోమిశెట్టి తిరుపాలు, పద్మావతి దంపతుల కుమారుడు మధుసూధన్. ఉగ్రవాదుల చేతుల్లో మృతిచెందిన మధుసూధన్‌కు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. కుమార్తె మేధు ఇంటర్ చదువుతుంది. కుమారుడు దత్తు 8వ తరగతి చదువుతున్నాడు. 20 సంవత్సరాలుగా కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో ఐబిఎం కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 20వ తేది మధుసూధన్ తన కుటుంబంతో కాశ్మీర్ విహారయాత్రకు వెళ్లారు. 7 రోజులపాటు విహారయాత్ర ముగించుకుని బెంగుళూరుకు రావాల్సిన మధుసూధన్ జమ్ము కాశ్మీర్ వద్ద పహల్గామ్ ఉగ్రదాడిలో మృతిచెందారు. భార్య, బిడ్డల కళ్లెదుటే ఉగ్రవాదులు హత్యచేయడంతో మధుసూధన్ కుటుంబం రోదిస్తూ శోకసముద్రంలో మునిగిపోయింది. ఈ వార్త దావానలంలా వ్యాపించిడంతో కావలిలోని కుటుంబసభ్యుల రోదనలు వర్ణణాతీతంగా మారాయి. ఉగ్రదాడిలో మృతిచెందిన మధుసూధన్ పార్థివదేహాన్ని బుధవారం అర్ధరాత్రి సమయంలో కావలిలోని తండ్రి నివాసానికి తీసుకువస్తున్నట్లు సమాచారం. మధుసూధన్ మృతితో కావలిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఉగ్రదాడిలో 28 మంది హిందువులు మృతిచెందినట్లు పోలీసుల చెప్పడాన్నిబట్టి తెలుస్తోంది.



భార్య, పిల్లలతో మధుసూదన్ (ఫైల్‌ఫొటో)

# జమ్ముకశ్మీర్ ఉగ్రదాడిలో ఆంధ్రప్రదేశ్ వాసుల మరణంపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** జమ్ముకాశ్మీర్ ఉగ్రదాడిలో ఏపీకి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.“ఎక్స్” వేదికగా మృతులకు ఆయన సంతాపం ప్రకటించారు. టెర్రరిస్ట్‌ల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుని అండగా నిలవాలని కేంద్రాన్ని కోరారు. శోకతప్తులైన వారి కుటుంబీకులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనలో విశాఖ వాసి చంద్రమోళిని, కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావును ముష్కరులు దారుణంగా హత్య చేసినట్టు తెలిసింది. కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ వైయస్సార్‌సీపీ క్యాండిల్ ర్యాలీలు కశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైయస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో క్యాండిల్ ర్యాలీలు నిర్వహించనుంది. ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ఈరోజు సాయంత్రం ర్యాలీలు చేపట్టనుంది. పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్.జగన్ ఈమేరకు పార్టీ నాయకులకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిని అమానుష చర్యగా పేర్కొన్నారు. దేశం అంతా ఒక్కతాటిపై నిలవాలన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ పార్టీ శ్రేణులు క్యాండిల్‌ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అన్ని జిల్లాకేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పహల్గాం ఘటనలో పలువురు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు.



## పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

**- ఎంపి డాక్టర్ మద్దెల గురుమూర్తి**



**వెంకటగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య అని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. అమాయక పర్యాటకులపై జరిగిన ఈ కిరాతక దాడిని ముష్కర మూకల పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదని అన్నారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన ఈ దాడి దేశ శాంతి భద్రతలను భంగ పరిచే చర్యగా అభివర్ణించారు. రాజకీయాలకు అతీతంగా, ఈ దాడులకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడవలసిన సమయం ఇదని తెలిపారు. బాధితులకు తగిన న్యాయం జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తెసుకోవాలని కోరారు. అలాగే ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు ఎంపీ గురుమూర్తి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తిరుమలలో భద్రతా లోపాలపై తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి ఫిర్యాదు చేయడంతో కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. తక్షణ జోక్యం అవసరమని కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి చేసిన ఫిర్యాదుతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సెక్రటరీ మృత్యుంజయ్ త్రిపాఠి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. ఈ అంశంపై నిశితంగా పరిశీలించి సమాధానం పంపాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీని కేంద్రహోంశాఖ ఆదేశించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన తిరుమలలో భద్రత చాలా కీలకమని, అలాంటి చోట వరుసగా పునరావృతమవుతున్న భద్రతలోపాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఎంపీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖకు లేఖ రాసిన విషయం విదితమే. ఈ లేఖలో భక్తుల రక్షణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను మెరుగుపర్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, కాని రెడ్ బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించిన ప్రభుత్వం పాలనపై పట్టు కోల్పోయిందని పేర్కొన్నారు. తిరుమలలో భద్రతా లోపాలు భక్తుల జీవితాలను ప్రమాదంలో పడేయడంతో పాటు, వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీశాయని తెలిపారు. ప్రస్తుత టీటీడీ పాలక మండలి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు.

## కోయంబత్తూర్ బస్సులో బాలికపై వేధింపులు

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నడిచే బస్సులో ఓ బాలికపై వేధింపులకు పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక తరపున ఓ వ్యక్తి వేధింపుల ఘటనపై ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, తమిళనాడు సిఎం స్టాలిన్‌కు, పర్యాటకశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టిటిడి దర్శనాల విషయంలో 300 రూపాయలు సుపథం దర్శన టిక్కెట్లను మూడునెలల క్రిందట రద్దుచేశారు. దీంతో ప్యాకేజీ బస్సులు కూడా పర్యాటక శాఖ తిరుమల యాత్ర నడపడంలేదు. అనధికారికంగా పర్యాటకశాఖ తిరుపతి శాఖ తిరుపతినుండి కోయంబత్తూరుకు ప్రత్యేక ప్యాకేజీ బస్సును నడిపింది. ఇందులో ఈనెల 14వతేదీ చాలావరకు తమిళనాడు ప్రయాణీకులు ఉన్నారు. ఆ బస్సును డ్రైవర్ బివి ప్రసాద్, ఎంవి రమణలు నడిపారని, ఆ సమయంలో సిసికెమెరాలు కూడా పనియుయలేదని ప్రయాణీకుల ఆరోపణలు. అనధికారికంగా ప్రయాణీకులను ఎక్కించుకుని నడపడమేగాక బస్సులో ఓ వ్యక్తి మైనర్‌బాలికపట్ల అసభ్యకరంగా వ్యవహరించి, వేధించాడనే ఫిర్యాదు మెయిల్ ద్వారా వెలుగుచూసింది. అనధికార ప్యాకేజీలు నడపడమేగాక ఈ ఘటనపై కనీసం పర్యాటకశాఖ డ్రైవర్‌లు కూడా నోరుమెదపకపోవడం పట్ల ప్రయాణీకులు మండిపడ్డారు. ఉచిత దర్శనం పేరుతో నడిపే ఈ ప్యాకేజీ బస్సులో జరిగిన ఘటనపై విచారణకు పర్యాటకశాఖ అధికారులు ఆదేశించినట్లు సమాచారం. అంతేగాక డ్రైవర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రయాణీకుడు సిఎంకు ఫిర్యాదు చేయడంతోనే పర్యాటకశాఖ అక్రమాలు వెలుగుచూడటం మరీ కొసమెరుపు. మరీ మైనర్‌బాలికపై వేధింపులకు పర్యాటకశాఖ చర్యలు ఏంటో చూడాల్సిందే.

## ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

**- అంకభూపాలపురంలో ఎమ్మెల్యే ఇంటూరి**

**వలేటివారిపాలెం (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఇందుకోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు ఆయన వివరించారు.ఇందులో బాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో నియోజకవర్గంలో కోట్లాదిరూపాయలు వెచ్చించి అభివృద్ధి సంక్షేమ పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం మండలంలోని సుమారు రూ.10లక్షలుతో నిర్మించిన సీసీ రోడ్డుకు, దాదాపు రూ.40లక్షలతోనిర్మించిన సచివాలయ భవనానికరి ప్రాంరభోత్సవం చేశారు. అనంతరం సుమారు రూ.8లక్షల విలువైన వ్యయసాయ ఉపకరణాలును 50శాతం సబ్సిడితో లబ్ధిదారులుకు పంపిణీ చేశారు. తదుపరి ఎంపీడీవో నరేంద్రదేవ్ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వ తప్పిదాలను విమర్శిస్తూ తమ ప్రభుత్వం పూర్తిగా ప్రజోపయోగకరమైన పనులుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి పనులుకు రాజకీయాలకతీతంగా సహకరించాలన్నారు. ఉద్దేశ్యపూరితంగా ఇబ్బందుల కల్గిస్తే ప్రత్యామ్నయం ఎంటో తమకు పూర్తిగా తెలుసన్నారు. కనీసం గ్రామంలో శ్మశానం కూడా లేదంటే ఎంత హాసా స్పదంగా ఉందో గమనించాలన్నారు. ఈ గ్రామంలో డ్రైనేజివ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అయ్యవారిపల్లెలో చేపట్టబోయే పారిశ్రామికీకరణ తో ఈ ప్రాంతప్రజలుకు ఎంతో ఉపయోగం కలగనుందన్నారు.పరిష్కారానికి సహకరించాలని గ్రామస్తులకు విజ్ఞప్తిచేశారు. మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం మాట్లాడుతూ యువనేత 24గంటలు పనిచేసే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సేవలును వినియోగించు కోవాలన్నారు.ఏ సమస్యకైనా నేరుగా ఎమ్మెల్యేని కలవాలని సూచించారు. కార్యకర్తలంతా ఐక్యతతో సమస్యల పరిష్కారానికి ఆయనకు చేయూత నివ్వాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు. వ్యవసాయశాఖ ఏడీ అనసూయ మాట్లాడుతూ ఈ క్రాపు నమోదుచేసుకొని ప్రభుత్వ రాయితీలు పొందాలన్నారు.సీనియర్ అడ్వకేట్ ఎగడా శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే ఇంటూరికి మంచి పట్టు ఉందన్నారు. దశలవారీగా పరిష్కారానికి ఆయన ప్రణాళికాబద్ధంగ వ్యవహరిస్తున్న తీరును వివరించారు. శ్మశాన,భూసమస్యలపై బి.మాల్యాద్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ మధుబాబు, హౌసింగు ఏఈ నాగరాజు,ఏవో హేమంత్‌కుమార్,నాగరాజు, తెదేపా నేతలు పెగడా నరసింహారావు, కాకుమాని హర్షకుమార్, వలేటి మధు, కొంకా రమేష్,గుత్తా మహేశ్వరరావు,పెగడా మోహన్, చెంచు శ్రీనివాసులు,సిరిగిరి కొండారెడ్డి,గుత్తా తిరపతయ్య, చుండి సాంబయ్యపాల్గొన్నారు.



## పది ఫలితాలతో పాఠశాలల్లో సంబరాలు

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** పది పరీక్షా ఫలితాలతో శ్రీకాళహస్తిలో సంబరాలు అంబరాన్ని అంటాయి. శ్రీకాళహస్తిలో 11 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. కార్పొరేట్ పాఠశాలలు 4 ప్రవేటు పాఠశాలలు 29 ఉన్నాయి.పదవ తరగతి పరీక్షలకు 2220 మంది హాజరు కాగా ప్రభుత్వ పాఠశాలల నుంచి 1167 మంది హాజరు కాగా ఉత్తీర్ణులైంది 834 మంది.71శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో మున్సిపల్ పరిధిలోని బాబూ అగ్రహారం పాఠశాలకు చెందిన కేతన్ 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో టౌన్ ఫస్ట్ అయ్యాడు. బాలుర ఉన్నత పాఠశాలలో నితిష్‌మోహన్ రాజ్ 584 మార్కులు సాధించి పాఠశాల కు ఫస్ట్ అయ్యారు. రాజీవ్ నగర్‌లోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సి విద్యార్థి 583 మార్కులు సాధించగా శ్రీకాళహస్తిలోని సరస్వతి బాయ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి 579 మార్కులు సాధించారు. ఎపిడబ్ల్యు బాలికల గురుకులంకు చెందిన విద్యార్థిని 560 మార్కులు సాధించగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థి 576 మార్కులు సాధించింది. ఎపిఎస్ డబ్ల్యుఆర్ఎస్ బాలికల గురుకులంలో విద్యార్థి 565 మార్కులు సాధించి రికార్డు సాధించారు. మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలల్లో 71.47శాతం ఉత్తీర్ణత సాధించారు.ఇక ప్రవైటు పాఠశాలల్లో ద స్కూల్ విద్యార్థి దయాశంకర్ 595 మార్కులు సాధించారు.ఇక కార్పొరేట్ పాఠశాలల్లో భాష్యం పాఠశాలకు చెందిన విద్యార్థి చాతుర్య 597 మార్కులు సాధించినట్లు మేనేజ్‌మెంట్ ప్రకటించింది.కాగా నారాయణ పాఠశాలకు చెందిన ప్రశాంతి 596 మార్కులు సాధించగా రత్నం పాఠశాలకు చెందిన ఎన్ సాయిశ్రీ 591 మార్కులు సాధించినట్లు ఆయా మేనేజ్‌మెంట్లు ప్రకటించాయి. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు తీసుపోమని పది ఫలితాలు చాటి చెబుతున్నాయి.గత ఏడాది కూడా గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థుల కంటే 10 మార్కుల తేడాతోనే సత్ఫలితాలు సాధిస్తున్నారు.

## విహార యాత్రలో విషాదం!

## ఉగ్ర మూకల దాడిలో విశాఖ వాసి చంద్రమౌళి మృతి

**విశాఖపట్నం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కాశ్మీర్ దాడి లో వెంటాడి మరి హత్య చేసిన ముష్కరులు!! బుధవారం రాత్రికి విశాఖ చేరుకున్న మృతదేహం!!శుక్రవారం విశాఖలో అంత్యక్రియలుజమ్మూ కాశ్మీర్లో సుందర ప్రదేశాలను తిలకించాలని చేపట్టిన వారి విహారయాత్ర విషాదంగా మారింది.టూరిస్టులు అందరూ ఒకే చోట సేదతీరి ఉన్న సమయంలో ముష్కరులు వారిని చుట్టుముట్టి విచక్షణారహితంగా కాల్పులు జరిపి పలువురును పొట్టన పెట్టుకున్నారు.ఈ ఘటనలో విశాఖపట్నం కు చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి జరజాపు చంద్రమోళి (69) మృతి చెందారు.ఈనెల 16న మరో రెండు కుటుంబాలతో కలిసి కాశ్మీర్ టూర్ కి వెళ్లిన చంద్రమోళి షెడ్యూల్ ప్రకారం ఈనెల 25న విశాఖ తిరిగి రావాల్సి ఉంది.ఇంతలోనే ఈ విషాదం చోటు చేసుకుంది.అతను మృతి చెందారన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.జమ్మూ కాశ్మీర్ లోని పహల్గా సమీపంలో టూరిస్టులందరూ ఒకే చోట ఉన్న సమయంలో ఆర్మీ సిబ్బంది దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు వారందరిని చుట్టుముట్టారు.మరి ఐడి కార్డులను కూడా పరిశీలించారు.అందులో ముస్లిమ్స్ కానీ వారిని నిర్దాక్షి ణ్యంగా కాల్పులు జరిపి హతమార్చారు.ఉగ్రవాదులకు చిక్కిన చంద్రమోళి తనను వదిలేయాలని ప్రాదేయపడినప్పటికీఉగ్ర మూకలు కనికరించలేదు.వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న సమయంలో మీ ప్రధాని నరేంద్ర మోడీకి చెప్పుకో అంటూ అతనిపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు.ఈ ఘటనలో మృతి చెందిన వారిలో చంద్రమోళి పేరు లేకపోవడంతో అతను మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మరుసటి రోజు కొందరు టూరిస్టుల ద్వారా అతను మృతి చెందినట్లు సమాచారం వచ్చింది.ఇతనితో పాటు వెళ్లిన మరో ఐదుగురు క్షేమంగా ఉన్నట్లు తెలిసింది.అతను మృతదేహాన్ని బుధవారం ప్రత్యేక విమానం ద్వారా విశాఖ తరలించనున్నారు.!! కుటుంబ సభ్యుల కన్నీటి పర్యంతం..ఉగ్ర మూకల దాడిలో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి చంద్రమోళి మృతి చెందడం ఆయన కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒక కుటుంబ పెద్దగా అలాగే ఎంకరేజ్ అపార్ట్మెంట్ వైస్ ప్రెసిడెంట్ గా ఉంటూ తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ అందరి మనసులలో ఒక మంచి వ్యక్తిగా చెరగని ముద్ర వేసుకున్నారు.అందరితో చాలా కలవిడిగా ఉండే చంద్రమోళి కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందడం చాలా షాకింగ్ గా ఉందని ఆ అపార్ట్మెంట్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోపక్క కుటుంబ సభ్యులు కూడా కన్నీటి పర్యంతమవుతున్నారు.!! ఈనెల 25న తిరిగి రావాల్సి ఉండగా ఇంతలోనే ఇలా జరిగింది..ఈనెల 16న ట్రావెల్ ఏజెంట్స్ ద్వారా చంద్రమోళి తో పాటు మరో ఐదుగురితో కాశ్మీర్ వెళ్లిన చంద్రమోళి ఈనెల 25న విశాఖ తిరిగి రావాల్సి ఉందని చంద్రమోళి సమీప బంధువు కుమార్ రాజా తెలిపారు.చంద్రమోళి కుటుంబంతో పాటు అప్పన్న, శశిధర్ కుటుంబాలు కూడా ఉన్నాయన్నారు.ఉగ్రవాదులు టూరిస్టులు అందరిని చుట్టుముట్టి వారిపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి చాలామందిని హతమార్చారని తెలిపారు. ఈ క్రమంలో చంద్రమోళి తప్పించుకునే ప్రయత్నం చేశారని కానీ ముష్కర్లు వెంటాడి మరి అతనిని హత మార్చారని పేర్కొన్నారు.మృతదేహం బుధవారం రాత్రి విశాఖ రానున్నట్లు తెలిపారు.అతని ఇద్దరి కుమార్తెలు అమెరికా నుంచి గురువారం వస్తున్నట్లు వెల్లడించారు.శుక్రవారం అతని పార్థీవ దేహానికి అంత్య క్రియలు జరుగుతాయని తెలిపారు.

## తిరుపతిలో యువతిపై సామూహిక అత్యాచారం

**-మత్తుకలిపిన జ్యూస్ తాగించిన నిందితులు**

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగరంలో సామాజిక మాధ్యమంద్వారా పరిచయమైన ఓ యువతిపై కొందరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మత్తుకలిపిన జ్యూస్ తాగించి నలుగురు యువకులు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధిత యువతి ,తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం తిరుపతి నగరంలోని వెస్టుపోలీసుస్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నగరంలోని పెద్రూనగర్‌లో నివాసముంటున్న (16)ఏళ్ల దళిత యువతితో సామాజిక మాధ్యమంలో అప్పటికే పెళ్లయి భార్య, ఓ పాప ఉంది. అయినా చెడుఅలవాట్లకు బానిసైన యువకుడు సామాజిక మాధ్యమంద్వారా యువతితో పరిచయంచేసుకుని ప్రేమ కార్యకలాపాలు సాగించాడు. ఏకంగా పెళ్ళిచేసుకుంటానని నమ్మించాడు. యువతికి మరో మైనర్‌బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించి తీసుకురమ్మన్నాడు. ఇద్దరూ కలసి యువకుడు వద్దకు వెళ్ళడంతో అతనితోబాటు మరో ముగ్గురు యువకులు దళిత యువతిని తీసుకుని బయటకు వెళ్ళారు. అక్కడ యువతికి మత్తుకలిపిన జ్యూస్‌తాగించి ఆపై అత్యాచారంచేశారు. మరుసటిరోజు తిరుపతి ఆర్టీసిబస్టాండ్‌లో వదలిపెట్టి పరారయ్యారు. అప్పటికే యువతి కనిపించడం లేదని బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్టాండులో అపస్మారకస్థితిలో ఉన్న యువతిని మహిళ ఆటోడ్రైవర్ చేరదీసి ఇంటికి చేరవేసింది. బుధవారం సాయంత్రం యువతి సోదరుడికి విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారణలో యువతి విస్తుబోయే విషయాలు వెల్లడించడం, ,యువతి మొబైల్‌ఫోన్‌లో ఉన్న ఇన్‌స్ట్రాగ్రామ్‌లోని ఫోటోలతో నిందితులను గుర్తించింది. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. యువతిని ప్రసూతి ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యనివేదిక అందితే అత్యాచారంలో ఎంతమంది పాల్గొన్నారనేది తెలియదని, ఈ కేసును విచారణ చేస్తున్నట్లు పోలీసువర్గాలు మీడియాకు తెలిపాయి. అనుమానంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## తిరుపతిజూలో బెంగాల్‌పులి మృతి

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జూలో ఉన్న 20ఏళ్ళ వయస్సున్న బెంగాల్‌పులి అనారోగ్యంతో మృతి చెందింది. జూలో ఎండవేడి అధికంగా ఉండటం, కొండదిగువన జూ వుండటంతో మరింతగా జంతువులకు సమస్యలు ఎదురవుతున్నాయి. జూలో చల్లదనం కోసం వట్టివేర్లు, కూలర్లుఏర్పాటుచేసినా వేడికి అనారోగ్యానికి గురైంది. బెంగాల్ పులిని 2003లో ఆత్మకూర్ డివిజన్ నుండి తిరుపతికి జూకు తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందడంతో బుధవారం మధ్యాహ్నం ఎస్వీపశువైద్యశాలలో పోస్టుమార్టమ్ నిర్వహించారు.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E-PROCUREMENT SHORT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 1 | NIT No. 18/PROC/MAU61-OPOMOCOMM/16/2025-JDC, Dt. 23.04.2025 | APCRDA-"Request for Proposal (RfP) for Appointment of Agency for Branding, Communications, and Digital Outreach Strategy for Amaravati" |
| | The bid can be downloaded on AP e-procurement portal from 24.04.2025 to 01.05.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 01.05.2025 up to 15.00 Hrs, Technical bid opening 01.05.2025 @ 16.00 Hrs | |
| | **E-PROCUREMENT TENDER NOTICE** | |
| 2 | NIT No. MAU61-ADMNOSD(VI)/19/2025-HB, Dt. 23.04.2025. | Supply and fixing of split air conditioners of four numbers in APCRDA thullur unit office"- Estimate Amount: Rs. 3.60 Lakhs. |
| | The bid can be downloaded on AP e-procurement portal from 24.04.2025 to 08.05.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 08.05.2025 up to 15.00 Hrs, Technical bid opening 08.05.2025@16.00 Hrs. | |
| 3 | NIT No. MAU61-ADMNOSD(VI)/16/2025-HB, Dt. 23.04.2025. | "Construction of Horticulture Nursery cum training centre (HNTC) at UD Palem in CRDA Region"- Estimate Amount: Rs. 96.00 Lakhs. |
| | The bid can be downloaded on AP e-procurement portal from 24.04.2025 to 09.05.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.05.2025 up to 15.00 Hrs, Technical bid opening 09.05.2025 @16.00 Hrs. | |

For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada.


వార్త

కల్లోలంగా ఉన్న కొలనులో నిర్మలమైన ప్రతిబింబం కనపడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.

-కె. స్టాన్ స్లావిస్కి

# మంచుకొండల్లో నెత్తుటి ధార

కశ్మీరులో పదమూడేళ్ల తర్వాత 26 మంది పర్యాటకులను బలితీసుకుంటూ ముష్కరులు వికటాట్టహాసం చేశారు. ఇదేదో దొంగ దెబ్బ కానేకాదు. పకడ్బందీ ప్లాన్‌తో చేసిన దాడే. ముందే హెచ్చరికలున్నా పర్యాటకుల్ని కాపాడుకోలేకపోయాం. ప్రభుత్వాధికారులను లక్ష్యంగా చేసుకున్న చర్యగా భావించేందుకు ఆధారాలున్నా ఇతర పర్యాటకుల్ని కూడా చంపేశారు. వారిలో ఐబి. నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధికారులు తమ కుటుంబాలతో సందర్శనకు వచ్చారు. తమను వదలిపెట్ట మని చంపొద్దని ప్రాధేయపడినా ఎవర్నీవారు కనికరించలేదు. నిర్దాక్షిణ్యంగా కాల్చేశారు. చనిపోయిన వారిలో 25 మంది పురుషులు, ఒక మహిళ ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో దక్షిణ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్‌గాంలో దాదాపు వందలాది మంది పర్యాటకులున్న బైసరన్ ప్రాంతంపై ఒక్కసారిగా ఉగ్రవాదులు చుట్టుముట్టారు. మృతిచెందిన వారిలో ప్రభుత్వాధికారులే ఎక్కువ మంది ఉండడంతో టెర్రరిస్టులు వారినే లక్ష్యంగా చేసుకున్నారని తొలుత భావించినా వారి పాశవిక చర్య వెనుక పాకిస్థాన్ ఆర్మీ హస్తం ఉండి ఉండవచ్చుననే అనుమానాలు బలపడ్డాయి. ఇదొక హృదయ విదారక అమానుష హత్యాకాండగా ఈ సంఘటనకు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఈ దురాగతానికితామే బాధ్యులమని లష్కరే ఎతోయిబా అనుబంధ సంస్థది రెసిస్టెన్స్‌ఫ్రంట్ బహిరంగంగానే ప్రకటించుకోవడం విశేషం. ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న దానిని బట్టి తమను చంపొద్దని వేడుకున్నా తూటాల వర్షం కురిపించారని, మోడీతోచెప్పుకోండన్నారని వివరించారు. విశాఖపట్నంకు చెందిన చంద్రమౌళి పారిపోతుండగా వెంటాడి స్నైపర్ ఫైర్‌తో కాల్చిచంపారు. వేసవిలో కశ్మీర్ వెళ్లడానికి ఎంతో మంది ఇష్టపడతారు. ఇటీవలే వివాహంచేసుకున్న నవజంటలు కూడాఉన్నాయి. మృతుల్లో ఇద్దరు విదేశీయులుకాగా ఒకరు నేపాలీ, మరొకరిది యూ.ఎ.ఇ. పలువురు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, యుపి,బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణరాష్ట్రాలకు చెందినవారున్నారు. పహల్గామ్‌కు 5,6కిలోమీటర్ల దూరవంలో ఉండే బైసరన్ ప్రత్యేకమైన రిసార్టులుండే టూరిజం ప్రదేశం. యేటా ఈ ప్రాంతానికి అధిక సంఖ్యలో దేశ విదేశాల నుంచి టూరిస్టులు వస్తుంటారు. 2019లో పుల్వామాలో సిఆర్‌పిఎఫ్ కాన్వాయ్‌పై జరిపిన ఉగ్రవాదులదాడిలో 47మందిబలయ్యారు. తాజా దాడిలో ముష్కరులు చాలా విచిత్రంగా వికృతంగా ప్రవర్తించారని సమాచారం. పర్యాటకులు హిందువులని నిర్ధారించుకున్న తర్వాతనే వారిని పాయింట్ బ్లాక్‌లో కాల్చేశారు. తన భర్త శివ మొగ్గకు చెందిన మంజునాథ్ రావును చంపగానే తననూ చంపమని కోరినా చంపకుండా దుర్భాషలు మాట్లాడారని కర్ణాటకకు చెందిన పల్లవి చెప్పింది. హిందువులో ముస్లింలో తేల్చుకోడానికి ముస్లిం ప్రార్థనాగీతాల గురించి ప్రశ్నించి తీవ్రఉన్మాదాన్ని ప్రదర్శించారట. గుడారాలోంచి లాగి పేరడిగి కాల్చిపారేశారు. హోటళ్లలో తింటున్నవారినీ విచక్షణారహితంగా ఒక్కొక్కరిగా కాల్చేస్తుండగా పర్యాటకులు ఆర్తనాదాలు చేశారు. కశ్మీర్‌కు వేసవిలో దాదాపు 30లక్షలమంది దాకా పర్యాటకులు వస్తుంటారు. అయినా ప్రభుత్వపరంగా పహల్గామ్ ప్రాం తంలో ప్రత్యక్ష భద్రతా ఏర్పాట్లేవీ ఉన్నట్లు లేదు. కేవలం ఐదుగురుసాయుధులు, కెమెరా కలిగిన హెల్మెట్లు ధరించి పర్యాటకప్రాంతం మీదటెర్రర్ అటాక్‌జరిగినప్పుడే నిలువరించగల భద్రతా సిబ్బంది లేకపోవడంవిచారకరం. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి, మూడు ప్రాంతాలుగా విభజించి, ఎన్నికలు జరిపించడంతో పాకిస్థాన్ బాగా ఆగ్రహంతో ఉంది. దేశంలో వక్ఫ్‌బిల్లు సవరించాక దేశీయ ముస్లింలలోనూ ఆగ్రహావేశాలు వ్యక్తమైనా ఎవరూ పాక్ దేశీయులతోచేయి కలుపలేదు. ఇదిలాఉండగా ఇక కేంద్ర ప్రభుత్వం ముందున్నది ఉమ్మడి పౌరస్మృతి మాత్రమే. కనుక ఆదిశగా అడు గులువేసే తరుణంలో పాక్‌ఆగ్రహం గురించి అంచనా వేయలేని పరిస్థితి ఏమీలేదు. అయినా జరుగరానిది జరిగిపోయింది. ఇంతమంది ప్రముఖులు ఒకేసారి కశ్మీర్ రావడాన్ని ముష్కరులు అలుసుగా తీసుకున్నారనిపిస్తుంది. ఏమయితేనేం అమాయకులు బలయ్యారు. సైఫుల్లాఖాన్ అనే ఉగ్రవాది ముందుగానే ఈ దాడుల గురించి హెచ్చరించాడు. రాబోయే రోజుల్లో ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో ముజాహిదీన్‌లు దాడిచేస్తారని, ఆ తర్వాత కశ్మీర్ తమ చేతుల్లోకి రాబోతోందని కేంద్రప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించినా భద్రతాబలగాలుఏమాత్రం అప్రమత్తంగాలేరని అర్థమవుతోంది. ఇప్పుడు జరిగినదాడి కశ్మీరు టూరిజానికి పెద్ద దెబ్బ. కశ్మీరుకు రావడానికి దేశ విదేశీ టూరిస్టులు తీవ్ర భయభ్రాంతులౌతారు. పర్యాటకులు తగ్గిపోయే అవకాశముంది. పర్యాటకాదాయం భారీగా పొందే కశ్మీర్‌కు భద్రత కోసం కేంద్రం మరిన్ని పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి. 2000 మార్చిలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో అనంత్‌నాగ్‌జిల్లా చట్టీసింగ్ పురాలోఉగ్రవాద దాడిలో 36మంది సిక్కులను కాల్చిచంపారు. తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ఇండియాలోపర్యటిస్తున్నవేళ అలాంటి దుండగుల దుశ్చర్యకు 26 మంది చనిపోవడం విచారకరం. ఇలాజరిగిన ప్రతిఉగ్రవాది దాడిలోనూ ఎక్కువ మంది చనిపోతున్నారు. ఈ ఘటనను ఖండిస్తూ కశ్మీరు వాసులు ప్రజాసంఘాలు సైతంనిరసన వ్యక్తంచేస్తున్నాయి ముష్కర చర్యలను ఖండిస్తున్నాయి. సభ్య సమాజం గొంతెత్తి మృతుల కుటుంబాలకు సంతాపం తెలియచేస్తోంది. పహల్గామ్ ఊచకోతను ఖండిస్తూ సుప్రీంకోర్టుఏకగ్రీవ తీర్మానం చేసింది. ముష్కరులకు పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐసహాయం అందించిందని తెలుసు. ఇక పాక్ కవ్వింపు చర్యలపై భారత్‌యుద్ధం ప్రకటించడమే తరువాయి.



లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.

రామకృష్ణ పరమహంస



అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.

వి.జాన్సన్

# ప్రజావాక్కు



### నీటి ఎద్దడిని అరికట్టాలి

వేసవి మొదలవడంతోనే చాలా ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి ఎదురవుతుంది. నీటి కొరత ప్రజల జీవితాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలో నీటి కోసం పోటీపడే పరిస్థితి ఏర్పడుతోంది. ఈపరిస్థితికి ప్రధానంగా భూగర్భ జలాల క్షీణత, వర్షపు నీటి వృథా, పట్టణీకరణ వల్ల అడవులు దెబ్బతినడంవంటి అంశాలే ప్రధాన కారణం. పూర్వపు రోజుల్లోగ్రామాల్లో కొలనులు,చెరువులు, వాగులు, వంకలు వంటి ప్రకృతిసిద్ధ నీటి వనరులు అధికంగా ఉండేవి. వానాకాలంలో ఎక్కువగా వర్షపు నీరు వీటిలో నిల్వ ఉండి, భూగర్భ జలాలు పెరిగేలా సహాయపడేవి. అయితే ఇప్పుడు కాలక్రమేణా చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి, వాగులు, వంకలు కనుమరుగవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య మరింత తీవ్రమోతోంది. ఇదే అదనుగా భావించి ట్యాంకర్ల ద్వారా నీటి వ్యాపారం విపరీతంగా పెరుగుతుంది.

-తోట యోగేందర్, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా

### గురుకులాలలో ఇంటర్ కోర్సులు

వచ్చే విద్యా సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీగురుకులాలలో తప్పనిసరిగా ఇంటర్మీడియట్ స్థాయిలో అన్నికోర్సులుఎంపిసి, బైపిసి, హెచ్ఈసి, సిజిసి, ఎంఇసి అన్నికోర్సులను ప్రవేశపెట్టాలి. ఇప్పటివరకు మ్యాథమెటిక్స్ సైన్స్‌కోర్సులున్నాయి. వాటితోపాటుగా సామాజిక శాస్త్రాలు అయిన ఎకనామిక్స్. హిస్టరీ, సివిక్స్, కామర్స్ వంటి కోర్సులను కూడా తప్పనిసరిగా వచ్చే విద్యా సంవత్సరం నుండి తప్పనిసరిగా ప్రారంభించాలి. పేద విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది.

-డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### పెరుగుతున్న మధుమేహం

దేశంలో పెరిగిపోతున్న మధుమేహం ,గ్యాస్ట్రిక్ వ్యాధుల తగ్గుదలకువాడుతున్న స్టెరాయిడ్, అసిడిటీ వగైరా మందులు నాణ్యత పరీక్షలో నిర్ణీత ప్రమాణాలు లేవని సంబంధిత సంస్థ తేల్చి చెప్పింది. దీనితో. 84రకాల ఇతర మందులు కూడా ఉన్నవి. జీవితకాలం వాడాల్సిన మందు కారణం ఏదైనా నాణ్యత లేనిది వాడకం జరిగితే ,ఉన్న రోగం తీవ్రత తగ్గక కొత్తరోగం రావొచ్చు.

-బి. మేఘానాథం, విశాఖపట్నం

### ఉగ్రదాడి అమానుషం

పర్యాటకుల స్వర్గధామం మినీస్విర్జర్లాండ్‌గా పిలిచే జమ్ము కాశ్మీర్‌లోఉగ్రవాదుల కాల్పుల్లో 27 మంది పర్యాటకులు మృతి చెందిన ఘటన అమానుషం. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈదుశ్చర్యను తీవ్రంగాఖండించాలి. ఉగ్రవాదులు దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా మరణించడం బాధాకరం. ఉగ్రవాద మూకల విషయంలో కేంద్రం కఠినంగా వ్యవహరించాలి. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలి. ఉగ్రవాదాన్ని కేంద్రం ఉక్కుపాదంతో అణచి వెయాలి. మరో మారు ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి. అందరూ ఈ ఉగ్ర చర్యను ఖండించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

### సామాన్యులకు పసిడి ఎంతో దూరం

అమెరికాలో రెండోసారి అధికారం దక్కించుకున్నడొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ విధానాలు, సుంకాల ప్రకటన, అమెరికాతో చైనాకు జరుగుతున్న వాణిజ్య యుద్ధం, డాలర్ విలువ బలహీనంగా ఉండటం వంటి కారణాలతో సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారంపై ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుండటంతో ప్రస్తుతం బంగారం ధర హిస్టరీ క్రియేట్ చేస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. లక్ష నమోదైంది. దీనిమీద 3 శాతం గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ కలిపితే మొత్తంధర రూ. 1,02,160కి చేరుకుంది. మన దేశంలోనే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడిధరలు భగ్గుమంటున్నాయి. ధరలు ఇంతలా పెరగడం చరిత్రలో ఇదే తొలిసారి అని నిపుణులు చెబుతున్నారు.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### చౌక డిపోలలో రాగులను పంపిణీ చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా కిలో రాగులను రెండురూపాయలకే పంపిణీ చేయటం హర్షణీయం. చిరుధాన్యాలలో రాగులు ఎంతో ముఖ్యమైనవి. మన ఆరోగ్యానికి ఉపయోగకరం. రాగులతో రాగి ముద్దలు, రాగి జావ తదితరాలుగా వాడుకోవచ్చు. రాగులలో అనేక పోషకాలు ఉన్నాయి. రాగులలో బి1, బి2, బి3, బి6 విటమిన్లతోపాటు సి విటమిన్ కూడా కొంతఉంటుంది. రక్తహీనతను తగ్గించటంలో ఉపయోగపడుతుంది. వైద్యులు సైతం రాగులను సిఫార్సు చేస్తున్నారు.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

# డీలిమిటేషన్ ప్రజాస్వామ్య మనుగడకు అడ్డం కారాదు!

***రాజకీయాలు శాశ్వతం కావు కానీ దేశాలూ ప్రజలూ శాశ్వతం! ప్రజల కోసం వుండే వ్యవస్థల్లోని లోటుపాట్లని కాలానుగుణంగా సవరించుకోవటం అధికారంలో వున్న పార్టీ చేయాల్సిన బాధ్యత వుంది. అవసరమైతే రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తూ అధికార దర్పాన్ని, అహంనూ ప్రక్కనపెట్టి విపక్షాలనూ, న్యాయ నిపుణులనూ, మేధావులనూ, ప్రజా సంఘాలనూ విశ్వాసంలోకి తీసుకొని అవసరమైతే ఒకటి కాదు రెండు కాదు అవసరమైనన్ని సమావేశాలు జరిపి చర్చల ద్వారా సమయోచిత నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకుంటే అందరూ సంతోషించటమే కాదు ఆమోదయోగ్యమైన నిర్ణయాలకు కట్టుబడి వుంటారు! అదే ప్రజాస్వామ్యం పునాది మనుగడ!***



రావులపాటి సీతారాంరావు

ఓటర్లు సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకొని తమ ప్రతినిధులను చట్టసభల్లో ప్రవేశింపచేయటానికి లోక్‌సభకైనా, శాసనసభకైనా నియోజకవర్గాలు వుండక తప్పదు. రాజ్యాంగంలోనిఆర్టికల్ 82,170 ప్రకారం సభలలోనిసభ్యుల సంఖ్య జనాభాను అనుసరించి జరపబడాలి! జనాభా ముఖ్య ప్రాతిపదికగా గుర్తించబడినప్పుడు దేశంలోని రాష్ట్రాలలోని సభలోని సీట్ల ఓటర్ల విషయంలో హెచ్చుతగ్గులు వుండక తప్పదు. ఇదే ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో పెద్ద సమస్యగా మారింది. ఉత్తరాదిన కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్లో జనాభా ఆధారంగా తీసుకోవాల్సిన ఓటర్లసంఖ్య ప్రతి జనాభా లెక్కింపులోనూ దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే విపరీతంగా పెరిగిపోతున్నది. దానివల్ల విధాన సభలో శాసన సభలలో వుండాల్సిన సీట్ల సంఖ్య ప్రతిసారీ ఎక్కువవుతున్నది. అందుచేత ప్రజాస్వామ్య మూలసూత్రాలు బీటలు వారుతున్నాయని దక్షణాది వారు ఆరోపిస్తున్నారు. దక్షణాదిలో ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం పాపులేషన్ కంట్రోల్ (జనాభా నియంత్రణ) ముఖ్యంగా ఎమర్జెన్సీలో ఎక్కువగా జరగటంతో అటు విధాన సభకూ ఇటు శాసన సభకూ సీట్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. కుటుంబ నియంత్రణ దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాల నిర్ణయానుసారం అమలు చేయటంవల్ల లోక్ సభలోనూ శాసనసభల్లోనూ సీట్లు తగ్గుతూ వచ్చాయి! మంచి చేసినందుకుగాను మాకు నష్టం వాటిల్లే రీతిలో డీలిమిటేషన్ నిర్ణయాలు జరిగాయని, జరగబోతున్నాయని దక్షిణాది ప్రజలు వాపోతున్నారు. కోపరేటివ్ ఫెడరలిజమ్ సూత్రానికి భిన్నంగా ఈ డీలిమిటేషన్ వ్యవహారం నడుస్తున్నదని అందువల్ల ప్రజా ప్రతినిధుల సభలలో తమ తప్పేమీ లేకుండానే తమ ప్రాతినిధ్యం తగ్గటంవల్ల దేశ నిర్ణయాలలో తమపాత్ర, జోక్యం క్రమేపీ తగ్గిపోతున్నాయని, ఈ ప్రాతిపదిక మూలాలను ప్రశ్నిస్తున్నారు! ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన డాటా ప్రకారం మొదట జరిగిన సార్వత్రిక ఎన్నికలలో (1951-52) 489 (లోక్‌సభ) సీట్లు ఉన్నాయి. 1957లో 494, 520-1967 ( డీలిమిటేషన్ కమిషన్ మార్చి 21, 1963 నాడు 1961 జనాభా లెక్కల ఆధారంగా ఏర్పరిచినవి) 31 సీట్లు పెంచటం, 5 సీట్లు తగ్గించటం (అంతకు పూర్వం జరిగిన ఎన్నికలతో పోలుస్తే) జరిగింది! విభజన పూర్వం వున్న ఎపిలో 43 నుంచి 41, చెన్నై 41 నుంచి 39, యుపి 86 నుంచి 85, అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, కర్ణాటక, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశాల్లో కొన్ని సీట్లు పెరిగాయి. కొత్త రాష్ట్రాలైన హర్యానా, జమ్మూకాశ్మీర్, నాగాలాండ్, అండమాన్ నికోబార్, చండీఘడ్, దాద్రానగర్ హవేలీ, గోవా, డమన్ అండ్ డైయూ, లక్షద్వీప్, పాండిచ్చేరిల్లో గూడా కొత్తగా సీట్లు చేర్చబడ్డాయి! లోక్‌సభ సీట్లు ప్రస్తుతం 543 (1971 సెన్సస్ ప్రకారం). 1951 నుంచి 2004లో జరిగిన పెంపుకు (డీలిమిటేషన్ కమీషన్ నిర్ణయానుసారం) ప్రత్యేక ఫార్ములాగా ఐడియల్ జనాభా సంఖ్య అంటూ అనుసరించినట్లు లేదు. జనాభా ప్రాతిపదికన నిర్ణయాలు చేసినప్పుడు రాజకీయ సరిహద్దులు, భౌగోళిక పరిస్థితులు పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేనట్లు ఒక అభిప్రాయం వుంది. కానిస్టిట్యూయన్సీకి ఏవిధమైన రిప్రజెంటేషన్ ముఖ్యాంశంగా వుండాలి అన్నది గూడా లెక్కల్లో వుండక తప్పదు. ప్రాంతీయతకు అన్యాయం జరగకూడదు. మతపరంగా, విద్యాపరంగా నియోజక వర్గాల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవటం అవసరమా? ఇవ్వన్నీ గూడా ముఖ్యమైన అంశాలే కానీ, దక్షిణాదివారి విన్నపం గూడా



త్రోసివేయగూడదు. కుటుంబ నియంత్రణ తు.చ. తప్పకుండా దేశ శ్రేయస్సుకోరి పాటించటం వల్ల ఇప్పుడు ఈ ప్రాంతాలకు నియోజక వర్గాలు తగ్గుతున్నాయి. ఈ డీలిమిటేషన్ వల్ల అన్న అభిప్రాయం ఫెడరల్ వ్యవస్థలో మంచిది కాదు. ఇదే విధంగా డీలిమిటేషన్‌ను సంస్థీకరించటం జరుగుతే శాశ్వతంగా దక్షిణాది ప్రాంతాలవారికి గణనీయమైన నాయకత్వం, రాజకీయ పలుకుబడి ప్రాముఖ్యత కేంద్రంలో వుండకపోవచ్చనే వాదనను గూడా సహేతుకంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాధాకృష్ణన్, నీలం సంజీవ రెడ్డి, వి.వి.గిరి. నారాయణన్ లాంటి వారు రాష్ట్రపతులుగా, పివి నర్సింహారావు, దేవెగౌడ లాంటి వారు ప్రధానమంత్రులయ్యారు. ఇప్పుడు అలాంటి ఎంపిక డీలిమిటేషన్ జనాభా ప్రాతిపదిక మీదనే కొనసాగుతే సాధ్యం కాకపోవచ్చు! రాజ్యాధికారం దక్కటానికి జనాభా ప్రాతిపదికను పరిగణనలోకి తీసుకుంటున్న ఈ ప్రజాస్వామ్య యుగంలో ఆ జనాభా లెక్కలు అనుసరించి ఎందుకు కొన్ని ప్రాంతాలలో జనాభా తగ్గుముఖం, కొన్ని సంవత్సరాలలో పట్టింది అన్నది లెక్కలోకి తీసుకోకుండా సంఖ్యా బలాన్ని బట్టి కేంద్రం నిర్ణయాలు అమలుచేస్తే మౌలిక సిద్ధాంతాలను దెబ్బతీసి కృత్రిమ పరిస్థితులు ఆసరాతో రాజకీయాధికారం కొన్ని ప్రాంతాల వారే అనుభవించే అవకాశాలు పొందటం ఎంతమాత్రం తగదు. పార్టీలు వేరయినంత మాత్రాన కొన్ని రాష్ట్రాలల్లో న్యాయం జరిగేందుకు చేస్తున్న డిమాండ్లలో ఎంతవరకు నిజం వుందన్న ఆలోచన గూడా జాతీయ స్థాయిలో చేయక తప్పదు. నిజంగానే డీలిమిటేషన్ ఒక ప్రణాళికననుసరించి, రాజ్యాంగం ఒప్పుకొనే విధంగా చేస్తున్నాం అని కేంద్రం అనుకుంటే రాష్ట్రాలలోని అధికార పార్టీలు తమ పార్టీకిగానీ, కూటమికిగానీ వేరైనా, సహేతుకమైన ఆలోచనలు సమిష్టిగా చేసి ఒప్పించగలగాలి! అదే ప్రజాస్వామ్యంలోని ముఖ్య సూత్రం!ప్రస్తుతం ఎక్కువ జనాభా, డీలిమిటేషన్ ప్రకారం కొన్ని రాష్ట్రాలలో వుంటే దానిని ఇతర తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలతో సమంగా ఎవరికీ నష్టం కలగని విధంగా, సమాన లాభం కలిగే రీతిలో నిర్ణయాలు సమిష్టిగానో, కమీషన్ల ద్వారానో, చర్చల ద్వారానో, ఆమోదయోగ్యంగా జరుపగలిగితే కేంద్రం అన్ని ప్రాంతాల వారికి ఈ విషయంలో న్యాయంచేసినట్లు అవుతుంది! అది కేంద్రం గురుతర బాధ్యత కూడా! నిజమైన గ్రాస్ డొమస్టిక్ ప్రొడక్ట్ (జి.డి.పి) ఏవిధంగానైతే ద్రవ్యోల్బణం ఆధారంగా (ఇన్ఫ్లేషన్) నిర్ణయించి, అన్ని రాష్ట్రాలకు బెనిఫిట్ కలిగిస్తారో, అదేవిధమైన రీతిలో ఎక్కువ జనాభా వున్నప్పటికీనీ, అన్ని రాష్ట్రాలకు సంఖ్యాపరంగా లోక్‌సభ, విధాన సభలలో న్యాయం చేసే అవకాశాన్ని గూడా లోతుగా సమీక్షించి తీసుకోవాలి! 1977లో లోక్‌సభ సీట్లు 10.10 లక్షల సరాసరి జనాభాను పరిగణనలోకి తీసుకొని 543సీట్లు ఏవిధంగా నిర్ణయించారో 2024 ఆ సూత్రాన్నే అనుసరిస్తే 680 సీట్ల వరకు పెరిగే అవకాశం వుందని నిపుణుల అంచనా! టోటల్ ఫర్టిలిటీరేట్ రాష్ట్రాల పరంగా కూడా అందుబాటులో వుంటుంది కాబట్టి ఇతర హెచ్చుసంఖ్యలో జనాభా ఆధారంగా వచ్చే సంఖ్యను ఈ సూత్రాన్ని అనుసరించి కొంతవరకు తగురీతిలో అన్ని రాష్ట్రాలకూ న్యాయం చేయొచ్చు! ఇంకా ఇంతకంటే మంచి ఫార్ములాలు వుంటే నిర్ణయాలు అందరికీ సంతృప్తి కలిగించే విధంగా తీసుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎవర్నీ చిన్నచూపు చూడటం లేదన్న విశ్వాసం ప్రజల్లో కలుగుతుంది! పార్లమెంటులో రాజ్యాంగ సవరణల నిమిత్తం అనేక చర్చలు జరిపి ఎలక్షన్లు ఏవిధంగా నిర్వహిస్తే ప్రజలందరికీ సంతృప్తి కలుగజేయాలని భావిస్తారో అదేవిధంగా రాజ్యాంగ సవరణ ద్వారా కూడా రాజకీయ సమతుల్యతను ఈ ముఖ్యమైన విషయంలో సాధించవచ్చు! రాజకీయాలు శాశ్వతం కావు కానీ దేశాలూ ప్రజలూ శాశ్వతం! ప్రజల కోసం వుండే వ్యవస్థల్లోని లోటుపాట్లని కాలానుగుణంగా సవరించుకోవటం అధికారంలో వున్న పార్టీ చేయాల్సిన బాధ్యత వుంది. అవసరమైతే రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తూ అధికార దర్పాన్ని, అహంనూ ప్రక్కనపెట్టి విపక్షాలనూ, న్యాయ నిపుణులనూ, మేధావులనూ, ప్రజా సంఘాలనూ విశ్వాసంలోకి తీసుకొని అవసరమైతే ఒకటి కాదు రెండు కాదు అవసరమైనన్ని సమావేశాలు జరిపి చర్చల ద్వారా సమయోచిత నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకుంటే అందరూ సంతోషించటమే కాదు ఆమోదయోగ్యమైన నిర్ణయాలకు కట్టుబడి వుంటారు! అదేప్రజాస్వామ్యం పునాదీమనుగడ! •

# స్థానిక స్వపరిపాలనే పంచాయితీరాజ్ లక్ష్యం

రామ కిష్టయ్య సంగన భట్ల

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఏప్రిల్ 24న భారతదేశంలో ప్రతి ఏటా నిర్వహిస్తారు. పంచాయితీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ అధ్వర్యంతో ఈదినోత్సవం నిర్వహించ బడుతుంది. భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లోఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీనకాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనావ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు రూపుదిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్‌వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లాపరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగాత్మక ప్రాతిపదికగా, సమాజ వికాసాభివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంత రాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించారు. ఈకమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశపెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీక్షించి, గ్రామపరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యేసంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేస్తూ, తన నివేదికను 1957, నవంబరు 24న జాతీయాభివృద్ధి మండలికి సమర్పించింది. కమిటీనివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958, జనవరిలోఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధరాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచనంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్‌జిల్లాలోని, సికార్‌అనే ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం. "నేడు ప్రారంభమవుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడ తాయి". మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామపంచాయతీవ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమబద్ధంగా ఎన్నికలుజరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరుచేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగాపరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్‌వ్యవస్థ లక్ష్యం. •

# నయా వలస పాలనతో రంగాలన్నీ కుదేలు

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ప్రపంచ బ్యాంకు చేపట్టిన నివేదిక ప్రకారం గత 20 సంవత్సరాల కాలంలో ఉన్నత ఆదాయ వర్గాల ఒక శాతం జనాభా ఆదాయాలు 60 శాతం పెరగగా అల్పాదాయ వర్గాల క్రింది భాగాన ఉన్న ఐదుశాతం జనాభా ఆదాయాలు ఒక పైసా కూడా పెరగలేదు. ఈ 20 సంవత్సరాల కాలంలో వివిధ దేశాలలోని పెట్టుబడిదారులు ఆఫ్సోర్సింగ్ చేపట్టి అంటే పరిశ్రమలను, సేవలను ఇతర దేశాలకు తరలించి అక్కడ తక్కువ వేతనాలకు దొరికే కార్మికులను చౌక ధరలకు లభించే ముడిసరుకులను ఉపయోగించి వారు గణనీయంగా తమ ఆదాయాలను పెంపొందించుకో గలిగినారు. ఇది కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైనవి. నేడు ప్రపంచంలో మూడు దేశాల దగ్గర మాత్రమే ఉన్న సంపద మొత్తం బిలియనీర్లు సంపదలో 50 శాతంగా ఉంది. ప్రపంచంలో మొత్తం బిలియనీర్లు 3000 మంది. వీరి సంపద విలువ 16.1 ట్రిలియన్ డాలర్లు. ఎక్కువ మంది బిలియనీర్లు ఉన్న దేశంలో మొదటిది అమెరికా కాగా రెండవది చైనా, మూడవది మన దేశం. ఇలా బిలియనీర్లు కొన్నిదేశాలకే పరిమితంకావడం వలన ప్రపంచ ప్రజల ఆదాయాలు అవకాశాలలో అసమా నతలు పెరిగాయి. పరస్పర ఆధారిత ప్రపంచంలో బిలియ నీర్లు మనస్తత్వంతో లాభాల కోసంపాలకుల దుర్నీతితో ప్రపంచ ఆధిపత్యంకోసం జరుగుతున్న సుంకాల యుద్ధంలో ప్రపంచ ప్రజలు అల్లాడిపోతున్నారు. భారత్ లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాల వలన ప్రపంచమంతా వసుదైక కుటుంబంగా పెట్టుబడులతో ఉద్యోగ కల్పనతో వస్తుఉత్పత్తులతో గణనీయంగా పెరిగి మానవ శ్రేయస్సుతో ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి చెందిపోతాయని ముఖ్యంగావెనుకబడిన దేశాలు అభివృద్ధిలో పెట్టుబడిదారుల దేశాల సరసన సమానంగా అభివృద్ధి చెందుతాయని భావించారు. అయితే ఈవిధానాల వలన వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాల కనుసన్నల్లో తమ ఆర్థికవిధానాలను పెట్టుబడి విధానాలను రూపొందించుకోవాల్సి వస్తుందని ఇది నయా సామ్రాజ్యం వైపు దారితీస్తుందని గమనించ లేకపోయారు. మన పాలకులు అయితే ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు పనిచేయడం లేదనినష్టాలలో ఉన్నాయని ఎల్పిజి విధానాలకు పోయారు. ఇప్పుడు ఏమైంది? ఉత్పత్తి రంగం కుదేలైంది. అనేక వస్తువులు అమెరికా నుంచి చైనానుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దేశంలో నిరుద్యోగిత, మానవ వనరులవిధ్వంసం, సహజ వనరులు పెట్టుబడిదారుల వశం, వృద్ధిప్రక్రియ



అంతా పెట్టుబడిదారుల కనసన్నల్లోకిపోయింది. మన దేశం 191దేశాలలో 132వదిగా విద్యావైద్య జీవనప్రమాణాల రీత్యాఉన్నది. 193దేశాలలోఆయుష్ ప్రమాణం రీత్యా మన దేశంస్థానం 134గా ఉన్నది. ఆకలి ఎక్కువగా ఉన్న జనాభా గల దేశాలలో 125దేశాలలో 111వ దేశం మనది. ఎల్పిజి ఫలితాలవలన ఏర్పడిన దుష్పరిణామం ఇది. తొందరలో మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మన దేశంఅభివృద్ధి చెందుతున్నదని పాలకులు ఎలాచెబుతున్నారో అర్థంకావడం లేదు? ఎల్పిజి ప్రారంభించిన తొలి రోజుల్లో ఇద్దరే ఇద్దరు బిలియనీర్లు ఉన్న దేశంలో నేడు 332బిలియనీర్లు పెరిగినందున దేశం మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థఅవుతున్నదా? ప్రజల ఆదాయాలు గాని ఉద్యోగితను గాని పరిగణనలోకి తీసుకొనే అవసరం లేదా? అంతేకాకుండా నేడుప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద 81.35 కోట్ల మందికి ఐదు కిలోల బియ్యం ఉచితంగా ఇవ్వవలసిన పరిస్థితిఏర్పడింది. పేదలకు ఉద్యోగితను కల్పించకుండా ఆదాయ కల్పన చేయకుండా పాలకులు ఉచిత పథకాలు ప్రవేశపెట్టి పాలనసాగిస్తున్నారు. పేదలజీవనం సాగాలంటే ఉచితాలే గతి అయ్యాయి. ఈవిధంగా దేశ ఆర్థికాభివృద్ధి తిరోగమనంలో ఉన్న కార్పొరేట్ వర్గాలకు చెందిన పైస్థాయి బిలియనీర్ల సంఖ్య ప్రతి ఏడాది దేశంలో పెరుగుతున్నది. వీరి సంపదలోని పెరుగుదల ఏవిధమైన ఉత్పత్తి క్రమం నుంచివచ్చింది కాదు. దేశ సహజ వనరులను దేశ సంపద ప్రభుత్వమే కార్పొరేట ర్లకు తాయిలాలుగా ఇస్తున్నది. దేశంలో బడా కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశంలోని పోర్టులు 25శాతం సిమెంట్ ఉత్పత్తులో 45శాతం స్టీల్ పరిశ్రమల, 33శాతం టెలికాము ల 60శాతం బొగ్గు ఎగుమతులు 65శాతం కేంద్రీకృతమై ఉన్నాయి. దేశం సంపద ప్రైవేట్ గుత్తాధిపత్య సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కారాదని ప్రభుత్వం అలా కాకుండా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు 39వ అధికరణలో స్పష్టంగా పొందుపరిచినారు. వారిసంపద కేంద్రీకృతం అవుతుండడం రాజ్యాంగం ఉల్లంఘనకాదా? ఒకపక్క ద్రవ్యలోటు పేరుతోప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారు. మరోపక్క బడాబాబులు బ్యాంకులకు బకాయిపడ్డ లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేస్తున్నారు. గత తొమ్మిదేళ్లలో పెద్దలబ్యాంకులలో బకాయి పడిన 14.5 లక్షలకోట్లు రుణాలను మాఫీచేసి కేవలం 15శాతం మాత్రమే వసూలు చేయగలిగినారు. మూడేళ్లలో ప్రభుత్వరంగబ్యాంకు లను 12కి కుదించారు. ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థల న్నిటిని చిన్నాభిన్నం చేశారు. ప్రజాస్వామ్య ముసుగులో లాభాలేముఖ్యమై ఆర్థిక సంపాదన కోసం అగ్రరాజ్యాల పాలకులు ప్రజానాయ కులమని చెప్పుకుంటూనే ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదం వైపు పరుగులు తీస్తున్నారు. గ్లోబలైజేషన్‌వలన ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగిత ఆదాయ అసమానతలు పెరగడం బిలియనీర్ల సంఖ్య పెరగడం జరిగిందిగాని ప్రజాశ్రేయస్సు శూన్యం. •

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విదేశీ అతిథుల పర్యటనల్లోనే ఉగ్రదాడులు



**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** భారత్‌లో విదేశీ అతిథులు, అగ్రనేతలు పర్యటిస్తున్న సమయంలోనే ఉగ్రదాడులు జరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది పాకిస్థాన్ కుట్రబుద్ధికి ఓ తార్కాణంలా కనిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటి పహల్గాం ఉగ్రదాడికి, 2000 సంవత్సరంలో జరిగిన అనంత్‌నాగ్ ఛత్తీసింగ్‌పోరా నరమేధానికి చాలా పోలికలు కనిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్ ఈ విధమైన నక్కజిత్తులు వేషాలు వేస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రధాని మోడీ విదేశీ పర్యటనలో ఉండడం, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటనలో ఉండడాన్ని అవకాశంగా తీసుకుని పాకిస్థాన్ పహల్గాం ఉగ్రదాడికి పాల్పడి ఉండవచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి. 2000 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్ పర్యటనకు వచ్చారు. సరిగ్గా అదే సమయంలో, అంటే 2000 మార్చి 20న అనంత్‌నాగ్ జిల్లాలో ఛత్తీసింగ్‌పోరలో ఉగ్రవాదులు ఆకస్మిక దాడులు చేసి 36 మందిని బలి తీసుకున్నారు. నాడు సిక్కులే ముష్కర మూకలకు లక్ష్యంగా మారారు. జమ్ముకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయాలనే ఉద్దేశంతోనే పాక్ కుట్ర చేసింది. ఆనాడు ఉగ్రవాదులు రెండు సైనిక వాహనాల్లో, భారీ స్థాయిలో తుపాకులు తీసుకుని ఛత్తీసింగ్‌పోర గ్రామంలోకి చొరబడ్డారు. భారత సైనికుల వేషంలో ఇంటింటికీ వెళ్లి, తనిఖీల నిమిత్తం పురుషులు బయటకు రావాలని బెదిరించారు. అలా వచ్చిన పురుషులను గురుద్వారా వద్దకు తీసుకెళ్లి చంపేశారు. భారత సైన్యమే అలా చేసిందని, అక్కడి వారిని నమ్మించేలా ఉగ్రవాదులు నినాదాలు చేశారు. చివరికి దర్యాప్తులో పాక్ ఉగ్రవాదులే ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఇప్పటి పహల్గాం ఉగ్రదాడికి, 2000లో జరిగిన ఛత్తీసింగ్‌పోరా నరమేధానికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, తన కుటుంబంతో సహా భారత పర్యటనకు వచ్చారు. మరోవైపు భారత ప్రధాని నరేంద్ర మోడీ సౌదీ అరేబియా పర్యటనలో ఉన్నారు. దీనితో జమ్మూకశ్మీర్ అంశాన్ని మరోసారి ప్రపంచానికి తెలియజేయాలని పాక్ కుట్రపన్నినట్లు తెలుస్తోంది. అందుకే భారత సైనికుల్లా వేషాలువేసుకున్న ఉగ్రవాదులు, కశ్మీర్‌లోని పర్యటకులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడ్డారు. మరీ ముఖ్యంగా పురుషులనే లక్ష్యంగా చేసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆసీమ్ మునీర్ ఇటీవలే ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో మాట్లాడుతూ, భారత్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. మన లక్ష్యం స్పష్టంగా ఉంది. గతంలో కశ్మీర్ మన గొంతులోని రక్తనాళంలా ఉండేది. ఇక భవిష్యత్తులోనూ అలానే ఉంటుంది. కశ్మీర్‌ను మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరులు పోరాటం చేస్తున్నారు. వారిని మనం ఒంటరిగా వదిలేయం. మీరు మీ పిల్లలకు పాకిస్థాన్ కథను కచ్చితంగా చెప్పండి. మన జీవితంలోని ప్రతి అంశం హిందువుల కంటే చాలా భిన్నమని మన పూర్వీకులు భావించారు. ఆ విషయాన్నే పిల్లలకు చెప్పండి. అప్పుడే మన పూర్వీకుల ఆలోచనలను పిల్లలు గుర్తుంచుకుంటారు. ఈ రెండు మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు పూర్తిగా భిన్నమైనవి. అదే ఈ రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. ఆసీమ్ మునీర్, పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ ఈ రెచ్చగొట్టే ప్రసంగం చేసిన తర్వాతే పహల్గాం దాడి జరిగింది. మరోవైపు ఇదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా, నిఘా విమానాలను కరాచీనుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించారు. ఇదంతా భారత్‌ను ఢీకొట్టాలని పాక్ చేస్తున్న ప్రయత్నమేనన్న అనుమానాలను బలపరుస్తోంది.




## కాశ్మీరీలు సిగ్గుపడుతున్నారు -మెహబూబా ముఫ్తీ

**శ్రీనగర్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 27 మంది పర్యాటకులు మరణించడంపై పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ స్పందించారు. ఈ సంఘటనతో తమతోపాటు కశ్మీరీలు సిగ్గుపడుతున్నారని తెలిపారు. గత కొన్నేళ్లుగా కశ్మీర్‌లో పౌరులపై జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటని అన్నారు. బుధవారం శ్రీనగర్‌లో పిడిపి కార్యకర్తలతో కలిసి మెహబూబా ముఫ్తీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 'ఇది మనందరిపై దాడి, అమాయకులను చంపడం భయానక చర్య, అమాయకుల హత్యలను ఆపండి' అని రాసి ఉన్న ప్లకార్డులను కార్యకర్తలు ప్రదర్శించారు. కాగా, నిరసన ర్యాలీతర్వాత మెహబూబా ముఫ్తీ మీడియాతో మాట్లాడారు. ఉగ్రదాడి అమాయక పర్యాటకులపైనే కాదని, కశ్మీరియత్‌పై కూడా జరిగిందని తెలిపారు. 'ఇది మాపై జరిగిన దాడి. మేం దీనిని ఖండిస్తున్నాం. దీనిని సహించబోం. హోంమంత్రి ఇక్కడఉన్నారు. దాడిలో ప్రమేయం ఉన్న ఉగ్రవాదులను గుర్తించాలి. అప్పుడు వీలైనంత త్వరగా శిక్షించవచ్చు' అని అన్నారు. మరోవైపు సరదాగా గడిపేందుకు కశ్మీర్‌కు వచ్చే అమాయక పర్యాటకులపై ఉగ్రదాడి చేయడం అత్యంత పిరికి పని అని మెహబూబా ముఫ్తీ విమర్శించారు.

'మేం సిగ్గుపడుతున్నాం. కశ్మీరీలు సిగ్గుపడుతున్నారని దేశ ప్రజలకు నేను చెప్పాలనుకుంటున్నా. ఈ బాధాకరమైన సమయంలో మేం మీకు అండగా ఉంటాం. నేరస్తులను ప్రభుత్వం పట్టుకుని శిక్ష విధించాలని మేం కోరుతున్నాం' అని అన్నారు.

కాగా, ఉగ్రదాడి భద్రతా లోపమా అన్న ప్రశ్నకు, రాజకీయాలు ఆడటానికి ఇది సమయం కాదని మెహబూబా ముఫ్తీ తెలిపారు. 'మా హృదయాలు బాధలో ఉన్నాయి. ప్రజల హృదయాలు పగిలిపోయాయి. జమ్ముకశ్మీర్, దేశం మొత్తం శోకసంద్రంలో ఉన్నది. ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధను మేం పంచుకుంటున్నాం. దేశ ప్రజలకు నేను క్షమాపణలు చెప్పాలనుకుంటున్నా' అని అన్నారు.



## సిఎం, డిప్యూటీలను చంపేస్తామంటూ బెదరింపులు!

**బెంగళూరు, ఏప్రిల్ 23:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ఉప ముఖ్యమంత్రిడీకే శివ కుమార్‌ను హతమారుస్తామని బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. సీఎం, డిప్యూటీ సీఎంలను దారుణంగా హత్య చేస్తామని ఓ దుండగుడు ఈ మెయిల్‌లో బెదిరింపు సందేశం పంపాడు. కర్ణాటక విధానసౌధ పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. రాంపురకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తికి తాను కోటి రూపాయలు అప్పుగా ఇచ్చానని, దానిని ఇంకా తిరిగి చెల్లించనందున అతడిని కూడా హత్య చేస్తానని మెయిల్‌లో ఆగంతకుడు పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సింధార్ రాజపుత్ అనే వ్యక్తి పేరిట మెయిల్ వచ్చినట్లు గుర్తించామని, తదుపరి విచారణ కొనసాగుతోందని అన్నారు.

త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బెదిరింపు మెయిల్ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు.

# మృతులకు హోంమంత్రి అమిత్‌షా నివాళి

### మృతులకు జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షలు చొప్పున పరిహారం

### శ్రీనగర్‌నుంచి ఢిల్లీ, ముంబయిలకు ప్రత్యేక విమానసర్వీసులు



**శ్రీనగర్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రమంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అధికారులను భద్రతను కట్టుదిట్టం చేశారు. ఓవైపు ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు సాగుతున్నాయి. మరోవైపు కేంద్రమంత్రులు తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తాజాగా కీలక ప్రకటన చేశారు. పర్యాటకుల భద్రత మేరకు వారి కోసం శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు ప్రత్యేకవిమానాలు శ్రీనగర్ నుంచి ముంబయి, ఢిల్లీకి చేరుకుంటాయని చెప్పారు. ఆ విషయంపై మంగళవారం హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడానని తెలిపారు. అవసరమైతే మరిన్ని విమానాలు నడపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులోభాగంగా మంత్రి అన్ని విమానయాన ఆపరేటర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇలాంటి సమయంలో ప్రయాణికులపై భారం పడకుండా సాధారణ స్థాయి ఛార్జీలను వసూలు చేయాలని విమానయాన సంస్థలను ఆదేశించారు. మరణించిన వ్యక్తుల మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకొని పనిచేస్తూ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. శ్రీనగర్‌కు వెళ్లే విమానాలను పెంచాలని పలు విమానయాన సంస్థలను కేంద్రం కోరింది. అదే సమయంలో శ్రీనగర్ పర్యాటకులకు కొన్ని మినహాయింపులు ఇచ్చింది ఇండిగో సంస్థ. విమాన టికెట్లు రీషెడ్యూల్, కాన్సలేషన్ ఛార్జీలను రద్దు చేసింది. శ్రీనగర్‌కు ప్రత్యేక సర్వీసులు కూడా నడుపుతున్నామని బుధవారం వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు జమ్ముకశ్మీర్ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. మరోవైపు పహల్గాంలో కాల్పులు జరిగిన ప్రదేశాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరిశీలించారు. ప్రాణాలు కోల్పోయిన వారికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నివాళులు అర్పించారు. అందుకోసం బుధవారం ఉదయం శ్రీనగర్‌కు చేరుకున్నారు. అనంతరం పుష్ప గుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాద దాడిలో కర్ణాటకకుచెందిన ఇద్దరు వ్యక్తులు మరణించారని ఆ రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించింది. అక్కడి నుంచి పర్యటకులను తీసుకు రావడానికి హెల్ప్‌లైన్ నంబర్‌లను ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్ల ద్వారా పర్యటకుల వివరాలను రాబట్టేలా చర్యలు తీసుకుంది. మరణించిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులతో పాటు బుధవారం మధ్యాహ్నం తిరిగి తీసుకురావాలని నిర్ణయించింది. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో గోవాకు చెందిన 50 మందికి పైగా పర్యాటకులు జమ్ముకశ్మీర్‌లో చిక్కుకున్నారు. వారంతా శ్రీనగర్‌లోని హోటళ్లలో చిక్కుకుపోయారని, వారిని తిరిగి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారని చెప్పారు.

## సైనికులను చూసి కూడా వణికిన పర్యాటకులు!

**శ్రీనగర్, ఏప్రిల్ 23:** పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి దాడులకు తెగబడ్డారు. మొత్తం ఐదుగురు ముష్కరులు మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మొత్తం 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రదాడి నుంచి బయటపడిన పలువురు బాధితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో రావడంతో.. దాడి అనంతరం బాధితులను రక్షించేందుకు వచ్చిన సైనికులను చూసి కూడా జనం గడగడ వణికిపోయారు. ఉగ్రవాదులు మళ్లీ వచ్చారనుకుని భీతిల్లారు. సైనికులను చూసిన ఓ మహిళ తన కొడుకును ఏమీ చేయవద్దని బోరున విలపించింది. చేతులు జోడించి వేడుకుంది. ఇతర పర్యటకులు భయంతో తమ పిల్లలను తమ వెనుక దాచుకున్నారు. దాంతో ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్పారు. తాము భారత ఆర్మీ నుంచి మిమ్మల్ని రక్షించడానికే వచ్చామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అదేవిధంగా ఉగ్రవాదుల దాడిలో తన భర్త మరణాన్ని చూసి షాక్‌కు గురైన ఓ మహిళ అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారని, బాధతో రోదిస్తూనే ఉన్నారని భద్రతా బలగాలు తెలిపాయి.

కాగా జమ్ముకశ్మీర్‌లో పౌరులే లక్ష్యంగా జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రదాడుల్లో ఇది కూడా ఒకటి. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత 'లష్కరే తోయిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ మారణహోమానికి తామే పాల్పడినట్లు ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఉగ్రదాడి జరిగింది. దుండగులు అతి సమీపంనుంచి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడికి దిగారు. 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



## శాంతిచర్చలకు సిద్ధమే: పుతిన్

**మాస్కో, ఏప్రిల్ 23:** ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ద్వైపాక్షిక చర్చలపై ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా దేశ అధికారిక వార్తాచానెల్‌లో మాట్లాడిన పుతిన్ ఈ మేరకు చెప్పారు. శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని, ఉక్రెయిన్ నుంచి కూడా ఇదే ఆశిస్తున్నా టమని తెలిపారు.

అయితే, పుతిన్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరోక్షంగా స్పందించారు. కాల్పుల విరమణ ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఈ వివాదం ముగింపు లక్ష్యంగా అమెరికా, యూరప్ దేశాల ప్రతినిధులతో చర్చించడానికి ఉక్రెయిన్ ఉన్నత స్థాయి బృందం లండన్‌కు వెళ్తుందని తెలిపారు. ఒక వైపు శాంతి చర్చలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు రష్యా ఉక్రెయిన్‌లు మాత్రం దాడులను చేసుకుంటూనే ఉన్నాయి. ఆదివారం కీవ్‌పై పదులకొద్దీ డ్రోన్, బాంబు దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. బదులుగా కీవ్ బలగాలూ దాడులు కొనసాగించాయని రష్యా అధికారులు ఆరోపించారు. మరోవైపు ఉక్రెయిన్, రష్యాలు యుద్ధం విరమణపై తొందరగా ఒక ఒప్పందానికి రాకపోతే శాంతి ఒప్పందం కుదిర్చే ప్రయత్నాల నుంచి విరమించుకుంటామని అమెరికా ఇప్పటికే ప్రకటించింది. ఇప్పుడు ఈవారంలోనే యుద్ధం ఆగే అవకాశాలున్నాయని చెబుతోంది. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్‌లమధ్య శాంతిఒప్పందం ఈ వారంలోనే కుదిరే అవకాశం ఉందంటూ తన సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో పోస్టు చేశారు. ఈ రెండు దేశాలు తమతో కలిసి భారీగా వ్యాపారం చేయబోతున్నాయని కూడా వెల్లడించారు.

# పర్యాటకులను రక్షించిన వ్యాపారి

**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం పర్యటనకు వచ్చిన వారిపై ఉగ్రవాదులు చేసిన దాడిలో 26 మంది మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. అయితే, స్థానిక వ్యాపారులు చొరవ తీసుకుని పలువురు పర్యటకులను రక్షించారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడినట్లు పర్యాటకులు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహేంద్రగఢ్ చిర్‌మిరీ భరత్‌పూర్ ప్రాంతానికి చెందిన నాలుగు కుటుంబాలు పహల్గాం పర్యటనకు వెళ్లాయి. ఉగ్రగదాడి జరిగిన సమయంలో శివాన్‌షైన్, కుల్దీప్ స్తాపక్, అర్వీందర్ అగర్వాల్, హ్యాప్పీ బద్వాన్ కుటుంబాలకు చెందిన 11మంది అక్కడే ఉన్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 18న వీరందరూ చిన్నారులతో సహా విహార యాత్రకు వెళ్లారు. ఏప్రిల్ 21న పహల్గాం చేరుకున్నట్లు కుల్దీప్ బంధువు రాకేశ్ తెలిపారు. అయితే, కొండచరియలు విరిగిపడడం వల్ల రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయిందని, ఎక్కడి వారు అక్కడే ఆగిపోయారని వివరించారు. ఈ సమయంలోనే కాల్పులు జరిగాయని, దీంతో భయపడిన పర్యాటకులు పరుగులు తీసినట్లు వెల్లడించారు.



వీరిని గమనించిన స్థానిక కశ్మీరీ వ్యాపారి నజకత్ అలీ సమయస్ఫూర్తిని ప్రదర్శించి, పర్యాటకుల 11 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడినట్లు తెలిపారు. నజకత్ అలీ ప్రతి ఏడాది శీతల కాలంలో ఉన్ని దుస్తులు విక్రయించేందుకు చిర్‌మిరికి వస్తుంటాడని వారు పేర్కొన్నారు. పహల్గామ్ వెళ్లిన పర్యాటకులు కుల్దీప్ స్తాపక్, అతడి భార్యతో పాటు అనేక మంది పహల్గాం పర్యటనకు వెళ్లారు. వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఉగ్ర దాడి జరిగిన సమయంలో వీరంతా అక్కడే ఉన్నారు. దీంతో భయపడి లాడ్జ్ వైపు వచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత అక్కడి నుంచి సురక్షితంగా జమ్ముకు వచ్చారని చెప్పారు. కశ్మీర్ నుంచి చిర్‌మిరికి వచ్చి వ్యాపారాలు చేసుకునేవారు వీరిందరిని సురక్షితంగా పంపించడంలో సాయం చేశారు. రాకేశ్ పరాశర్, కుల్దీప్ బంధువు నా కొడుకు, కోడలు, మనవడు కలిసి పహల్గాం పర్యటనకు వెళ్లారు. వారితో పాటు ముగ్గురు స్నేహితుల కుటుంబాలు అక్కడికి వెళ్లాయి. ఉగ్రదాడి జరగడంతో భయపడ్డాం. వారికి ఫోన్ చేయగా తామంతా సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. శివాన్ష్ జైన్ తల్లి పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడింది. సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులను చుట్టుముట్టి, అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. ఘటన నేపథ్యంలో ఎన్ఐఏ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టింది.

## పల్వామా 2 దాడిగా భావించాలి

### ముష్కరులను మట్టుపెట్టాల్సిందే..

### జమ్ముకాశ్మీర్ మాజీ డిజిపి శేష్‌పాల్ వైద్



**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడి చేసిన విధానం, అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి తరహాలో ఉందని జమ్ముకశ్మీర్ మాజీ డిజిపి శేష్ పాల్ వైద్ అన్నారు. భారత్‌పై జరిగిన ఈ దాడిని పుల్వామా 2గా భావించాలని తేల్చిచెప్పారు. రెండు రోజుల క్రితం పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ భారత్‌పై చాలా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవేవో యాదృచ్ఛికంగా అన్నమాటలు కావు. ఎందుకంటే ఉగ్రవాదులు పర్యాటకుల మతాన్ని అడిగి, ఎవరైతే ముస్లింలు కారో వారిని మాత్రమే చంపారు. హమాస్ దాడిని ఇజ్రాయెల్ ఎలా తిప్పికొట్టిందో, భారత్ కూడా అలానే చేయాలి. వాస్తవానికి ఈ ఉగ్రదాడిని పాకిస్థాన్ సైన్యం ప్రారంభించింది. ఎందుకంటే దాడి చేసింది ఉగ్రవాదులు కాదు. ఉగ్రవాదుల ముసుగులో పాకిస్థాన్ సైన్యంలోని ఎస్ఎస్‌జీ (స్పెషల్ సర్వీస్ గ్రూప్) కమాండోలు ఈ దాడులకు పాల్పడ్డారు. ఇది ఒక పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిన దాడి. ఇక మనం చాలా అప్రమత్తంగా ఉండాల్సిందే. అని మాజీ డిజిపి అన్నారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా, సింధ్, పీఓకే ప్రజలందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. పాకిస్థాన్ సైన్యం చేసిన ఈ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, స్వాతంత్ర్యం ప్రకటించుకోండి. అంతేకాదు, పాకిస్థాన్ సైన్యం వెన్నువిరిచి, భారత్ దాన్ని నాలుగు ముక్కలుగా నరకాలి అని శేష్ పాల్ వైద్ అన్నారు. వాస్తవానికి ఉగ్రదాడి అంతా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఆదేశాలతోనే జరుగుతోంది. పైగా ఈ తరహా దాడులను మరింత తీవ్రతరం చేయాలని ఆయన అనుకుంటున్నారు. అతను తనేంటో నిరూపించుకోవాలని ఆరాటపడుతున్నాడు అని మాజీ డిజిపి పేర్కొన్నారు.

# జమ్ముకాశ్మీర్‌లో వెల్లువెత్తిన నిరసన



**శ్రీనగర్, ఏప్రిల్ 23:** ఉగ్ర దాడితో జమ్ముకాశ్మీర్ మరోసారి ఉలిక్కిపడింది. పహల్గాంవ్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడితో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అయ్యాయి. శ్రీనగర్‌సహా స్థానికంగా అనేక ప్రాంతాల్లో స్వచ్ఛందంగా బంద్‌పాటించారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. పీపుల్స్ డెమొక్రటిక్‌పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ దేశప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈఘటనతో కాశ్మీరీలు సిగ్గుతో తలదించుకుంటున్నారని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కూడా లాల్‌చౌక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టింది. రాజకీయ పార్టీలు సహా అన్ని వర్గాలప్రజలు ఉగ్రచర్యలను ఖండిస్తూ నిరసన ప్రదర్శనలుచేసారు. కాశ్మీర్ ఆర్థికమూలాలను దెబ్బతీసారని ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తంచేసారు. ఇటీవలికాలంలో దుకాణాలు మూతపడటం ఇదే తొలిసారి. 370వ అధికరణం రద్దు తర్వాత గత ఆరేళ్లలో కాశ్మీర్‌లో బంద్ పాటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇలాంటివి మళ్లీ జరక్కూడదు. కాశ్మీర్‌పేరుతో ఏదైనా వర్గంపేరుతో ఇలాంటివి మళ్లీ కొనసాగనీయకూడదని, అమాయకుల ప్రాణాలు తీయడం అంటే మొత్తం మానవాళినే చంపడంతో సమానం అని హాజీ బాషిర్ అహ్మద్ అనే శ్రీనగర్ వాసి అన్నారు. వీలైనంత త్వరగా ఉగ్రవాద మూలాలు నిర్మూలించాలనికోరారు. కాశ్మీరీ సమాజాన్ని కించపరచడం స్థానిక ఆర్థికవ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్రలుజరుగుతున్నాయని అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు ప్రభుత్వం ఏం చర్యతీసుకున్నా తాము మద్దతు ఇస్తామన్నారు. ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లా హంద్వారాలో భారీ నిరసనలు జరిగాయి. దక్షిణకాశ్మీర్‌లో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. 2016లో హిజ్‌బుల్ ముహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వానీ హతమైన తర్వాత ఇలాగే స్థానికులు వీధుల్లోకి వచ్చారు. కాశ్మీరీలు ఉగ్రవాదంతో లేరని ప్రపంచానికి తెలిజెప్పేందుకే ఈ నిరసనలుచేస్తున్నామని పర్యాటకులపై దాడిని ఖండిస్తున్నామని ఆందోళనకారులు చెప్పారు. దాడికి పాల్పడిన వారు జమ్ముకాశ్మీర్‌ప్రజలు మేలు కోరేవారుకాదని నేషనల్ కాన్ఫరెన్స్ నేత శ్రీనగర్ ఎంపి ఆగా సయ్యద్ రుహుల్లా మెహ్‌దీ అన్నారు. రాంబన్ జిల్లాలోకూడా నిరసనలు జరిగాయి. ఆకస్మిక వరదలు కొండచరియలు విరిగిపడిన ఘటనలతో విలవిల్లాడుతున్నా ఉగ్రదాడికి నిరసనగా బంద్‌పాటించి శాంతియుత నిరసనలుచేసారు. ఈ పట్టణం చరిత్రలో తొలిసారిగా హిందూ ముస్లిం వర్గాలు కలిసి ఉగ్రచర్యకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంచేపట్టడం గమనార్హం.

# పొగాకు రైతు సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్తా : కాకర్ల



**కలిగిరి (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** పొగాకు పండించినా రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధీష్టికి తీసుకెళ్లి రైతులకుమంచి జరిగేవిదంగా కృషి చేస్తానని ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. బుదవారం కలిగిరి పొగాకు వేలం కేంద్రాన్ని రైతుల కోరిక మేరకు కాకర్ల సురేష్ సందర్శించారు. ఈసందర్భంగా కలిగిరి పొగాకు బోర్డులో రైతులు కొనుగోలుకు తెచ్చిన పొగాకు బేళ్లను పరిశీలించారు. అనంతరం కొనుగోలు దారుల ఆక్షన్‌లో రైతులతో కలసి పాల్గొన్నారు. పొగాకు ధరలు హెచ్చు తగ్గులు, పొగాకు నాణ్యతను బట్టి రకాలుగురించి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా రైతుసంఘనాయకులు శ్రీకాంత్ పొగాకు పంట వేసిన దగ్గరనుండి పెట్టుబడి, అమ్మితే రాబడి వరకు యంఎల్‌ఏ దృష్టికి తీసుకువచ్చారు. తదనంతరం రైతులుకూడా ఈ సంవత్సరం అన్ని పెట్టుబడులు అధికమైనాయని కానీ ధర విషయానికి వస్తే గత సంవత్సరంకన్నా క్వింటాకు రు. 10వేలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఇలాఐతే రైతు బారీగా నష్టపోతారని ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని యంఎల్‌ఏ దృష్టికి తెచ్చారు. అనంతరం ఇదేవిషయం పొగాకు బోర్డుఆకషన్ అధికారితో సమావేశమై రైతులు పడుతున్న ఇబ్బందులు ధర విషయంలో జరుగుతున్న అన్యాయంపై వేలం నిర్వాహణాధికారితోయంఎల్‌ఏ చర్చించారు. ధరలవిషయంలో పొగాకు కొనుగోలు చేసే కంపెనీ ప్రతినిదులతో మాట్లాడి రైతులకు నష్టం వాటెల్లకుండా చూడాలన్నారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూఈ ప్రాతంలో రైతులు వర్జీనియా పొగాకు అధికంగా పండించడం జరుగుతుందన్నారు. పొగాకు పండించేందుకు ఎకరాకు రైతుకు ఈసంవత్సం లక్షాయాబైవేలనుండి లక్షా60వేలవరకు పెట్టుబడిఅవుతుందన్నారు. కానీ ఇక్కడ పొగాకు ధరలు చూస్తే గత సంవత్సరం పొగాకు ధర మేలురకం కింటాకురు. 38వేలు పలికితే అదేపొగారు ఈసంవత్సరం క్వింటారు. 28వేలు పలుకుతుందన్నారు. ఇక రెండవరకంపొగాకు ధర గతసంవత్సరం కన్నా 10వేలరూపాయల తక్కువ ధరకు కొంటున్నారన్నారన్నారు. ఇది బోర్డు, బయ్యర్లు కలిసి రైతులను ఇబ్బందులు పెడుతున్నట్లు రైతులద్వారా తెలుస్తుందన్నారు. కలిగిరి పొగాకు బోర్డు పరిదిలో సుమారు 1500మందిపైగా రైతులు పొగాకు పండిస్తున్నారన్నారు. ఈపొగాకు పంటకాలంలో అధికపెట్టుబడులు పెట్టి అమ్మకాలకు పంటను తీసుకువస్తే కంపెనీలు ఈవిదంగా కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. ఇదేవిషయం మే1న చంద్రబాబు పర్యటన ఆత్మకూరులో ఉందని ఆత్మకూరు నియోజకవర్గంపరిదిలోని డిసి పల్లెలోకూడా పొగాకు బోర్డులో అమ్మకాలు తెలుసుకొని ఆత్మకూరు శాసన సభ్యులుతో కలసి బాబుదృష్టికి తీసుకెళ్తామన్నారు. అదేవిదంగా కేంద్ర వ్యవసాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి పొగాకు రైతులకు న్యాయం జరిగేవిదంగా కృషిచేస్తామని రైతులకు కాకర్ల సురేష్ మాటి ఇచ్చారు. ఈయన వెంట రైతుసంఘనాయకులు శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర రైతుసంఘకార్యనిర్వాహక కార్యదర్శి బొల్లినేని వెంకట రామారావు, రావులకొల్లు సర్పంచి వ్రా సా ల వె ం గ వ నా య ఖ డు, వ ు ల్నె ని శ్రీనివాసులనాయుడు, గన్నమనేని శ్రీనివాసులు, చితంరెడ్డి సుబ్బారెడ్డి, సిహెచ్‌సుబ్బారెడ్డి, బుజ్జియ్య తదితరులు పాల్గొన్నారు.

# పదోతరగతిలో గురుకుల విద్యార్థుల ప్రతిభ:మంత్రి సవిత



**విజయవాడ,ఏప్రిల్23.ప్రభాతవార్తప్రతినిధి:** టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ బీసీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఎంజేపీ బీసీ స్కూళ్లు ఫలితాలు సాధించాయన్నారు. 29 స్కూళ్లో వంద శాతం ఫలితాలు రావడంపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. బిసి హస్టల్స్, ఎంజేపీ బీసీ స్కూళ్ల విద్యార్దులు సాధించిన ఫలితాలపై బుధవారం ఆమె ఒక ప్రకటన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తోందని, సీఎం చంద్రబాబు ఆశయాలు నెరవేర్చేలా టెన్త్ లో ఫలితాలు రాబట్టినందుకు ఆమె విద్యార్థులను అభినందించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో విశేష కృషి చేసిన ఎంజేపీ బీసీ ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడా మంత్రి సవిత అభినందనలు తెలిపారు. అధికారంలోకి రాగానే డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీల బకాయిల చెల్లించామన్నారు. హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు నిధుల మంజూరు చేశామన్నారు. ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్లతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. హాస్టళ్లకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లోనూ పట్టు సాధించేలా ఉపాధ్యాయులతో నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఈ విజయం ముమ్మాటికీ సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత స్పష్టంచేశారు. పదో తరగతి పరీక్షల్లోనూ మహాత్మా జ్యోతిరావు పూలే(ఎంజేపీ) బీసీ గురుకుల విద్యార్థులు టాప్ లేపారు. బుధవారం విడుదలైన టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ బీసీ స్కూల్ విద్యార్థులు 95 శాతం మేర ఉత్తీర్ణతీ సాధించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల్లోనూ ఎంజేపీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించిన విషయం విధితమే. ఎంజేపీ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రస్థాయి ఉత్తీర్ణత కంటే అధికంగా ఎంజేపీ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి ఫలితాల్లో 81.14 శాతం మేర ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఫలితాల్లో బీసీ వెల్ఫేర్ కు చెందిన ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 95 శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కు చెందిన 11,819 పాఠశాలలకు చెందిన 6,14,459 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులకు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. వారిలో 95 శాతం మంది పదో తరగతి పరీక్షల్లో పాసైయ్యారు. 29 ఎంజేపీ స్కూళ్లలో వంద శాతం మేర ఉత్తీర్ణత సాధించడం విశేషం. అదే సమయంలో ఎంజేపీ స్కూళ్లో జీరో ఉత్తీర్ణత శాతం నమోదుకాకపోవడం మరో విశేషం. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు పరిశీలిస్తే... ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లతో సమానంగా ఎంజేపీ బీసీ స్కూళ్ల అత్యుత్తమ ఫలితాలు సాధించాయి.

# కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందని హత్య చేసిన తండ్రి

## - తండ్రి, కుమారుడిని అరెస్టు చేసిన టుటౌన్ పోలీసులు - వీడిన యాస్మిన్ హత్య మిస్టరీ



తండ్రి, సోదరుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

**చిత్తూరుటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** చిత్తూరు బాలాజీకాలనీలో మృతి చెందిన యాస్మిన్‌ను కన్న తండ్రి, ఆమె సోదరులు కలిసి పరువు హత్య చేశారని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసుల దర్యాప్తులో తేలడంతో బుధవారం యాస్మిన్‌ను హత్య చేసిన ఆమె తండ్రి షౌకత్‌ఆలీ(56), షౌకత్ ఆలీ భార్య అక్క కుమారుడు మహ్మద్‌భాష అలియాస్ అబ్దుల్(29)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు అబుల్ కలాం పరారీలో వున్నాడు. బాలాజీకాలనీలో ఈ నెల 13వ తేదీన తన కుమార్తె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి షౌకత్‌ఆలీ టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసి అక్కడికి వెళ్ళిన పోలీసులకు నిజంగా ఆమె ఉరి వేసుకుని మృతి చెందినట్లుగా వుండటంతో పోలీసులు అనుమానస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చిత్తూరు బాలాజీ కాలనీలో ఎస్.ముంతాజ్, షౌకత్‌ఆలీ దంపతులు నివాసం వుంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఇద్దరు కుమార్తెలకు వివాహం అయ్యింది. యాస్మిన్ చిన్న కుమార్తె. ఈమె ఎస్వీసెట్ కళాశాలలో ఎంబిఎ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూ ఇంట్లో వుండేది. ఈ క్రమంలో యాస్మిన్ తల్లిదండ్రులు చిన్న కుమార్తెకు వివాహం చేయాలని చిత్తూరు రామ్‌నగర్ కాలనీలో నివాసం వుంటున్న షరీఫ్ అనే వ్యక్తిని ఎంచుకుని పెళ్ళి ముహూర్తం నిర్ణయించారు. ఈ మేరకు ఫిబ్రవరి 9వ తేదీ వివాహం జరగాల్సి వుంది. అయితే యాస్మిన్ తాను చదివే కళాశాలలో పరిచయం అయిన పూతలపట్టు మండలం పోటుకనుమ గ్రామంకు చెందిన సాయితేజ్‌ను ప్రేమించడంతో ఇంట్లో ఎవ్వరికి తెలియకుండా ఫిబ్రవరి 6వ తేదీ పారిపోయింది. ఈ మేరకు వెళ్ళిన యాస్మిన్ సాయితేజను కలిసి పెళ్ళి చేసుకుంది. తన కుమార్తె ప్రేమ పెళ్ళి నచ్చని యాస్మిన్ తండ్రి షౌకత్‌ఆలీ కుమార్తెను చంపాలని పక్కాగా ప్లాన్ చేశాడు. తన భార్యకు సోదరి కుమారులైన మహ్మద్ భాషా అలియాస్ లాలు, అబ్దుల్‌తో కలిసి యాస్మిన్‌తో మాట్లాడాలి అని చెప్పి ఈ నెల 13వ తేదీన చిత్తూరుకు రప్పించారు. చిత్తూరు పిసిఆర్ జూనియర్ కళాశాల వద్ద అద్దెకు తీసుకున్న స్కార్పియో వాహనంలో యాస్మిన్‌ను ఎక్కించుకుని ఇంటికి వెళ్తున్నామని చెప్పి అక్కడికి వెళ్ళకుండా మాపాక్షి క్రాస్ వద్ద బాలాజీ హ్యాచరీస్ సమీపంలో వున్న బీడు పొలాల్లో వాహనంను నిలుపుదల చేసి ఆమెకు ముందుగానే తాము తెచ్చుకున్న నూలు తాడును ఆమె గొంతుకు బిగించి హత్య చేశారు. అనంతరం యాస్మిన్ మృతదేహంను తండ్రి షౌకత్‌ఆలీ తీసుకువచ్చి తన ఇంటి ముందర వరండాలో పడుకోబెట్టి అక్కడ నుండి షౌకత్ ఆలీ, మిగిలిన ఇద్దరు పరారీ అయ్యారు. ఈ మేరకు యాస్మిన్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పోలీసులు నిందితులైన షౌకత్ ఆలీ, మహ్మద్ భాష అలియాస్ లాలులను అర్బన్ తహసిల్దారు ఎదుట ఎక్స్‌ట్రా జుడీషియల్ కన్ఫెక్షన్ కింద చిత్తూరు టుటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరించారు.

# సమాజాన్ని జాగృతపరిచే సాహిత్యం రావాలి - సాహితీవేత్తలు

## - ప్రభుత్వ ఉగాది కళారత్న, పురస్కార గ్రహీతలకు 'ఎక్స్' ఆధ్వర్యంలో ఘన సత్కారం



నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీని సన్మానిస్తున్న "ఎక్సరే" సంస్థ ప్రతినిధులు

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** సమకాలీన సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజాన్ని జాగృత పరిచే సాహిత్యం రావాలని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె లక్ష్మయ్య ఆకాంక్షించారు. మాట్లాడుతూ నేటి తరానికి పఠనాశక్తి తగ్గి ఎలక్ట్రానిక్ పరికరాలపై ఆధార పడటం భాధాకరం అన్నారు. మంగళవారం సాయంత్రంఎక్స్ రే.. సాహిత్య సాంస్క ృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా కళారత్న, ఉగాది విశిష్ట పురస్కారాలు అందుకున్న పలువురు ప్రముఖులకు అభినందన సభ నిర్వహించారు. ఈ ససభలో ముఖ్యఅతిధిగా విచ్చేసిన కె లక్ష్మయ్య ప్రసంగం కొనసాగిస్తూ సమాజానికి ఉపయుక్తమైన సేవలు అందిస్తున్న కవులు, కళాకారులను గౌరవించడం మన విద్యుక్తధర్మం అన్నారు.. సంస్థ అధ్యక్షులు కొల్లూరి ప్రసంగిస్తూ ప్రతిభ కలవారిని ప్రోత్సహిస్తే వారు మరింత ఉన్నత ప్రమాణాలతో ముందడుగు వేస్తారు అన్నారు. అవార్డు గ్రహితలంతా తమ ఎక్స్ రే సభ్యులు కావడం సంతోషంగా ఉందన్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాహిత్యం, కళలకు మంచి ప్రొత్సాహాన్ని అందించడం అభినందనీయమని అన్నారు. వాకర్స్, లయన్స్ నాయకులు రావి కృష్ణారావు మాట్లాడుతూ కవులు మార్గనిర్దేశకులుగా ఉండాలి అన్నారు. సంస్థ కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన వీరు భవిష్యత్ లో మరెన్నో అవార్డు పొందుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. సభలో శ్రీ విశ్వావసు ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి కళారత్న పురస్కారం అందుకున్న అంతర్జాతీయ జానపద గాయకులు దామోదర గణపతి, ఉగాది విశిష్ట పురస్కారం అందుకున్న నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ(కలిమికొండ సాంబశివరావు) ,ప్రముఖ కవులు సరికొండ నరసింహా రాజు, బండ్ల మాధవరావు, చలపాక ప్రకాష్, సింహాద్రి వాణి., చిత్రకారులు అరసవల్లి గిరిధర్, శ్రీ దేవి దూపాటిలఅభినందనలను సభలో వక్తలు అభినందించారు. అనంతరం వారందరిని నిర్వాహకులుసత్కారించారు. సంస్థ. కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేసారు. సంస్థ ఉపాధ్యక్షులు కందికొండ రవి కిరణ్ పర్యవేక్షించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అందరికి ఘంటా ఇందిర స్మృత్యర్థం ప్రముఖ రచయిత విజయ కుమార్ చల్లటి మజ్జిగ అందించారు.

# రూ.కోటి విరాళమిస్తే.. దాతలకు ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ, విఐపి బ్రేక్ దర్శనాలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి కోటి రూపాయలు విరాళాలిచ్చే దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం పలు ప్రయోజనాలు చేకూరుస్తోంది. భారీ మొత్తంలో భూరీగా విరాళాలిచ్చిన దాతలకు జీవితకాలంలో దాతతోబాటు మరో నలుగురికి ప్రతి ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ దర్శనాలు, 3మూడురోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, నాలుగురోజులపాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా ఆ దేవదేవుని దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించారు. ఈ ప్రయోజనాలతో బాటు ఒకసారి 10 పెద్ద లడ్డూలు, 20 చిన్నలడ్డూలు, ఒక దుప్పట, రవికె, 10 మహాప్రసాదం ప్యాకెట్లు బహుకరిస్తారు. ఏడాదిలో ఒకసారి దాతలైన భక్తులకు వేద ఆశీర్వచనం వంటి సౌకర్యం పొందవచ్చు. తిరుమలలో 3వేల రూపాయలు అద్దెతో కూడిన వసతి గదుల సదుపాయం మూడురోజులు కల్పిస్తారు. జీవిత కాలంలో దాతకు ఒకసారి ఐదు గ్రాముల బంగారు డాలర్, 50గ్రాముల వెండిడాలర్‌ను తగిన ఆధారాల్నికార్యాలయంలో చూపి పొందవచ్చు. మదినిండా దేవదేవుని దర్శనం: ఒక్కసారి గోవింద..గోవిందా... నామంతో మనస్పూర్తిగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని మదిలో తలచుకుని మొక్కుకుంటే తమ కష్టాలు తీరిపోతాయని హిందూ భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆనందనిలయంలో కొలువైనా వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు దర్శనం చేసుకున్నా మళ్ళీ మళ్ళీ ఆ దివ్యమంగళరూపాన్ని చూడాలనే తాపత్రయం భక్తులకు కలుగుతుంది. సామాన్యభక్తులు ఆ దేవుని క్షణకాల దర్శనం కోసం పరితపిస్తుంటే ధనవంతులైన ,కోటీశ్వరులైన భక్తులకు, దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం బహుళప్రయోజనాలు చేకూరుస్తోంది. గతంలో కోటి రూపాయలు, 1.50కోట్ల రూపాయలు దాతలు విరాళమిస్తే వారికి ఏడాదిలో ఆరుమందికి ఉదయాస్తమాన సేవదర్శనం టిక్కెట్ (తెల్లవారూజామున సుప్రభాతం నుండి సాయం త్రం సహస్రదీపాలంకారసేవ వరకు) ఆలయం లోపల కులశేఖరపడివద్ద నుండి వేంకటేశ్వరస్వామి కొలువైన ముందుకు వెళ్ళి తనివితీరా దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించింది. అంతేగాక ఆ భక్తులకు సుప్రబాతం, తోమాల, అర్చన సేవలు కొందరు గృహస్థభక్తులు, విఐపి బ్రేక్‌కు మరికొందరు గృహస్థభక్తులను దాత తీసుకెళ్ళే ప్రయోజనం ఉండేది. ఆ విరాళాల్లో కొంత మార్పుచేసి కోటి రూపాయలు విరాళమిస్తే ఆ దాతలకు ఏడాదిలో మరిన్ని ప్రయోజనాలు, దేవుని దర్శనం, వసతి, ప్రసాదాలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించి అమలుచేస్తారు. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కోటి విరాళమిచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే వెసలు బాటు కల్పించారు. -రూ.కోటి విరాళా లివ్వాల్సిన పథకాలు: దాతలు కోటిరూపాయలు విరాళాలివ్వాల్సిన టిటిడి ట్రస్టులలో కాటేజీ డొనేషన్ స్కీం, ఎస్వీప్రాణదానట్రస్ట్, ఎస్వీ విద్యాదనట్రస్ట్, బర్డ్ ట్రస్ట్, ఎస్వీ అన్నదానట్రస్ట్, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్, ఎస్వీ సర్వశ్రేయాస్‌ట్రస్ట్, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, ఎస్వీబిసిట్రస్ట్, బాలాజీఆరోగ్యవరప్రసాదిని స్కీమ్‌లకుదాతలు విరాళాలు చెల్లించి సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్‌సైట్"డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి,ఇన్"లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దాతలు విరాళాలను ఇఒ టిటిడి పేరున డిడి,చెక్‌లను తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్‌సెల్)అంద జేయవచ్చు.

# జమ్ముకశ్మీర్‌లో ఉగ్రమూకల దుశ్చర్య అమానవీయం: మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** .ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంపై సాంస్క ృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనను తీవ్రంగా ఖండించారుకాశ్మీరులో ఉగ్రదాడిలో మరణించిన చంద్రమోళి, మధుసూదన్‌ల చిత్రపటాలకు మంత్రి దుర్గేష్‌నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి మంత్రి తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని రాష్ట్ర పర్యాటక, .ఉగ్రమూకలు విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విశాఖకు చెందిన జె.ఎస్. చంద్రమోళి, కావలికి చెందిన మధుసూదన్ కుటుంబాలకు మంత్రి దుర్గేష్ ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేసారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇది హృదయ విదారకమైన, హేయమైన, అమానుషమైన చర్యగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

# విఆర్‌ఓల సమస్యలు పరిష్కరిస్తాం: గ్రామవార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్

**విజయవాడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** విఆర్‌ఓల సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తామని రాష్ట్ర గ్రామవార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ హామీ ఇచ్చారు. ఆయనకు విజయవాడలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు నేతృత్వంలో సంఘ నేతలంతా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భూపతిరాజు మాట్లాడుతూ క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు ఒక విఆర్‌ఓ వుంటే ఇబ్బంది అవుతుందని, సచివాలయ రేషనైలేజేషన్ విషయంలో విఆర్‌ఓలను డిస్టర్బ్ చేయొద్దని, లైన్ డిపార్ట్‌మెంట్ రెవెన్యూలోనే గ్రేడ్1, 2, విఆర్‌ఓలకు డిడివోలుగా తహసీల్దార్లు వుండేలా నిర్ణయం తీసకోవాలని చేసిన వినతికి శివప్రసాద్ స్పందిస్తూ వారి సమ్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.పి. సిసోడియా

**విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్.పి. సిసోడియా రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ (పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాల దృష్టి, పరిపూర్ణ పరిపాలనా అనుభవంతో సిసోడియా నేతృత్వంలో శాఖ అభివృద్ధి దిశగా నడిచే అవకాశం ఉందని నేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు చేపట్టే ముందు సిసోడియా ఛాంబర్ లో సంప్రదాయ పూజాదికాలు నిర్వహించారు ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి శాఖకు సంబంధించిన ప్రాధాన్య విషయాలు, అమలులో ఉన్న పథకాలు, భవిష్యత్తు కార్యాచరణల పై సిసోడియాకు సమగ్ర వివరాలు అందించారు. చర్చల సందర్భంగా చేతివృత్తుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, జాతీయఅంతర్జాతీయ విపణుల్లో చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం కల్పించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సీఈఓ వీఆర్ విజయరాఘవ నాయక్, చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్లు మురళీకృష్ణ, శ్రీకాంత్ ప్రభాకర్, సంయుక్త డైరెక్టర్లు కన్న బాబు, రాజారావు, ఆప్కో జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పార్వతి పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా నేతృత్వంలో చేనేత జౌళి శాఖ మరింత చురుకుగా ప్రభుత్వ లక్ష్యాలసాధనకు సన్నద్ధమైంది.

# యుపిఎస్సీ విజేతలకు పవన్‌కళ్యాణ్ అభినందనలు

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** యూపీఎస్‌సీ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పలువురు విజేతలుగా నిలవడం సంతోషదాయకమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. 11వ ర్యాంకుతో ఇ.సాయిశివాని, 15వ ర్యాంకుతో బి.వెంకటేశ్ తొలి 20 మందిలో నిలవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్ 94వ ర్యాంకు సాధించడం ముదావహమన్నారు. విజేతలందరికీ ఒక ప్రకటనలో ఆయన అభినందనలు తెలిపారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ప్రజలే దేవుళ్లు అనే సూత్రాన్ని పాటించాలన్న ప్రధాని మోడీ మాటలను గుర్తుంచుకోవాలని విజేతలకు పవన్‌కళ్యాణ్ సూచించారు.

# మద్యం అమ్మకాలకు వ్యక్తిగత గరిష్ట పరిధి ఉండేలా చేయాలంటూ హైకోర్టులో పిల్

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం అమ్మకాలకు వ్యక్తిగత గరిష్ట పరిధి ఉండేలా చేయాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఒక నెలలో గరిష్టంగా విక్రయించే మద్యం బాటిళ్ల అమ్మకాలకు పరిమితిని విధించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, మద్యం విక్రయాలన్నింటినీ ఆధార్‌తో అనుసంధానం చేసేలా ఉత్తర్వులివ్వాలని పిల్‌లో కోరారు. ఈ మేరకు విశాఖపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ షిరిన్ రహ్మాన్ పిల్ వేశారు. మద్యాన్ని 21 ఏళ్ల లోపు వారు కొనుగోలు చేయకుండా నియంత్రించాలన్నారు. సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ మార్గదర్శకాల మేర జిల్లా, రాష్ట్ర స్థాయి నషా ముక్తి కమిటీలను ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందులో ఎక్సైజ్‌శాఖ కార్యదర్శి, కమిషన్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేశారు. రిటైర్డు అటవీశాఖ అధికారి మూర్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు హైకోర్టు ఆదేశం సీనియర్ ఐఎఎస్ ఆర్‌పి సిసోడియా ఓఎస్‌ఓగా పనిచేసిన రిటైర్డు అటవీశాఖ అధికారి ఎంవివిఎస్ఎన్ మూర్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించరాదని, ఈ విషయంలో జోక్యం చేసుకోరాదని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇంటెలిజెన్స్ అధికారులకిచ్చిన వాంగ్మూలాన్ని ఉపసంహరించు కోవాలని మూర్తిని ఒత్తిడి చేయొద్దని చెప్పింది. ఈ మేరకు విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్, మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలను ఆదేశిస్తూ జస్టిస్ హరినాథ్ ఆదేశాలిచ్చారు. సిసోడియా సూచనల మేరకు ఆయన మనుషులు తనను కిడ్నాప్ చేశారని, దీనిపై విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్, మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలకు తానిచ్చిన వాంగ్మూలాన్ని వాపస్ తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారంటూ మూర్తి పిటిషన్ వేశారు. గత ఫిబ్రవరి 27న సిసోడియా మనుషులు తనను కిడ్నాప్ చేశారన్నారు. దీనిపై హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

# అమరావతిలో హరిత ప్రాజెక్టుల అభివృద్ధికి ఆరావళి బయోడైవర్సిటీ సహకారం

**విజయవాడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాజధానిలో హరిత ప్రాజెక్టుల అభివృద్ధికి ఆరావళి బయో డైవర్శిటీ ఆమోదం తెలిపింది. బుధవారం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడిసి) సిఎండి డి లక్ష్మి పార్థసారధి ఢిల్లీలోని యమునా బయో డైవర్శిటీ పార్కు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరావళి బయో డైవర్శిటీ పార్కులను స్థాపించిన ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ సిఆర్ బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు అభివృద్ధి చేసిన ఉద్యానవనాలను పరిశీలించారు.

బయోడైవర్శిటీ పార్కుల అభివృద్దిలో బాబు వారి బృందం చేపట్టిన విధానాలను ఏడిసి ప్రతినిధులకు వివరించారు.

ఈ సందర్భంగా సిఎండి లక్ష్మి పార్థసారధి తీపి నారింజ మొక్కను నాటారు. ఈ పర్యటనలో ఏడిపి హార్టికల్చర్ విభాగాధిపతి విఎస్ ధర్మజ వున్నారు.

# మే 6న గంగమ్మజాతరకు చాటింపు

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతి గ్రామదేవతగా కొలువై పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ జాతర వారంరోజులుపాటు జరుగుతుంది. రాయలసీమజిల్లాల్లోనేగాక తెలుగురాష్ట్రాల్లో ఎక్కడా అమ్మవారి జాతరలు వారం రోజులు నిర్వహించరు. తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతర వేడుకలు వారంరోజులు పాటు భక్తితో అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీ. రానున్న మేనెలలో 6వతేదీ మంగళవారం రాత్రి తిరుపతి రూరల్ అవిలాల నుండి సారెతో ఆలయ పూజారులు వచ్చి నగరంలో చాటింపు వేస్తారు. ఇక మరుసటిరోజు మేనెల 7వతేదీ బుధవారం నుండి 13వతేదీ మంగళవారం వరకు వివిధ రకాల అలంకరణల్లో గంగమ్మ దర్శనమిస్తుంది. తిరుపతి తిరుమల పరిసరాల్లోనే భక్తులేగాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి భక్తులు భారీగా వస్తారు. ఒక్కోరోజు ఒక్కోరక వేషధారణలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. మేనెల 7వతేదీ తొలివేషంగా బైరాగివేషం, 8వతేదీ బండవేషం, 9న తోటివేషం, 10న దొరవేషం, 11న మాతంగివేషం, 12న సున్నపుకుండలు 13వతేదీ మంగళవారం అమ్మవారి జాతర, అర్ధరాత్రి అమ్మవారి విశ్వరూపం చెంపనరకడంతో జాతర పరిసమాప్తమవుతుంది. ఈ జాతర వేడుకలకు టిటిడి, తుడ, నగరపాలకసంస్థ సహకారం అందిస్తారు.

# ఎపి పదోతరగతి పరీక్షా ఫలితాల్లో నారాయణ చారిత్రాత్మక విజయం

## 599/8000వంటి రికార్డ్ స్థాయి మార్కులతో నారాయణ సెన్సేషనల్ విక్టరీ

**హైదరాబాద్, ఏప్రిల్ 23 ,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ పదోతరగతి పరీక్షా ఫలి తాలు(2025) నారాయణ జైత్రయాత్ర కొనసాగింది. ఎప్పటిలాగే నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో మెప్పించారు. ఎస్.ఎస్.సి. చరిత్రలోనే అత్యధిక మార్కులతో నారాయణ విద్యార్థిని నారాయణశెట్టి సాయితన్వి (హెచ్.టి.నెం: 250411552) 500 మార్కులతో అల్ టైమ్ రికార్డు నెలకొల్పొంది. అదేవిధంగా 598, 508, 508, 507 ఆపైన మార్పులు 15 మంది 500 ఆపైన మార్కులు 33 మంది, 595 ఆపైన మార్కులు 85 మంది, 500 ఆపైన మార్పులు 552 మంది విద్యార్థులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ రాజపి. సింధూర నారాయణ, పి. శరణి నారాయణ, రమా నారాయణ తెలిపారు. మ్యాథ్స్ సబ్జెక్టులో 100కి 100 మార్పులు సాధించిన విద్యార్థులు 1403, సైన్స్ సబ్జెక్టులో 100 కి 100 మార్యులు సాధించిన విద్యార్థులు 1136, సోషల్ సబ్జెక్టులో 100కి 100 మార్కులు సాధించిన విద్యార్థులు 1088, తెలుగు సబ్జెక్టులో 100 కి 100 మార్కులు సాధించిన విద్యార్థులు 1149 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. నారాయణ మొత్తం విద్యార్థుల సగటు మార్కు 511గా ఉందన్నారు. ఏపీలో 511 సగటు మార్కు సాధించిన ఏకైక విద్యాసంస్థ నారాయణ మాత్రమే అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ 13096 మంది విద్యార్థులలో 98 ఉత్తీర్ణతా శాతం సాధించిన ఘనత ఒక్క నారాయణకే దక్కించుకుందన్నారు. 88 బ్రాంచీలలో 100 పాస్ పర్సంటేజ్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమా నారాయణ మాట్లాడుతూ రికార్డ్ స్థాయి మార్యులను సాధించటం, ఏటేటా నారాయణ తన ఫలితాలను తానే అధిగమించటం ఓ అనవాయితీగా మారిందన్నారు. నారాయణ పటిష్ట ప్రణా ళికకు, ఉపాధ్యాయుల అకుంఠిత దీక్షకు ఈ ఫలితాలు నిదర్శనంగా నిలుస్తున్నాయని, అదే సమయంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీపరీక్షలకు సంబంధించిన సిలబస్ ను తమ రోజు వారి సిలబస్ లో భాగంగా బోధించటం ద్వారా నారాయణ విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. నారాయణ సిఓ స్పార్క్, ఒలింపియార్, మెడిస్పార్క్ ప్రోగ్రామ్‌తో బోధన చేయటంతో ఘనవిజయాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్స్ ద్వారా విద్యాబోధన, విశిష్టమైన ప్రోగ్రామ్ మైక్రోషెడ్యూల్, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు కారణంగానే నారాయణ నిరంతరాయంగా విజయాలు కొనసాగిస్తోందన్నారు. డైరెక్టర్ శరణి నారాయణ మాట్లాడుతూ నేటి పోటీప్రపంచంలో ఎగ్జామ్స్ అన్ని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండటంతో నారాయణ సంస్థ కూడా తన విద్యార్థుల కోసం స్కూల్ స్థాయి నుంచే ఆన్‌లైన్ ఎగ్జామ్స్‌పై శిక్షణ అందించేందుకు ఎస్ బెర్న్ ప్లాట్‌ఫామ్ ప్రవేశపెట్టామన్నారు. ఈ ప్లాట్ ఫామ్‌లో ముఖ్యంగా అంశాల వారీగా అధ్యాయాల వారీగా పాఠ్యాంశాలపై పట్టు కోసం పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి అంశంపై అవగాహన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యానిమేటెడ్ వీడియో మాడ్యూల్స్ ఉంటాయని, సంక్లిష్టమైన అధ్యాయాల్లో అవగాహన కోసం లోతైన విశ్లేషణతో కూడిన మాడ్యూలు అందించనున్నట్లు వివరించారు. డా.పి సింధూర నారాయణ మాట్లాడుతూ స్కూల్ స్థాయిలోనే విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు ఇంటిగ్రేటెడ్ సిలబస్ తో అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో అవగాహన స్థాయిని పెంపొందించేందుకు వివిధ ప్రోగ్రామ్లను అందిస్తున్నామన్నారు. పోటీపరీక్షల శిక్షణ కోసం ఓ స్పార్క్, ఒలింపియాన్, ఈటెక్నో, మెడిస్పార్క్ వంటి ప్రోగ్రామ్‌తో శిక్షణ అందిస్తున్నానున్నారు. ఈ ప్రోగ్రామ్స్ ద్వారానే వేసే పునాది కారణంగానే జాతీయస్థాయి కడఈ మెయిన్స్/ నీటి వంటి పోటీపరీక్షల్లో అలండియా టాప్ ర్యాంకులు సాధిస్తున్నామన్నారు. ఇంతటి అద్భుత విజయాలకు కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యా యులకు నారాయణ డైరెక్టర్స్ అభినందనలు తెలిపారు.



బుధవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న జి.కిషన్‌రెడ్డి, డా.కె.లక్ష్మణ్, విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ తదితరులు

## ఉగ్రదాడికి వ్యతిరేకంగా బిజెపి నిరసన

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ ఆనేక మంది బిజెపి నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేబూని ట్యాంక్ బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితోపాటు ఆనేక మంది కార్యకర్తలు నల్లటి వస్త్రాలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో ఎంపిలు డా.కె.లక్ష్మణ్,కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు పాకిస్తాన్ డౌన్, డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఉన్న కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవా దులు పర్యాట కలపై దాడి చేసి కాల్చి చంపాడాన్ని తీవ్రంగా ఖండించారు.

## ఎసిబి వలలో విద్యుత్ ఎఇ

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం ఎలక్ట్రికల్ ఏఈ కొండన్న రూ.10,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు. వనపర్తి జిల్లా ఘనపూర్ మండలం మల్కాపూర్ గ్రామం ఆగ్రో ఇండస్ట్రియల్ 160కెవి పనులను పూర్తి చేయడంతో వీటికి సంబంధించిన బిల్లును అప్రూవల్ చేయాలని కాంట్రాక్టర్ సలీం అడగడంతో లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఆరు నెలల క్రితం రూ.30 వేలు ఇవ్వడం జరిగిందని మిగిలిన పని పూర్తి చేయాలంటే ఇంకా రూ. 20 వేలు కావాలని డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ సలీం ఏసీబీ అధికారులను సంప్రదించడంతో పదివేల రూపాయలకు ఇస్తానని బాధితుడు ఒప్పుకున్నాడు.



ఒప్పందం ప్రకారం బుధవారం ఏఈకి డబ్బులు ఇస్తుండగా వెంటనే ఏసీబీ అధికారులు ఏఈ కొండయ్యను డి ఈ కార్యాల యంలో రెడ్ హ్యాండ్ గా పట్టుకొని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నామని మహబూబ్‌నగర్ ఏసిబి డిఎస్పి సిహెచ్ బాలకృష్ణ తెలిపారు.

## 60 రోజులుగా అన్వేషణ.. ఇంకా జాడ తెలియని ఆరుగురి మృతదేహాలు



**నాగర్ కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** నాగర్ కర్నూలు జిల్లా దోమల పెంట వద్ద ఎస్ఎల్‌బిసీ తన్నెల్ ప్రమాదం జరిగి రెండు నెలలు పూర్తవుతున్న ఇంకా ఆరుగురి మృతదేహాలకు సంబంధించి ఎలాంటి ఆచూకీ లభించలేదు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పరిధి ఎస్ఎల్‌బిఇ సొరంగంలో ప్రమాద ఘటనకు 60 రోజులుపూర్తయ్యాయి. ఇప్పటివరకు ఇద్దరి మృతదే హాలు లభించాయి. మిగతా ఆరుగురి కోసం అన్వేషణ కొనసాగుతోంది. డీ1నుంచి డీ2 ప్రదేశంవరకు దాదాపు శిథిలాలు తొలగించారు. డేంజర్ జోన్ అయిన మిగిలిన 43 మీటర్ల పరిధిలో ఆ ఆరుగురి మృతదేహాలు ఉండొచ్చని సిబ్బంది అభిప్రాయానికి వచ్చారు. 12 రకాల విభాగాల అధికారులు నిత్యం రెస్క్యూ చేస్తున్నారు.

## కేసు కొట్టేయాలని హైకోర్టులో సిఎం రేవంత్‌రెడ్డి పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్23:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. గత సంవత్సరం ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు.

బీజేపీకి పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల టైంలో చెప్పారని కాసం కాసం వెంకటేశ్వర్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం వీడియో , ఆడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పిం చారు.

దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని సీఎం హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

# రాష్ట్రంలో పంటల బీమాకు కసరత్తు

## రైతులందరికీ ప్రయోజనం చేకూరేలా చర్యలు: మంత్రి నాగేశ్వరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. తద్వారా రైతులందరికీ ప్రయోజనం చేకూరే విధంగా చేస్తామని చెప్పారు. హైదరాబాద్ సచివాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అకాల, అధిక వర్షాలు, వడగండ్ల వానలు, వర్షాభావ పరిస్థితులతో పాటు, వాతావారణ మార్పుల వలన కలిగే పంట నష్టానికి భీమా వల్ల రైతులకు కలిగే నష్టాన్ని కొంతవరకు భర్తీచేసే అవకాశం ఉంటుందన్నారు. దిగుబడి ఆధారిత భీమా పథకం కింద వరి, మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, శనగ, నువ్వులు, మొదలైన పంటలు మరియు వాతావరణ ఆధారిత భీమా పథకం కింద పత్తి, మిరప, మామిడి, ఆయిల్ పామ్, టమాట, బత్తాయి మరియు మొదలైన పంటలకు భీమా వర్తింపచేసే విషయంలో పూర్తిస్థాయిలో రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోని



పథకాన్ని రూపకల్పన చేయాలని సూచించారు. ఎండాకాలంలో వడగళ్ల వర్షం వలన నష్టపోయే వరి మరియు మామిడి వంటి ప్రధాన పంటలకు పూర్తి స్థాయి నష్ట పరిహారాన్ని రైతులకు అందించే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని ఇతర రాష్ట్రాలు ఏ విధంగా అమలు చేస్తున్నాయో అధ్యయనం చేసి, రైతులందరికి ప్రయోజనం చేకూరే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అదేవిధంగా టెక్నాలజీ ఆధారంగా పంటల దిగుబడి అంచనాలను రూపొందించడం మరియు నష్టపోయిన పంటల విషయంలో భీమా కంపెనీలు సత్వరమే భీమా క్లెయిమ్ అందించుటకు గల విధివిధానాలను రూపొందించాలని పేర్కొన్నారు. వానాకాలం, యాసంగిలో అన్ని రకాల ప్రధాన పంటలకు భీమా ప్రీమియం అంచనా వేయుటకు వెంటనే తగిన ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికా రులను ఆదేశించడంజరిగింది. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం మార్గదర్శకాల ప్రకారంగా వానాకాలంలో మొత్తం ప్రీమియంలో రైతు వాటా 2శాతం, యాసంగిలో 1.5 శాతం, వాణిజ్య, ఉద్యానపంటలకు 5శాతం ప్రీమియం ఉంటుందని వివరించారు. మిగిలిన ప్రీమియంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 50:50 భరించడం జరుగుతుందని తెలిపారు. స్థూల పంట విస్తీ ర్ణంలోని 98 శాతం విస్తీర్ణానికి భీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయశాఖలో అసిస్టెంట్, డిప్యూటీ డైరక్టర్లకు పదోన్నతులు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** వ్యవసా య శాఖలో పదోన్నతుల పండగ హడావిడీ నెలకొంది. ప్రధానంగా అసిస్టెంట్ డైరక్టర్లు (ఏడి), డిప్యూటీ డైరక్టర్లకు (డీడీ) పదోన్నతులు కల్పించేందుకు జాబితాలు చకచకా సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే 18మంది డీడీలకు జేడీలుగా పదోన్నతి కల్పిస్తూ తొలి జాబితా సిద్ధం చేసినట్టు సమాచారం. వీటిలో తొమ్మిది జేడీ పోస్టులు రెగ్యులర్ ఉండగా, మరో తొమ్మిది ఆత్మ పీడీ పోస్టులను క్రియేట్ చేసినట్టుగా వెల్లడవుతోంది. అయితే అసిస్టెంట్ డైరక్టర్ల స్థాయి నుంచి డిప్యూటీ డైరక్టర్లుగా పదోన్నతులు కల్పించే విషయంలో ఒకింత గందరగోళం నెలకొన్నట్టుగా వెల్లడవుతోంది. ప్రధానంగా పదోన్నతులకు అర్హత కలిగిన రాష్ట్రంలో డిప్యూటీ డైరక్టర్లు అధికంగా ఉండడంతో పాటు, అందుకు తగినట్లుగా డిప్యూటీ డైరక్టర్ల పోస్టులు లేకపోవడంతో ఏం చేయాలనేదానిపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు. మరోపక్క అర్హులైన అసిస్టెంట్ డైరక్టర్లలో పలువురు పైరవీలు, రికమెండేషన్లతో వత్తిళ్లు తీసుకురావడంతో పదోన్నతుల వ్యవహారం ఒక ప్రహసనంగా తయారయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 21 డిప్యూటీ డైరక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండగా, ఆత్మలో మరో 20 డీపీడీ పోస్టులు క్రియేట్ చేసి పదోన్నతులు కల్పించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలియవచ్చింది.

## ఆంధ్రప్రదేశ్ పదవ తరగతి ఫలితాలలో శ్రీచైతన్య విజయభేరి

**హైదరాబాద్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు 599 సాధించి విజయకేతనం ఎగురవేశామని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదేవిధంగా598 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4గురు,597 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 28 మంది,596 ఆ పైన మార్కులు మార్కులు సాధించిన విద్యార్థులు 81 మంది.595 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 156 మంది,590 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 1091 మంది, 580 ఆ పైన మార్కులు 3836 మంది విద్యార్థులు సాధించారన్నారు. అదేవిధంగా శ్రీ చైతన్య స్కూల్ సగటు మార్కు 600కు గాను సుమారు 513, ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99 మరియు అత్యధిక బ్రాంచ్‌లునూటికి నూరుశాతం ఫలితాలు సాధించాయి అని ఆమె తెలిపారు. అంతే కాకుండా ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 1వ ర్యాంకు మరియు 100 లోపు ర్యాంకులు 19 మంది శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు సాధించారన్నారని ఆమె తెలిపారు.

అదే విధంగా శ్రీ చైతన్య స్కూల్ సగటు మార్కులు 600కు గాను 513, ఓవరాల్ పర్సంటేజ్ 99 శాతం కాగా అత్యధిక బ్రాంచ్‌లు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. శ్రీ చైతన్య సాధించిన ఇంతటి ఘనవిజయాలకు దరిదాపుల్లో దేశంలో గాని, రాష్ట్రంలో గాని మరే ఇతర విద్యాసంస్థ లేదు అని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సిఓఐపియల్, సిఐపియల్, యమ్. పి.యల్., ఐకాన్, సిబ్యాచ్, యస్బ్యాచ్ మరియు టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్, అంకిత భావంతో పనిచేసే అధ్యాపకులు వల్ల మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నా యని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు.

ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు మరియు అధ్యాపక బృందానికి శ్రీ చైతన్య విద్యా సంస్థల మరో డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

## రాజకీయనాయకుల క్రాస్ ఎగ్జామినేషన్ ఈ దఫా ఉండకపోవచ్చు?

బుధవారం హైదరాబాద్ చేరుకున్న జస్టిస్ పిసిఘోష్

ఎన్‌డిఎస్ఎ, విజిలెన్స్ నివేదికలపై దృష్టి సారించనున్న జస్టిస్?

**హైదరాబాద్,ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** మేడిగడ్డ కుంగుబాటు, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగిగేషన్ వైఫల్యంపై విచారణ చేపడుతున్న జస్టిస్ పినాకిని చంద్రఘోష్ బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇంజనీర్ అధికారులను, ఐఎఎస్ అధికారులను, అదే విధంగా కాంట్రాక్టు ఏజన్సీలు, పౌరసమాజం నుంచి వచ్చిన వ్యక్తుల నుంచి అఫిడవిట్‌లు తీసుకొని వారిని క్రాస్ ఎగ్జామినేషన్ అనేక దఫాలుగా జరిపారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీష్‌రావు, మాజీ మంత్రి ప్రశాంతరెడ్డిని కూడా విచారిస్తారని ఆయన వచ్చిన ప్రతిసారి ఊహాగానాలు వెలువడేవి. అయితే ఈ సారి మాత్రం అలాంటి సంకేతాలు ఏవీ కూడా విచారణ సంఘం నుంచి లేకపోవడంతో ఈ సారి కూడా రాజకీయనాయ కులను క్రాస్ ఎగ్జామినేషన్ ఉండదని భావిస్తున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక అదే విధంగా ఎన్‌డిఎస్‌ఏ నివేదికలను అధ్యయనం చేయడంతోపాటు వాటి ఆధారంగా తుది నివేదిక అందించే అవకాశం ఉంటుదని ఇంజనీర్‌వర్గాలు అభిప్రాయపడుతున్నారు.

కెసిఆర్, హరీష్‌రావు, ప్రశాంతరెడ్డి వంటి రాజకీయ నాయ కులను విచారణకు పిలిచి క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలను కుంటే కనీసం 15రోజుల ముందైనా వారికి నోటీసులు అందించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు అలాంటివి ఏదీ విచారణ కమిటి నుంచి వెళ్ళకపోవడంతో ఈ దఫా కూడా రాజకీయ నాయకుల విచారణ ఉండకపోవచ్చని అంతా భావిస్తున్నారు. బుధవారం సాయంత్రం నీటిపా రుదలశాఖ అధికారులు జస్టిస్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకొన్నారు.

## భూధార్ కార్డుతో భూ సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి పొంగులేటి

**నూతనకల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** ప్రతి రైతుకు తనకున్న భూమి వివరాలతో పాటు సరిహద్దులు సర్వే హద్దులను ఏర్పాటు చేసి ప్రతి రైతుకు భూదార్ కార్డును ఏర్పాటు చేయడమే భూభారతి చట్టం ప్రత్యేక లక్షణం అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన, ప్రగతి బాట, భూభారతి చట్టం రైతుల చుట్టం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అధ్యక్షతన భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సు లో పాల్గొని మాట్లాడారు. ధరణి పేరుతో భూదందాలకు, భూ అక్రమాలకు పాల్పడిన బారాస ప్రభుత్వ అవినీతిని అరికట్టేందుకు రైతుల ఆపదలను కాపాడటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు శ్రేయస్సు కోసం ఏర్పాటుచేసిన భూభారతి చట్టం ద్వారా అన్ని రకాల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. కొనుగోలు, దానం, తనక, బదిలీ బాగాల పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములతో పాటు సాదా బైనామాల క్రమబద్ధీకరణ, రిజిస్ట్రేషన్ నూటివేషన్లలో, రికార్డులలో తప్పుల సవరణ భూభారతి ద్వారా సరిచేయబడతాయని పేర్కొన్నారు. మండలం లోని జెన్నా



బుధవారం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఒడ్డి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్న సుమారు 1600 ఎకరాల సీలింగ్ భూములను సాగు చేస్తున్న రైతుల పేరు మీద పట్టాలందేలా ముఖ్యమంత్రితో సవరణ చట్టం చేసి పాసుపుస్తకాల అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో జూన్ 2 నుండి ఎమ్మా ర్వో స్థాయి అధికారుల అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి ఆ గ్రామానికి సంబంధించిన అన్ని భూ సమస్యలను అక్కడే పరిష్కరిస్తామని దరఖాస్తు పత్రాలు సైతం ప్రభుత్వ అధికారులే అందజేస్తారని పైసా ఖర్చు లేకుండా రైతులు తమ భూమిని పట్టా చేసుకొని ఎన్నో తరాలుగా ఉన్న సమస్యలను పరిష్క రించుకోవచ్చు అని తెలిపారు. రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వంపై భరాసా నాయకులు చేస్తున్న కుట్రలను రైతులు తిప్పి కొట్టాలని సూచించారు. ఎమ్మెల్యే మందుల సామేల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్ర మంలో భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా ఎస్పీ నరసింహ, తుంగతుర్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఎసిఎస్ ఛైర్ పర్సన్ నాగం జయసుధ, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సిహెచ్ వెంకన్న, తుంగతుర్తి టి ఎస్ సి ఎస్ ఛైర్మన్ గుడిపాటి సైదులు, మండల పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి, ఆర్డిఓ వేణుగోపాలరావు, డి.ఎస్.పి పార్థసారథి, తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మహిళా కళాశాల స్వర్ణోత్సవాలు

## లోగోను ఆవిష్కరించిన సిఎండి బలరామ్

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** సింగరేణికి సంబంధించిన మహిళా కళాశాల స్వర్ణోత్స వాలను ఘనంగా నిర్వహించాలని ఆ సంస్థ నిర్ణయించింది. కొత్తగూడెంలో తొలి మహిళా కళాశాలను ప్రారంభించి 50ఏళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ రూపొందించిన గోల్డెన్ జూబ్లీ లోగోను ఆ సంస్థ సిఎండి ఎన్. బలరామ్ బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా విద్యకు అంకితమై ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఈ కళాశాల మరింతగా వృద్ధి చెందాలన్నారు. అంతేకాకుండా రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ కళాశాలగా ఎదిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



1975లో సింగరేణి సంస్థ మహిళా విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ మారుమూల, గిరిజన ప్రాంతమైన కొత్తగూడెంలో సింగరేణి మహిళా కళాశాలను ప్రారంభించడం జరిగిందన్నారు. సింగరేణి కార్మికుల అధికారుల పిల్లలే కాకుండా, సమీప పట్టణాల గ్రామాలకు చెందిన వారు కూడా ఈ కళాశాలలో చదివి, అనేకమంది డాక్టర్లుగా, ప్రొఫెసర్లుగా, ఉద్యోగులుగా స్థిరపడ్డారని వెల్లడించారు. నాటినుండి ఈ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ డిగ్రీ కళాశాలగా, పీజీ కళాశాలగా కూడా ఎదిగిందని పేర్కొన్నారు. సుమారు 2000 మంది ఈ కళాశాలలో చదువుతున్నారని, హాస్టల్ వసతి, క్రీడా మైదానాలు, మంచి ప్రయోగశాలలు, ఆడిటోరియం వంటి అత్యుత్తమ సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయని వివరించారు. ఈ కళాశాల కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో చదువులోనూ, క్రీడల్లోనూ అగ్రస్థానంలో నిలుస్తూ వస్తోందని చెప్పారు. గోల్డెన్ జూబ్లీ సంవత్సరం సందర్భంగా ఏడాది పొడుగునా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 10 వ తరగతి ఫలితాల్లో డా కె.కె.ఆర్ గౌతమ్ విద్యాసంస్థ విద్యార్థుల హవా

**హైదరాబాద్, ఏప్రిల్ 23 ,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో డా కె. కె.ఆర్ గౌతమ్ విద్యాసంస్థల విద్యా ర్థులు అద్భుత ఫలితాలు సాధించారు. 600 మార్కులకు గాను ఎం.దీపేష్ రెడ్డి 596 మార్కులు, ఎస్.జోయల్ త్యాగి, కె.లాస్య నాగశ్రీ, బి. కార్తిక్ గణేష్ రెడ్డి, ఆర్. రుక్కర్యులు 595 మార్కులు, గీతాశ్రీవత్సవ్, ఎం.ప్రణీత్ సాయి విష్ణు, ఎం.వి.శ్రీసాయి దాక్షాయణి, బి.సాయి హస్నితలు 594 మార్కులు సాధించి డా.కె. కె.ఆర్ గౌతమ్ స్కూల్స్ విద్యార్థులు విజయబావుట ఎగురవేశారు. ఇంతేగాక తమ సంస్థకు సంబంధించిన వివిధ బ్రాంచీలలో 590 మార్కులు పైన సాధించిన వారు 46 మంది కాగా 580 మార్కులు పైన సాధించిన 208 మంది, 500 మార్కులు పైన సాధించినవారు 1398 మంది కావటం విశేషం. స్కూల్స్ సగటు మార్కుల శాతం 86.28గా నమోదు కావడం విశేషం. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపారు.

## ఎసిబి వలలో ఇద్దరు ఇరిగేషన్ అవినీతి తిమింగలాలు

20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న డిఎస్పీ

లీవ్ సాంక్షన్ చేసి జీతం కొరకు లంచం డిమాండ్

ఎసిబిని ఆశ్రయించిన బాధితుడు యజాజ్



**నుల్తానాబాద్, ప్రభాతవార్త :** ఇద్దరు ఎస్సారెస్పీ అధి కారులు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డిఎస్పి రమణమూర్తి, బృందం ఇద్దరు అధికా రులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే బాధితుని కథనం మేరకు ఎస్సారెస్పీ క్యాంపు కార్యాలయము, ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్ 6 కార్యాల యంలో జూనియర్ రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న యాజాజ్ ఉల్లా ఖాన్ 5 ఆగస్టు 2024 నుండి



31 అక్టోబర్ 2024 వరకు 88 రోజుల హెచ్ పి ఎల్ సెలవులు పెట్టాడు. అప్పటినుండి నేటి వరకు మెడికల్ రియంబర్స్మెంట్ ఇవ్వ కుండా ఇబ్బందులకు గురిచేస్తూ 20 వేలు ఇస్తేనే లీవ్ సాంక్షన్ చేసి జీతం చేస్తానని సీనియర్ అసిస్టెంట్ సురేష్ సూపరిండెంట్ శ్రీధర్ బాబు పెండింగ్ లోనే ఉంచారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత బ్రతిమిలాడిన చేయక పోవడంతో అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించానని బాధితుడు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బాధితుడు యాజాజ్ లంచం ఇస్తుండగా ఇద్దరు ఇరిగేషన్ అవినీతి అధికారులను డిఎస్పి వి.వి రమణమూర్తి , అధికారుల టీం 20 వేలు లంచం ఇస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలో పంచనామ నిర్వహించి పట్టుబడినాధునిక అధికారులను ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు డి.ఎస్.పి రమణమూర్తి పేర్కొన్నారు.

## వచ్చే నెల 22 నుంచి 29వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. ఏప్రిల్23:** మంగళవారం ఇంటర్మీడియట్ ఫలితాలు ప్రకటించిన తెలంగాణ ఇంటర్ బోర్డు బుధవారం ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే నెల 22నుంచి 29వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో ఈ పరీక్షలు నిర్వహిం చనున్నట్లు వెల్లడించింది. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00గంటల వరకు ప్రథమ ఇంటర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ద్వితీయ ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు సైతం ఇదే టైం టేబుల్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. అలాగే, జూన్ 3 నుంచి 6వ తేదీ వరకు రెండు సెషన్లలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. జూన్ 9న ప్రథమ ఇంటర్, 10న ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30 తుది గడువు అని పేర్కొన్నారు.

# 'అర్జున్ S/O వైజయంతి' సక్సెస్: ప్రేక్షకులకు థాంక్స్

నందమూరి కళ్యాణ్ రామ్ ఎమోషనల్ బ్లాక్ బస్టర్ అర్జున్ S/O వైజయంతి. ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో నటించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఏప్రిల్ 18న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ విడుదలైన ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా విజయశాంతి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.



విజయశాంతి

**అర్జున్ S/O వైజయంతి సక్సెస్‌ని ఎలా ఎంజాయ్ చేస్తున్నారు?** అందరికీ నమస్కారం. మా చిత్ర బృందం తరపున ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జీవితంలో మంచి సినిమా చేశామనే తృప్తి వుంది. కాప్, మదర్‌గా చాలా విరామం తర్వాత ఒక పవర్ ఫుల్ పాత్ర చేయడం జరిగింది. ప్రజలు రాములమ్మని విజయశాంతిని ఎలాంటి పాత్రలో చూడాలని అనుకున్నారో ఈ సినిమాతో అది ఫుల్ ఫిల్ అయ్యింది. ఇప్పుడు యాక్షన్ అనేది ఒకరకంగా నాకు ఛాలెంజ్. కాని నేను చేశాను. యాక్షన్ పెర్ఫార్మెన్స్‌ని అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు. అందరూ వారి పాత్రలని అద్భుతంగా చేశారు. అందుకే సినిమాకి అద్భుతమైన రిజల్ట్ వచ్చింది.

**ఆఫ్ స్క్రీన్ లో కూడా కళ్యాణ్ రామ్, మీకు మధ్య మదర్ అండ్ సన్ ఎమోషన్ కనిపించింది?** కళ్యాణ్ బాబు చాలా మంచోడు. సినిమాలో మాకు మంచి బాండ్ ఏర్పడింది. ఇది చాలా అరుదుగా జరుగుతుంది. తనకి నాపై చాలా ఆప్యాయత. గత జన్మలో తను నాకు బిడ్డ ఏమో నాకు తెలీదు. ఈ సినిమాకి అన్నీ అద్భుతంగా కుదిరాయి. **చాలామంది రీఎంట్రీ ఇస్తున్నారు? కానీ మీకోసమే రాసుకుంటున్న క్యారెక్టర్స్ రావడం ఎలా అనిపిస్తుంది?** బిగినింగ్ నుంచి నా ట్రాకే సపరేటు. ప్రతిఘటన, నేటి భారతం, కర్తవ్యం, ఒసేయ్ రాములమ్మ, మొండి మొగుడు పెంకి పెళ్ళాం.. ఇలా ఎన్నో వైవిధ్యమైన చిత్రాలు చేశాను. ఇన్ని రకాల పాత్రలు చేయడం నాకు కుదిరింది. ఇది గాడ్ గిఫ్ట్ అని భావిస్తాను. **అప్పట్లో గ్లామర్ హీరోయిన్‌గా ఇటు యాక్షన్ హీరోయిన్‌గా.. ఈ రెండిటిని ఎలా బ్యాలెన్స్ చేసేవారు?** ఏమో నాకు తెలియదండి. చిరంజీవి గారు, బాలకృష్ణ, కృష్ణ, శోభన్ బాబు ఇలా హీరోలు అందరితో ఫుల్ గ్లామరస్ రూల్స్ చేశాను. ఇటు చంద్రమోహన్ లాంటి హీరోలతో పని చేశాను. దాదాపు 60 మంది హీరోలతో కలిసి పని చేశాను. చాలా ఎక్స్పరిమెంట్లు చేశాను. నా ప్రతి సినిమాకి వేరియేషన్ ఉంటుంది. ఒకదానికి ఒకటి పోలిక ఉండదు. ఇదంతా అదృష్టంగా భావిస్తున్నాను. దేవుడు నాకు అలా రాసిచ్చాడు. **ఈ సినిమా క్లైమాక్స్ విన్నప్పుడు ఎలా అనిపించింది?** నేను చాలా షాక్ అయ్యాను. చాలా కొత్తగా ఉందనిపించింది. హీరో అలా చేయడం అనేది ఫస్ట్ టైం వింటున్నాను. అసలు ఫాన్స్ ఆడియన్స్ ఒప్పుకుంటారా అనిపించింది.

**నిర్మాతల గురించి?** చాలా మంచి ప్రొడ్యూసర్స్. ఏనాడు ఇది లేదు అని నేను వినలేదు. ఈ సినిమాకి కావలసిన ప్రతిదీ నిర్మాతలు సమకూర్చారు. **ఇలాంటి ప్రేమ రావడం ఎలా అనిపిస్తుంది?** ఇది చాలా గొప్ప వరంగా భావిస్తున్నాను. బండ్లు కట్టుకుని వచ్చేవారు. అప్పుడు ప్రింట్స్ ఉండేవి. అక్కడే స్నానాలు చేసి వంట చేసుకుని కూడా తినే వారు. అది ఒక గ్రేట్ ఎక్స్పీరియన్స్.

# 'సారంగపాణి జాతకం' కామన్ మ్యాన్ కథ

వరుస విజయాలతో ప్రియదర్శి మంచి ఊపు మీద ఉన్నారు. ఆయన హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీదేవీ మూవీస్ పతాకంపై శివ లెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణంలో మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కించిన చిత్రం సారంగపాణి జాతకం. ఈ సినిమా ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రియదర్శి మీడియాతో ముచ్చటించారు. ఆయన సినిమా గురించి చెప్పిన సంగతులివే.. **కోర్ట్ లాంటి హిట్ తరువాత మళ్లీ సారంగపాణి జాతకంతో రాబోతోన్నారు? ఈ చిత్రం ఎలా ఉండబోతోంది?** సారంగపాణి జాతకం కథ లాస్ట్ ఇయర్ విన్నాను. ఈ చిత్రం గత ఏడాది చివర్లో రావాల్సింది. కానీ కాస్త ఆలస్యంగా ఇప్పుడు ఏప్రిల్ 25న వస్తున్నాం. కోర్ట్ లాంటి హిట్ తరువాత మళ్లీ వెంటనే సారంగపాణి జాతకం అని వస్తుండటం ఆనందంగా ఉంది. **సారంగపాణి జాతకంలో మాదిరిగా మీరు నిజ జీవితంలో జాతకాలు నమ్ముతారా?** సారంగపాణి జాతకం చిత్రంలో చూపించినట్టుగా కాదు కానీ.. నేను కొంత నమ్ముతాను. ఇండస్ట్రీలో ఏదీ మన కంట్రోల్‌లో ఉండదు. మంచి సినిమాను చేయాలని ప్రయత్నిస్తాం. ఫలితం మన చేతుల్లో ఉండదు. **సారంగపాణి జాతకంలో మీరు ఏం చెప్పబోతోన్నారు?** జాతకాలు నమ్మాలి అని కానీ నమ్మకూడదు అని కానీ మేం చెప్పం. కానీ ఒకరి నమ్మకాల్ని ఇంకొకరి మీద రుద్దితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూపిస్తాం. ఏ సైడ్ తీసుకుని మాత్రం కథను చెప్పలేదు. **మీరు ఎక్కువగా ఎమోషనల్ స్టోరీలను ఎంచుకుంటున్నారు. అవే ఎక్కువగా విజయాన్ని సాధిస్తుండటం గురించి చెప్పండి?** కామన్ మేన్ పాత్రల్ని పోషిస్తే ఎక్కువ మందికి రీచ్ అవుతుందని నా నమ్మకం. మల్లేశం అయినా, సారంగపాణి అయినా మన చుట్టు పక్కనే చూస్తాం. వారి జర్నీ చాలా పెయిన్ ఫుల్‌గా ఉంటుంది. మల్లేశం, బలగం, కోర్ట్, సారంగపాణి ఇలా అన్నీ కూడా మన చుట్టూనే చూస్తుంటాం. ఇందులో జాతకాల్ని నమ్మే ఓ కుర్రాడి పాత్రను పోషించాను. **ప్రారంభంలో కామెడీ రోల్స్ చేసిన మీరు ఇప్పుడు ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్‌లు చేస్తుండటం గురించి చెప్పండి?** ప్రస్తుతం నవ్వించడం అనేది చాలా కష్టమైన పని. ఇంద్రగంటి కామెడీ టైమింగ్ చాలా బాగుంటుంది. ఇలాంటి ఓ పాత్రను ఇంత వరకు నేను చేయలేదనిపిస్తోంది. ఇది చాలా కొత్తగా ఉండబోతోంది. ఈ చిత్రం, అందులోని నా పాత్ర అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను. **సారంగపాణి జాతకం చిత్రంలో మీ పాత్ర, యాస ఎలా ఉండబోతోంది?** ఇంత వరకు నేను ఎక్కువగా తెలంగాణ మాండలికంలోనే ఎక్కువగా మాట్లాడాను. కానీ ఈ సారి మాత్రం ఆంధ్ర యాసలో మాట్లాడతాను. ఇంద్రగంటి స్టైల్‌లోనే మాట్లాడేందుకు ప్రయత్నించాను. ఆయన నా కోసం ఇందులో సపరేట్ ట్రాక్, టైమింగ్‌ను సెట్ చేశారు. అది అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా.

**తణికెళ్ల భరణి, నరేష్, అవసరాల శ్రీనివాస్ వంటి వారితో పని చేసిన అనుభవం గురించి చెప్పండి?** తణికెళ్ల భరణి, నరేష్, అవసరాల శ్రీనివాస్ అద్భుతమైన నటులు. వాళ్లంతా లెజెండ్స్. వెన్నెల కిషోర్ అద్భుతమైన ఆర్టిస్ట్. వైవా హర్షకు మంచి టైమింగ్ ఉంది. అందరూ సీనియర్లే అయినా మాతో కలిసి పోయి సరదాగా షూటింగ్ చేశారు. **సారంగపాణి జాతకం హీరోగా ఏమైనా ఒత్తిడి ఫీల్ అయ్యారా?** ఇంద్ర గంటి ఎక్కువగా కష్టపడ్డారు. ఈ చిత్రానికి నా కంటే ఆయనే ఎక్కువగా కష్టపడ్డారు. సెట్స్ మీదకు వచ్చి ఆయన చెప్పింది చెప్పినట్టుగా చేసుకుంటూ పోయానంతే. నేను ఎప్పుడూ ఒత్తిడిగా ఫీల్ అవ్వలేదు.



ప్రియదర్శి

# 'జింఖానా' ప్రిరిలీజ్

మలయాళ బ్లాక్‌బస్టర్ ప్రేమలుతో అలరించిన నస్లెన్ జింఖానాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఖలీద్ రెహమాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇప్పటికే మలయాళంలో బాక్సాఫీస్ వద్ద బిగ్ హిట్ అయ్యింది. ఖలీద్ రెహమాన్, జోబిన్ జార్జ్, సమీర్ కారత్, సుబీష్ కన్నంచెరి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పుడీ స్పోర్ట్స్ ప్యాక్డ్, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఏప్రిల్ 25న తెలుగు థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. ప్రిరిలీజ్ ఈవెంట్‌లో బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం.



జింఖానా టీం అందరికీ కంగ్రాట్స్. ఈ సినిమా మలయాళంలో బ్లాక్ బస్టర్. ఈ సినిమాని సుబ్బారెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఆల్ ది బెస్ట్. డైరెక్టర్ ఖలీద్ రెహమాన్ బాక్సర్. కాబట్టే ఇలాంటి సినిమాని అద్భుతంగా తీయగలిగాడు. ట్రైలర్‌లో షాట్స్ చాలాబావున్నాయి. తన ఫస్ట్ సినిమా చాలా బావుంటుంది. అది నా ఆల్ టైం ఫేవరేట్. ఈ సినిమా కూడా పెద్ద హిట్. నైజాం శశి చేస్తున్నారు కాబట్టి ఇంక తిరుగువుండదు. ఈ సినిమాని పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను. నాకు సినిమా కంటెంట్ నచ్చితే భాష, చిన్న, పెద్ద సినిమా అనే తేడా లేకుండాప్రమోట్ చేయడానికి ముందు ఉంటాను అన్నారు.

# 'తుడరుమ్' ట్రైలర్ లాంచ్

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ తుడరుమ్. వెటరన్ హీరోయిన్ శోభన మోహన్ లాల్‌కి జోడిగా నటించారు. తరుణ్ మూర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎం. రంజిత్ నిర్మించారు. ఈ సినిమా తెలుగు వెర్షన్ థియేట్రికల్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఎమోషన్స్ అండ్ ఎంటర్టైన్‌మెంట్ రోలర్ కోస్టర్ రైడ్‌గా ట్రైలర్ కట్టిపడేసింది. మోహన్ లాల్ ట్యాక్సీ డ్రైవర్‌గా ఫ్యామిలీ మ్యాన్‌గా కనిపించిన తీరు ఆకట్టుకుంది. ఓ కారు, ఫ్యామిలీ చుట్టూ ఆసక్తికరంగా నడిచిన



ట్రైలర్ సినిమాపై కథపై చాలా క్యూరియాసిటీని పెంచింది. మోహన్ లాల్ నేచురల్ అండ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ హైలెట్‌గా నిలిచింది. మోహన్ లాల్, శోభన అన్ స్క్రీన్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా వుంది. దర్శకుడు తరుణ్ మూర్తి కథని చాలా ఆసక్తికరంగా ప్రజెంట్ చేశాడు. జేక్స్ బిజోయ్ నేపథ్య సంగీతం ఎక్సయిటింగా వుంది. షాజీ కుమార్ సినిమాటోగ్రఫీ టాప్ క్లాస్‌లో వుంది. ట్రైలర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాలలో దీపా ఆర్ట్స్ పి శ్రీనివాస్ గౌడ్ గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. నటీనటులు: మోహన్ లాల్, శోభన, మణియంపిల్ల రాజు, బిను పప్పు, ఇర్షాద్ అలీ, ఫర్హాన్ ఫాజిల్, థామస్ మాథ్యూ, షైజో ఆదిమాలి దర్శకత్వం: తరుణ్ మూర్తి నిర్మాత: ఎం. రంజిత్ తెలుగు రిలీజ్: దీపాఆర్ట్స్ పి శ్రీనివాస్ గౌడ్, స్క్రీన్ ప్లే, డైలాగ్స్: కె.ఆర్.సునీల్, తరుణ్ మూర్తి సినిమాటోగ్రఫీ: షాజీ కుమార్ ఎడిటర్: షఫీక్ వి.బి, నిషాద్ యూసుఫ్ సంగీతం: జేక్స్ బిజోయ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అవంతిక రెంజిత్ కథ: కేఆర్ సునీల్ ఆడియోగ్రాఫర్: విష్ణు గోవింద్, ప్రొడక్షన్ డిజైన్: గోకుల్దాస్ పీఆర్వో: వంశీ శేఖర్.



కావ్య థాపర్ నయా లుక్

# 'మందాడి' ఫస్ట్ లుక్

మిస్టర్ ఎల్రెడ్ కుమార్ నేతృత్వంలోని ప్రముఖ నిర్మాణ సంస్థ ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్‌లో 16వ ప్రాజెక్ట్‌గా మందాడి చిత్రం రానుంది. ఈ ఉత్కంఠభరితమైన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. తన తొలి చిత్రం సెల్ఫీతో బలమైన ముద్ర వేసిన మతి మారన్ పుగళేంది రచన, దర్శకత్వం వహించిన ఈ మందాడి ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో సూరి ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రంతో తెలుగు నటుడు సుహాస్‌ను తమిళ పరిశ్రమకు గర్వంగా పరిచయం చేస్తున్నారు. మహిమా నంబియార్ ఈచిత్రంలో ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్, సచ్చనా నమిదాస్ వంటి వారు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



గ్రాండ్ మీడియా కార్యక్రమంలో మందాడి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ ఫస్ట్ లుక్‌తో సినిమాపై ఒక్కసారిగా అంచనాలు పెరిగాయి. రామనాథపురం తీరప్రాంతాలలో టెస్ట్ షూట్ పూర్తయింది. ప్రీప్రొడక్షన్ పనులు ఆల్రెడీ మొదలయ్యాయి. ఈ చిత్రం ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఉంటుంది. మానవ సంబంధాలను చాటేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బోట్ రేస్ అంటూ తీర ప్రాంతాల్ని కళ్లకు కట్టినట్టుగా చూపించబోతోన్నారు. మీడియా కార్యక్రమంలో చిత్ర యూనిట్ సెయిల్ బోట్ రేసింగ్‌పై ఒక డాక్యుమెంట్ వీడియోను కూడా ప్రదర్శించింది. ఇది మందాడి ప్రపంచంలోకి తీసుకెళ్లినట్టుగా అనిపిస్తుంది. తిరుగులేని నాయకుడిగా చేస్తాయి. రచయిత, దర్శకుడు మతిమారన్ పుగళేంది మాట్లాడుతూ, నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చిన ఎల్రెడ్ సర్, వెట్రి సర్‌కి థాంక్స్. నటుడిగా సూరి సర్ ఎంచుకుంటున్న పాత్రలు ప్రశంసనీయం. ఈ పాత్రను అతనికోసం రాయడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. స్క్రిప్ట్‌లను ఎంచుకోవడంలో సూరి సర్ దూరదృష్టి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. మందాడి ఖచ్చితంగా అతని కెరీర్‌లో ఒక ప్రత్యేక మైలురాయి చిత్రంగా నిలుస్తుంది. ఈ చిత్రంలో అతని నటన మాత్రమే కాకుండా ఆహార్యం, లుక్, మేకోవర్ ఇలా అన్నీ కూడా అందరినీ ఆశ్చర్య పరుస్తాయి.

# నా రియల్‌లైఫ్‌కు దగ్గరగా ఉండే పాత్ర 'సోదరా': ఆరతి గుప్తా

సంపూర్ణేష్ బాబు, సంజోష్‌లు హీరోలుగా నటిస్తున్న చిత్రం సోదరా. అన్న దమ్ముల అనుబంధం నేపథ్యంలో, అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న సోదరా చిత్రానికి మన్ మోహన్ మేనంపల్లి దర్శకుడు. క్యాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై చంద్ర చగంలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆరతి గుప్తా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆరతి గుప్తా విలేకరులతో ముచ్చటించారు ఆ విశేషాలివి. **మీనేపథ్యం ఏమిటి?** చంఢీగడ్ పుట్టి పెరిగిన నేను ముంబయ్‌లో స్థిరపడ్డాను. ఇంతకు ముందు బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించాను. కానీ తెలుగులో నా తొలిచిత్రం సోదరా. బ్యూటీఫుల్‌గా ఉంది. ఇక్కడ స్థిరపడాలంటే తెలుగు నేర్చుకోవాలి. అప్పుడే నాకు కంఫర్ట్‌గా ఉంటుంది. **హైదరాబాద్‌లో ఎలా వుంది?** హైదరాబాద్‌లో ఏదో తెలియని ఎనర్జీ ఉంది. కామ్‌గా ఉంది. వెరీ మచ్ హోప్ ఫుల్ ఇక్కడ నేను బిజీ అవుతుందని నమ్మకం ఉంది. **దర్శకుడు మోహన్ గురించి?** దర్శకుడు మోహన్ ఎంతో కోఆపరేటివ్, ఎంతో సపోర్ట్ చేస్తారు. పర్‌ఫార్మ్ చేయడానికి స్కోప్ వున్ పాత్రను ఇచ్చారు. ఆయన వల్లే బాగా నటించగలిగాను. **సంపూ ప్రీవియస్ సినిమాలు చూశారా?** సంపూ గురించి విన్నాను. అవుట్ ఆఫ్ ద బాక్స్ యాక్టర్ అని తెలుసు. సంపూకు ఉన్న ఫ్యాన్స్ బేస్ తెలుసు. ఆయన గత చిత్రం మార్టిన్ లూథర్ కింగ్ సినిమా చూశాను. **ట్రెడిషినల్ పాత్రను చేయడం ఎలా అనిపించింది?** ఇంతకు ముందు ట్రెడిషినల్ పాత్రలు చేశాను. రియల్‌లైఫ్‌లో కూడా నేను సింపుల్ గర్ల్ నా వ్యక్తిత్వం అలానే ఉంటుంది. నా వ్యక్తిత్వానికి దగ్గర ఉండే పాత్రను ఈ సినిమాలో చేశాను. ఎలాంటి జోనర్‌లు అంటే ఇష్టం. అన్ని తరహా పాత్రలు, అన్నీ తరహా సినిమాలు చేయాలని వుంది. అవసరమైతే ఎలాంటి పాత్రనైనా చేస్తాను. **మీకు పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలు చేయాలని ఉందా? లేక గ్లామర్ పాత్రలు చేయాలని ఉందా?** పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలు చేయాలని ఉంది. బాగా యాక్ట్ చేయగలిగితే మనం అందంగా కనిపిస్తాం. ఒకవేళ అందంగా ఉండి యాక్ట్ చేయలేకపోయినా గ్లామర్‌గా కనిపించం.

**ఈ సినిమాలో పార్ట్ కావడానికి మిమ్ములను ఆకట్టుకున్న అంశం ఏమిటి?** కథ నచ్చి ఒప్పుకున్నాను. బ్యూటీ ఆఫ్ దస్క్రిప్ట్. లైట్ హార్టెడ్ ఫ్యామిలీ డ్రామా ఇది. ఈ సినిమా మీ స్నేహితులు, ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎవరితోనైనా చూడొచ్చు. ఈ సినిమాలో నా పాత్ర కూడా బాగా నచ్చింది. అమాయకమైన పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తాను. సింపుల్ విలేజ్ గర్ల్. చదువున్న అమ్మాయి. ఇన్నోసెంట్, అండ్ డిగ్నిఫైడ్. పాత్ర అది. **సంపూ, సంజోష్‌లతో కలిసి నటించడం మీకెలా వుంది?** ఇద్దరూ ఎంతో స్వీట్ పర్సన్. ఎంతో కో ఆపరేటివ్. ఇద్దరూ సెట్‌లో ఉంటే ఎంతో ఎనర్జీ ఉంటుంది. **మీరు తెలుగు నేర్చుకుంటున్నానని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు ఎందుకని?** ఈ చిత్రం ట్రైలర్ లాంచ్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ చెప్పిన మాటలను ప్రేరణగా తీసుకుని తెలుగు నేర్చుకుంటున్నాను. తెలుగు ఎంతో



ఆరతి గుప్తా

కూడా చాలా ఇష్టం. ప్రతి ఆర్టిస్టును సమానంగా చూడటం నాకు చాలా నచ్చింది. తెలుగు సినిమా గురించి నేను ఇంకా తెలుసుకోవాల్సి చాలా ఉంది. పర్‌ఫార్మన్స్ ఓరియెంటెడ్ సినిమాలకే నా మొదటి ప్రాధాన్యత. **మిమ్ములను ఇన్‌స్పైర్ చేసిన హీరోయిన్ ఎవరు?** అలియాభట్ అంటే నాకు చాలా ఇష్టం. ఆమె జర్నీ, ఆమె చేసిన పాత్రలు నాలో ప్రేరణను నింపాయి. ఆమె సినిమాల సెలక్షన్ కూడా బాగుంటుంది. **టాలీవుడ్‌లో మీకు ఇష్టమైన హీరో ఎవరు?** అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టం, ఆయన సినిమాలు చాలా ఇష్టం. **తెలుగు సినిమాలో మీకు నచ్చింది ఏమిటి?** తెలుగు సినిమాలో టైమ్ పంక్చువాలిటి చాలా ఇష్టం. ఇక్కడ ఆర్టిస్టుల ప్రొఫెషనలిజం

# 'ముత్తయ్య' నుంచి సాంగ్ రిలీజ్

కె.సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణ చంద్ర, మోనికా బొమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన అవార్డ్ విన్నింగ్ మూవీ ముత్తయ్య. ఈ చిత్రాన్ని దర్శకుడు భాస్కర్ మౌర్య రూపొందించారు. హైలైఫ్ ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిక్షనరీ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పి బ్యానర్లపై వంశీ కారుమంచి, వృందా ప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు. దివాకర్ మణి ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్, సహ నిర్మాతగా కూడా వ్యవహరించారు. త్వరలో ముత్తయ్య సినిమా ఈటీవీ విన్‌లో ప్రీమియర్‌కు రెడీ అవుతోంది. స్టార్ హీరో విజయ్ దేవరకొండ చేతుల మీదుగా ముత్తయ్య సినిమా నుంచి సీనిమాల యాక్ట్ జేశి.. పాటను రిలీజ్ చేశారు. ఈ పాట లాంచ్ చేయడం సంతోషంగా ఉందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా తమ కలల్ని సాకారం చేసుకోవాలని విజయ్ దేవరకొండ ఈ సందర్భంగా అన్నారు. ముత్తయ్య సినిమా టీమ్ కు విజయ్ దేవరకొండ తన బెస్ట్ విశెస్ అందించారు. సీనిమాల యాక్ట్ జేశి.. పాటను మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ రోడ్రిగ్స్ బ్యూటిఫుల్ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. దర్శకుడు భాస్కర్ మౌర్య ముత్తయ్య పాత్రను రిఫ్లెక్ట్ చేస్తూ లిరిక్స్ రాయగా, చిన్నా.కె. ఆకట్టుకునేలా పాడారు. సీనిమాల యాక్ట్ జేశి.. పాట ఎలా ఉందో చూస్తే సీనిమాల యాక్టు జేశి ఎలిగిపోతవా...బుట్టలల్లుకుంట ఊళ్ళె మిలిగిపోతవా..ముత్తయ్య... తిక్క తిక్క ఈడియోలు జేసుకుంటవా.. స్టెప్పులేసి ఎగిరి దుంకి సంపుతుంటవా..ముత్తయ్య.... పేమసైతవా పేళ్ల గోళ్ల గిల్తవా... దేశమంత లొల్లి జేస్తావా... డ్యాన్సు జేస్తవా డయ్యిలాగు జెబుతవా ఓపికంత కూడ వెడ్తావా... ముత్తయ్య.. అంటూ ముత్తయ్య వెండితెర కలను వర్ణిస్తూ సాగుతుందీ పాట. నటీనటులు: కె. సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణ చంద్ర, మోనికా బొమ్మ, తదితరులు టెక్నికల్ టీమ్: రచన, దర్శకత్వం భాస్కర్ మౌర్య, నిర్మాతలు: వంశీ కారుమంచి, వృందా ప్రసాద్, బ్యానర్స్: హైలైఫ్ ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిక్షనరీ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పి సహ నిర్మాత: దివాకర్ మణి, అసోసియేట్ నిర్మాత: హేమంత్ కుమార్ సిఆర్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్) సినిమాటోగ్రాఫర్: దివాకర్ మణి సంగీతం కార్తీక్ రోడ్రిగ్స్ ఎడిటర్: సాయి మురళి సౌండ్ డిజైన్ మిక్సింగ్: వంశీప్రియ రసినేని ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వెంకట్ కృష్ణ ఆర్ట్: బాలు.



# సమన్వయంతో సర్దుకుపోవాలి

భార్యాభర్తల మధ్య ఏ గొడవ ఉన్నా కలిసి కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారమవుతుంది. ఈ నియమం పెత్తనం చెలాయించే భర్త విషయంలోనూ వర్తిస్తుంది. అయితే ఎదుటివ్యక్తి కోపంలో ఉన్నప్పుడు ఏం చెప్పినా వారికి అర్థం కాదు. తను కాస్త ప్రశాంతంగా ఒకచోట కూర్చున్నప్పుడు.. తన ప్రవర్తన వల్ల ఎంత ఇబ్బంది పడుతున్నారో విడమరిచి చెప్పండి. ఇద్దరి మధ్య జరిగే ఈ వాదనల వల్ల ఇటు మీరు, అటు పిల్లలు ఎంతలా సతమతమవుతున్నారో వాళ్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేయండి. అలాగే వారు ప్రవర్తించడానికి గల కారణాలేంటో కూడా నేరుగా అడగచ్చు. ఇలా ఇద్దరి మధ్య జరిగే సానుకూల చర్చనైనా ఇద్దరిలో మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. అకారణంగా ఎదుటి వ్యక్తి మనపై పెత్తనం చెలాయిస్తున్నారంటే ఆత్మ న్యూనతకు గురవడం సహజం. ఇలాంటప్పుడే ఇతరులతో పోల్చుకోవడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం.. జరుగుతుంటాయి. ఇలాంటి ప్రతికూల భావనలు శారీరకంగా, మానసికంగా కుంగదీయడంతో అనుబంధానికి అవరోధాలుగా మారుతుంటాయి. ఈ ఆఫర్‌పై నమ్మకం, గౌరవం డోల్పోకుండా ఉండేందుకు స్వీయ ప్రేమను పెంచుకోవడం ముఖ్యం, నచ్చిన పనులు చేయడం ఇష్టమైన వ్యాపకాలపై దృష్టి పెట్టడం వల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది. ఆధారపడద్దు! ఆర్థిక స్వేచ్ఛ ఉన్న మహిళల కంటే, వ్యక్తిగతంగా, ఆర్థికంగా తమపై ఆధారపడే భార్యల విషయంలోనే చాలామంది భర్తలు పెత్తనం చెలాయించాలని చూస్తారు. కావాలని పూచిక పుల్లలా తీసిపడేస్తుంటారు. వాళ్ల నిర్ణయాలను, అభిప్రాయాలను ఏమాత్రం గౌరవించరు. భర్తలతో వేగలేక, తాము పడుతోన్న బాధ ఎవరితో చెప్పుకోలేక లోలోపలే కుమిలి పోతుంటారు ఇలాంటి చాలామంది భార్యలు. నిజంగా మీలో ప్రతిభ ఉంటే, మిమ్మల్ని నిరూపించుకోగలరన్న నమ్మకం ఉంటే ఎవరికీ తలవంచాల్సి న అవసరం లేదంటున్నారు నిపుణులు. చదువు, ట్యాలెంట్‌కి తగ్గ ఉద్యోగం వెతుక్కునే ప్రయత్నం చేయండి. ఒకవేళ వాళ్లు అడ్డుపడకుండా.. ఇద్దరి సంపాదన ఉంటే అది కుటుంబానికే మంచిదని సానుకూలంగా మాట్లాడే ప్రయత్నం చేయండి. ఇలా మీ కాళ్ల మీద మీరు నిలబడగలిగితే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం రెట్టింపవుతాయి. ఇది పరోక్షంగా అనుబంధానికీ మేలు చేస్తుంది. ఆఖరి ప్రయత్నంగా ఎదుటివారు తమని తక్కువ చేసి చూస్తున్నారంటేనే కోపం కట్టలు తెంచుకోవడం సహజం. అలాగని ఎంత ప్రయత్నించినా వాళ్లు మారట్లేదని.. మీరూ వాళ్లలాగే గట్టిగా అరవడం, గొడవలు చేస్తే సమస్య పరిష్కారమవకపోగా.. మరింత జటిలమవుతుంది. కాబట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోతే.. ఆఖరి ప్రయత్నంగా మానసిక నిపుణుల దగ్గరికి కౌన్సెలింగ్‌కి వెళ్లడం మంచిది. ప్రవర్తనకు గల కారణాలేంటో తెలుసుకొని వాళ్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వడం, ఇద్దరితో మరోసారి మాట్లాడడం.. దీనివల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది. ★




**చెలి చిట్కా**

★ కర్పూరం దగ్గుకు, కలరాకు బాగా పనిచేస్తుంది.

★ గాట్లు, దెబ్బలు, కోతలకు తేనె పూస్తే త్వరగా గాయాలు నయమవుతాయి.

## సేవాఫలం



నానాసాహెబ్ నిమోంకరు కుమారుడు సోమనాథ్ శంకర దేశపాండే సెప్టెంబరు పుతతె 1936న కొన్ని ఆచరణీయ, ఆసక్తికర సంఘటనలను పేర్కొన్నారు. సాయిబాబా శ్యామాని విష్ణు సహస్ర నామ పారాయణం రోజుకొక నామమునైనా సరే చేయమన్నారు. శ్యామా మాతృభాష మరాఠీ. సంస్కృతం రాదు. సాయికి ఆ విషయం తెలియదా? శ్యామాకు బాబా యందు పూర్తి విశ్వాసం. పారాయణ ప్రారంభించాడు. కొలది రోజులలోనే దానిలో అత్యంత ప్రావీణ్యాన్ని సంపాదించాడు. నార్కేకు కూడా బోధించగల స్థాయికి చేరాడు. నానా సాహెబ్ నిమోంకరుకు భాగవతము మొదలైన గ్రంథాలను పారాయణ చేయాలని కోర్కె ఉండేది. కానీ ఆయనకు సంస్కృతము రాదు. సాయియే ఆ విషయాన్ని ఎత్తారు. 'నువ్వు ఎందుకు పారాయణ చేయరాదు?' అని. నాకు సంస్కృతము రాదు అన్నాడు నిమోంకరు. అయినా ఫరవాలేదు. ప్రారంభించు. ఈ మసీదు మాయి తప్పక సంస్కృతం నేర్పుతుంది. క్రమంగా నీవే నేర్చుకుంటావు అన్నారు సాయి. అది సాయి దీవెన. సాయినాథుని మాటను సరస్వతీదేవి కాదనగలదా? అసలు సాయి, సరస్వతీ దేవి వేరయితే కదా! సాయి మాటలమీద నమ్మకం ఉంచాడు. పారాయణ ప్రారంభించారు. అర్థం కాకపోయినా చదవటం కొనసాగించాడు. అనతికాలంలోనే ప్రావీణ్యత సాధించాడు. భాగవతం, జ్ఞానేశ్వరి, భగవద్గీతలలో నిష్ణాతులైన కాకా సాహెబ్ దీక్షిత్, జోగ్ మొదలైన వారి సందేహాలను నివృత్తి చేసే స్థాయికి చేరాడు. ఒకనాడు సాయి మనమెందుకు ఇతరులకు విశదపరచటం మాత్రమే నిలిపి వేశాడు. పారాయణను ఆపలేదు. సాయి కంటికి రెప్పలాగా చూచుకుంటాడు తన భక్తులను. వారిలో అహం పెరగనివ్వడు. నిమోంకరు సాయి సమాధి చెందే ముందు మూడు సంవత్సరాలు సాయి అఖండ సేవలో ఉన్నాడు. స్నాన, సంధ్యాది నిత్య కర్మలు చేసుకొనుటకు మాత్రమే ఇంటికి వెళ్లేవాడు. సాయి ఆయనను కాకా అని పిలిచేవాడు. సాయి మహా సమాధి తరువాత ఆయన ఎక్కువ కాలం జీవించ లేదు. అవసానకాలంలో చివరి మూడు రోజులు ఆయనకు అంతటా, అందరిలో సాయియే దర్శనమిచ్చాడు. భార్యను సహితం సాయి బాబా అనేవాడు. అలా అఖండ స్మరణ లోనే సాయి సన్నిధిని చేరాడు ఆయ న. ఇది సేవా ఫలమే కదా!

**- ఎంపి. సాయినాథ్**

# దండనకంటే కౌన్సిలింగ్ మేలు!

**ప్రశ్న : నేను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్నాను. ఇప్పటి పిల్లల్లో కొందరు భయం, భక్తి లేకుండా ప్రవర్తిస్తున్నారు. హైస్కూలు దశలోనే కొందరు ప్రేమలో పడుతున్నారు. కొందరు గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. కొంతమంది స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. వారిని సంస్కరించి దారిలో పెడదామని భావించి దండిస్తే తిరగబడుతున్నారు. దైవంతో సమానమైన తల్లిదండ్రులు, గురువులను లెక్క చేయడంలేదు. ఇటీవల మా పాఠశాలలో ఒక అబ్బాయిని డ్రిల్లు మాస్టర్ బెత్తంతో రెండు దెబ్బలు వేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మాస్టారిని పిలిచి విచారించి ఇక మీదట పిల్లల్ని కొట్టవద్దని చెప్పి పంపేశారు. రెండు రోజుల క్రితం విశాఖ జిల్లా భీమిలి సమీపంలోకి ఒక ప్రైవేట్ కాలేజీలో ఒక అమ్మాయి రెచ్చిపోయింది. కాలేజీలో మొబైల్ ఫోన్ వినియోగించడం తప్పని చెప్పిన మహిళా లెక్చరర్‌పై తిరగబడింది. మాటా మాటా పెరిగి మొబైల్ లాక్కొని ప్రిన్సిపల్ దగ్గరకు వెళుతుండగా విద్యార్థిని వెంటబడి బూతులు తిట్టింది. మొబైల్ ఇవ్వకపోతే చెప్పుతో కొడతానంటూ ఆమెపై దాడి చేసింది. అనంతరం కాలేజీ సిబ్బంది ఆమెపై దాడి చేశారు. ఈ వ్యవహారం అంతా ఒకరు వీడియోతీసి సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. ఇలాంటి సంఘటనలు చూసినప్పుడు భయం వేస్తోంది. సమాజం ఏమైపోతోందో అన్న బాధ కలుగుతుంది. రానురాను యువతలో పెరిగిపోతున్న వ్యసనాలు హింసాప్రవృత్తిని అరికట్టడం ఎలాగో అర్థం కావడం లేదు. విద్యార్థుల్లో గుణసంపద, సంస్కారం, విలువలు పెంచాలంటే ఏమి చేయాలో వివరించగలరు.**

**– ఒక సోదరి, కాకినాడ**



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**జవాబు :** అమ్మా! మీ ఆవేదన అర్థ చేసుకున్నాను. కొందరు విద్యార్థులు విపరీతధోరణి ప్రదర్శించడానికి అనేక కారణాలు ఉంటాయి. విద్యార్థులే కాదు, పిల్లలు, యువత, పెద్దల్లో కూడా ప్రవర్తనాలోపాలు ఉండటం సహజం. రామాయణ, మహాభారతకాలంలో కూడా ఇలాంటి వారు ఉన్నారు. రామ, లక్ష్మణులు కూడ శూర్పణఖతో ఇబ్బంది పడ్డారు. బాల భారతం సినిమాలో చిన్న వయసులో పాండవులు, కౌరవుల మధ్య తలెత్తిన వైరం కళ్లకు కట్టినట్లు చూపాలు. అంటే మానవ సమాజం ఏర్పడినప్పటి నుండి విలువలతో పాటు ప్రవర్తనాలోపాలు సమాజంలో కనిపిస్తున్నాయి. మన సమాజంలో అయిదు శాతం మంది వివిధ రకాల మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. వ్యసనాలు, ప్రవర్తనా లోపాలు, విపరీతధోరణి, హింసాప్రవృత్తిలాంటి పలు లక్షణాలకు కారణం రుగ్మతలుగా గుర్తించాలి. లక్షణాలను బట్టి రుగ్మతలను గుర్తించి కౌన్సిలింగ్, చికిత్స చేస్తుంటారు. విద్యార్థులు, యువతలో హార్మోన్ల ప్రభావం వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతుంటాయి. చెడు స్నేహాలు, ప్రతికూల పరిసరాలు, పెంపకం, మీడియాలాంటి అంశాలు వాటికి ప్రేరణ కలిగించే అవకాశం ఉంది. కాబట్టి తల్లిదండ్రులు, టీచర్లు, అధ్యాపకులు పిల్లల ప్రవర్తన, మానసిక పరిస్థితి గమనించి సరిదిద్దే ప్రయత్నం చేయాలి. దారికి రానప్పుడు సైకాలజిస్టును సంప్రదించి కౌన్సిలింగ్ ఇవ్వాలి. తీవ్రంగా ఉంటే సైకియాట్రిస్టు ద్వారా చికిత్స చేయించాలి. అలా కాకుండా దండనతో దారికి వస్తారని భావించడం సరికాదు. అందుకే విద్యాసంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలని చాలా సంవత్సరాల నుంచి కోర్టులు, మేధావులు సూచిస్తున్నారు. ★



**వ్యధ**

# పిల్లల కోసం సమయం కేటాయించాలి

పొద్దున్న లేచింది మొదలు.. ఎవరి హడావిడిలో వాళ్లుంటాం. ఒకే ఇంట్లో ఉంటున్నా ఒకరితో మరొకరం మాట్లాడుకునే టైమే ఉండదు ఒక్కోసారి. ఈ హడావిడిలో పిల్లలతో గడిపే సమయం కూడా ఉండదు. అయితే ఇలాగే ఉంటే పిల్లలకు, పేరెంట్స్ కు మధ్య దూరం పెరిగి పోతుందంటున్నారునిపుణులు. పిల్లల కోసం సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. ఉదయం లేవగానే హడావిడిలో పడిపోకుండా పిల్లలు, తల్లిదండ్రులు, ఒకరికొకరు గుడ్‌మార్నింగ్ చెప్పుకోవడం, ఈ క్రమంలోన పెద్దలు పిల్లలకు ఓ ముద్దూ ఓ హగ్గూ ఇవ్వడం,రాత్రి పడుకునే ముందు గుడ్‌నైట్ చెప్పుకోవడం.. వంటివిరోజువారీ అలవాట్లుగా మార్చుకోవాలం టున్నారు నిపుణులు.

ఈ క్రమంలో ప్రతి రోజూ ఓ నియమం పెట్టుకున్నట్లుగా వాకింగ్/జాగింగ్‌కి బయటికి వెళ్లేటప్పుడు మీ పిల్లల్నీ మీతో పాటు కలుపుకోండి. తద్వారా వారి శరీరానికీ వ్యాయామం అందుతుంది. మీరు వ్యాయామం చేసేటప్పుడు ఒకరికొకరు మరింత దగ్గరవ్వచ్చు.




వ ఇంటి పనులు, వంట పనులు, ఇల్లు శుభ్రం చేయడం..వంటి పనుల్లో మీతో పాటు మీ పిల్లల్నీ భాగం చేయడం వల్ల ఇద్దరూ కలిసి మరింత ఎక్కువ సమయం గడపవచ్చు.

వ పేరెంట్స్–పిల్లల మధ్య అనుబంధాన్ని పెంచడంలో ఆటలూ కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు. అందుకే పిల్లలతో ఆటలా? అనుకోకుండా వీలు చిక్కినప్పుడల్లా వారితో సరదాగా ఆడుకోవడం/వారిని ఆడించడంలో తప్పులేదు.

వ పిల్లలకెందుకు ఈ పనులు? అనుకోకుండా గార్డెనింగ్.. మొదలైన వాటిలో పిల్లలనూ భాగం చేయడం వల్ల వారికి మంచి అలవాట్లు అలవడడంతోపాటు ఇద్దరూ కలిసి కాసేపు సమయం గడిపినట్లూ ఉంటుంది. ఇలా ఆలోచిస్తే పేరెంట్స్ పిల్లలు కలిసి చేసే పనులు, అనుబంధాన్ని దగ్గర చేసుకునే మార్గాలు బోలెడుంటాయి. మరి పాటిస్తారు కదూ. ★

# పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేస్తోంది

## - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్



**విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్త ప్రతినిధి:** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచివేసో్తందని ఏపీ డిప్యూటీ సిఎం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. జమ్మూ కాశ్మీర్ లోని అనంతనాగ్ జిల్లాలో తిరిగిన ఉగ్రదాడి తట్టుకోలేక పోతున్నానన్నారు. ఇలాంటి ఘోరాలు దారుణమని పవన్‌కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. 27 మంది పర్యాటకులు మృతి చెందడం, మరో 20 మంది గాయపడటం అత్యంత దారుణమని ఎక్స్ వేదికగా వెల్లడించారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నా. ప్రధాని మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఎదుర్కోడానికి నిరంతరం కృషి చేస్తోంది. అయినప్పటికీ ఇలాంటి ఘటనలు తీవ్ర ఆందోళనలు కల్గిస్తున్నాయి. ఉగ్రవాద ముప్పును నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా దేశ ప్రజలంతా మద్దతుగా నిలుస్తారు అని పవన్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి...తీవ్రంగా కలిచివేస్తోంది : పవన్‌కళ్యాణ్ ఈ దాడిలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ జనసేన పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజులు సంతాప దినాలను పాటించనున్నట్లు తెలిపారు. పహల్గాంలో జరిగిన దాడి దారుణమని దాడి తీవ్రంగా కలిచివేస్తోంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. వారి గౌరవార్థం జనసేన పార్టీ తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుంది. పా పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం. ఈ క్లిష్ట సమయంలో ధృఢంగా ఉందా. మన భారత ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది. ఇలాంటి దారుణాలు మరోసారి జరగకుండా చూడాలి. మన సాయుధ దళాలపై నాకు పూర్తి నమ్మకముంది. సమిష్టిగా మనం దీన్ని అధిగమిద్దాం. కలిసికట్టుగా ఉందాం. అని పవన్ పోస్ట్ చేశారు. ఉగ్రదాడిని ఖండిస్తూ మంగళగిరి లోని జనసేన కార్యాలయంలో పార్టీ జెండాను అవనతం చేశారు.

# పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన మృతులకు నివాళిగా జనసేన పార్టీ జెండా అవనతం

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించి 28 మందికి నివాళిగా.. జనసేన పతాకాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అవనతం చేశారు. బుధవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో పతాకాన్ని సగం వరకూ దించారు. ఈ సందర్భంగా శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ గారు మాట్లాడుతూ అమాయకులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం. పహల్గాం దాడి ఘటన దేశానికి ఒక చీకటి రోజుగా మిగిలిపోతుంది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము. ఈ దాడి సమాచారం తెలిసిన వెంటనే గౌరవ ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ గారు చాలా కలత చెందారు. ఎక్స్ వేదికగా తన మనసులోని ఆవేదనను వ్యక్తం చేశారు. బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఈ దుశ్చర్యను ఖండించి, మృతులకు సంతాపం తెలియచేశారు. జనసేన పార్టీ పక్షాన మృతులకు సంతాపం తెలియచేస్తూ మూడు రోజులపాటు సంతాప కార్యక్రమాలు నిర్వహించాలని అధ్యక్షుల వారు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ఈ రోజు రాష్ట్రంలోని అన్ని జనసేన పార్టీ కార్యాలయాలు, జనసేన నాయకుల ఇళ్లపై ఉన్న పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం. సాయంత్రం ఉగ్రదాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని పార్టీ కేంద్ర కార్యాలయంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తాం. శుక్రవారం మావనహారాలు జరుగుతాయి. రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కూడా మానవహారంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, వీరమహిళలే కాకుండా దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరు పాల్గొని అమరులైన వారికి సంఘీభావం తెలియజేయాల"ని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల శాసన సభ్యురాలు లోకం నాగమాధవి, మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, బేతపూడి విజయ్ శేఖర్, జె.రాజారెడ్డి, గంజి చిరంజీవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జనసేన కేంద్ర కార్యాలయం వద్ద జెండదా అవనతం

# రైల్వే టిటిఇలకు రక్షణ కల్పించాలి

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 23,ప్రభాతవార్త** విధినిర్వహణలో భాగంగా రైళ్లలో టిక్కెట్లు తనిఖీలు చేస్తున్న టిక్కెట్ చెకింగ్ సిబ్బందికి ప్రాణరక్షణ కల్పించాలని టిక్కెట్ చెకింగ్ సిబ్బంది రైల్వే యాజమాన్యానికి కోరారు. మైసూర్ నుంచి వారణాసి వెళ్లే నెంబర్ 22687బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ ఎస్–3 బోగీలో టిక్కెట్‌లు తనిఖీలు చేస్తున్న గోవింద నాయక్ అనే టిటిఇ యాద్గీర్–వాడి స్టేషన్ల మధ్య టిక్కెట్లు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో టికెట్ లేని ప్రయాణికులకు, టిటిఇ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈలోపు రైలు వాడి స్టేషన్‌కు చేరుకుంది. అప్పటికే కాపుకాసి ఉన్న సదరు వ్యక్తులు (టిక్కెట్ లేని ప్రయాణికులు) టిటిఇపై దాడికి పాల్పడి తీవ్రంగా కొట్టినట్లు టిక్కెట్ చెకింగ్ సిబ్బంది డిఆర్ఎం సహా సంబంధిత ఉన్నతాధికారులకు వివరించారు. కావున రైల్వే యాజమాన్యం తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని,టిక్కెట్ చెకి ంగ్ సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు. ౦ల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్,లక్ష్మీనారాయణ,కె ప్రసాద్,మల్లికార్జున, హీర ప్రసాద్,మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు జీఎం బాషా,మునీర్, షాబుద్దీన్ ఖాన్,రైల్వే ఎస్‌సి,ఎస్‌టి డివిజనల్ సహాయ కార్యదర్శి జీఎస్ కిశోర్ కుమార్ ప్రభుతులు రైల్వే అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

# ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన జెఎస్ చంద్రమోళి, మధుసూదన్‌లకు

## సిఎం చంద్రబాబు సంతాపం

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన ఏపీ తెలుగు సంఘం సభ్యులు జేఎస్ చంద్రమోళి, మధుసూదన్‌లకి సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఈ తీవ్ర దుఃఖ సమయంలో తమ ఆలోచనలు, ప్రార్థనలు వారి కుటుంబాలకు అండగా ఉన్నాయని, ఈ అపారమైన నష్టాన్ని తట్టుకునే శక్తిని వారు పొందాలని తాను ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఉగ్రవాద చర్యలు సమాజానికి మచ్చ అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఉగ్రవాదం, హింస వారు ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల ఏదీ సాధించలేరని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంఘీభావంగా నిలుస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు తీవ్రవాదంపై ధృఢమైన, నిర్ణయాత్మక చర్యతో ప్రతిస్పందించడానికి తమ నిబద్ధతతో ఉన్నారని చెప్పారు. ఈ హేయమైన చర్యకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తి స్థాయిలో అణచివేసేందుకు సమిష్టి కార్యచరణ అవసరమన్నారు. ఈ విషయంలో ఎన్డీఏ తీసుకునే నిర్ణయాలకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈరోజు రాత్రి 10 గంటలకు చంద్రమోళి మృతదేహం విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనుంది. ఈరోజు రాత్రికి విశాఖపట్నంలోనే సీఎం చంద్రబాబు ఉండనున్నారు. చంద్రమోళి మృతదేహం ఈ రాత్రికి విశాఖ చేరుకున్న తర్వాత సీఎం చంద్రబాబు నివాళులు అర్పించనున్నారు. రేపు ఉదయం చంద్రమోళి అంత్యక్రియల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. రేపు సాయంత్రం విశాఖపట్నం నుంచి అమరావతికి సీఎం చంద్రబాబు తిరిగి రానున్నారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో ఏపీ భవన్‌లో ఎమర్జెన్సీ డెస్క్ ఏర్పాటు చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు వెళ్ళిన తెలుగు ప్రజల సహాయార్థం దీన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఏపీ భవన్‌లో 9818395787 (వి,సురేష్‌బాబు)నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

# గడువు ముగిసిన పోస్టల్ ఎటియంలతో ఖాతాదారుల ఇక్కట్లు!

**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్23,ప్రబాతవార్త** నంద్యాలజిల్లా శ్రీశైలం నియేజకవర్గం శ్రీశైలమండలం,సుండిపెంట గ్రామంలో గల తపాలశాఖ ఖాతాదారులకు ఇచ్చిన ఏటియంలు గడువు ముగిసి అవి పనిచేయకపోవడంతో ఖాతా దారులు ఇక్కట్లు పడుతున్నారు. తపాలశాఖలో ఖాతాదారులు తమ అకౌంటులో ఉన్న సోమ్మును ఏటియం ద్వారా నగదు తీసుకోవాలంటే అవస ్థలు తప్పడంలేదని కొందరు ఖాతాధారులు తమ అవేదనను వెల్లబుచ్చుతునా ్నరు.

ఈక్రమంలోనే క్రొత ్తగా ఖాతాదారులు అకౌంటును ప్రారంబించుకున్నప్పటికి వారికి కూడా నెలల తరబడి గడచిన ఏటియంలు ఖాతాధారులకు ఇవ్వడంలేదని తపాలశాఖ అధికారులకు తెలిపిన పలితం సూన్యం అని విమర్శలు వెల్లువేత్తుతున్నాయి. కేంద్ర సర్కారు అదీనంలో ఉండే తపాలశాఖ పరిస్థితి ఈ విధంగా దాపురించడం ఏమిటి అని ఖాతాధారులు పెదవి విరుస్తున్నారు. స్థానిక తపాలశాఖ అధికారులను ఖాతాధారులు ఏటియంలు గురించి అడిగితే మాపై కార్యలయం నుండి రావాలని నెలల తరబడి సాకులు చెప్తుకాలం వేల్లబుచ్చుతున్నారని మండి వ డు తున్నా రు. తపాలశాఖలో ఖాతాదారులకు అవసరమైన ఏటియంలను అందబాటులో ఉంచకపోతే ఖాతాదారుల సంఖ్యా కూడా క్రమేనా తగ్గిపోయే అవకాశం లేకపోలేదు.

తపాలశాఖ ఉన్నాతాధికారులు స్పదించి సుండిపెంట తపాళశాఖ ఖాతాదారులకు అవసరమైనన్ని ఏటియంలను అందుబాటులో ఉంచాలని పలువురు ఖాతాదారులు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్‌పోసు ్టమాస్టర్ వివరణ:-ఏటియంల కొరతపై వివరణ కోరగా నెలకొని ఉన్న సమస్యను తమపై జిల్లా ఉన్నాతాధికారులకు తెలియపరచి ఏటియంలను ఖాతాదారులకు అందే విధంగా చేయడం జరుగుతుందని అనా ్నరు.

# తెలుగు రాష్ట్రాలలో రైల్వే యాంత్రిక విభాగం అధికారుల బదిలీలు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 23,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో యాంత్రిక(మెకానికల్) విభాగానికి చెందిన పలువురు ఇండియన్ రైల్వే సర్వీసెస్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్(ఐఆర్ఎస్ ఎంఇ )క్యాడర్‌లో పనిచేస్తున్న పలువురు అధికారులకు స్థానచలనం కల్పిస్తూ దక్షిణ మధ్య రైల్వే సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నాందేడ్ డివిజన్‌లో సీనియర్ డిఇఎన్‌హెచ్‌ఎంగా పనిచేస్తున్న రామచంద్ర సాహూను తూర్పు తీర రైల్వే జోన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో జోనల్ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సిఎంఇ/డీజిల్/ఆర్ అండ్‌ఎల్‌గా పనిచేస్తున్న కుందన్ కుమార్‌ను నియమించారు.

అలాగే ప్రస్తుతం గుంతకల్లు డివిజన్‌లో సీనియర్ డిఇఎన్‌హెచ్‌ఎంగా పనిచేస్తున్న పిఎస్ మణికుమార్‌ను గత కొన్ని మాసాలుగా ఖాళీగా ఉన్న సిఅండ్‌డబ్ల్యు సీని యర్ డిఎంఇగా నియమించారు. జోనల్ ప్రధాన కార్యాల యంలో డిప్యూటీ సిఎంఇ/ఫ్రైట్‌గా పని చేస్తున్న జితేంద్రకుమార్‌ను ముత్తు స్వామిని పదోన్నతిపై జోనల్ ప్రధాన కార్యాలయంలో నియమించారు.




## మయామీ ఓపెన్‌లో ఒసాకా నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ నవోమి ఒసాకా మాడ్రిడ్ ఓపెన్ తొలి రౌండ్‌లో లూసియా బ్రాంజెట్టి చేతిలో 4-6, 6-2, 4-6 తేడాతో ఓటమి పాలైంది. జపాన్ మాజీ ప్రపంచ నంబర్ 1, 55వ ర్యాంక్‌లో ఉన్న ఈ క్రీడాకారిణి, మొదటి సెట్‌ను కోల్పోయిన తర్వాత బలమైన రెండవ సెట్‌తో తిరిగి పోరాడింది, కానీ చివరికి తన దృఢనిశ్చయంతో ఉన్న ఇటాలియన్ ప్రత్యర్థిపై విజయం సాధించలేకపోయింది. కాగా టెన్నిస్ నుంచి 15 నెలల విరామం తర్వాత ఇంకా ఫామ్‌లో కొనసాగుతున్న ఒసాకా, చివరిసారిగా మార్చిలో మయామి ఓపెన్‌లో ఆడింది, మొదటి సెట్‌లోని నాల్గవ గేమ్‌లో రెండు బ్రేక్ పాయింట్లను సాధించింది, కానీ ఆమె దానిని తిరస్కరించింది. ఒసాకా తీవ్రంగా స్పందించే లోపు బ్రోంజెట్టి ఏడో సర్వ్‌ను బ్రేక్ చేసి దానిని అవుట్ చేసింది. 27 ఏళ్ల ఒసాకా తీవ్రంగా స్పందించేలోపు బ్రోంజెట్టి ఏడో సర్వ్‌ను బ్రేక్ చేసి దానిని అవుట్ చేసింది. ఒసాకా వెంటనే విరామం ఇచ్చింది మరియు ఆటలో తన ఐదవ బ్రేక్ పాయింట్ తీసుకున్నప్పుడు 33 వద్ద సర్వ్‌లో తిరిగి కుస్తీ పట్టినప్పటికీ, వెంటనే ఆమె మళ్ళీ బ్రేక్ అయింది. క్రాస్‌కోర్ట్ షాట్‌ను చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఒసాకా జారిపడటంతో బ్రాంజెట్టి విజయం సాధించింది. ఈ ఇటాలియన్ క్రీడాకారిణి రెండవ రౌండ్‌లో అమెరికన్ ప్రపంచ నంబర్ 5 మాడిసన్ కీస్‌తో తలపడుతుంది.

## 'ఏసియన్'లో భారత్ బాక్సర్ల జోరు

**న్యూఢిల్లీ:** ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లలో భారత బాక్సర్లు తమ బలమైన ప్రస్థానం కొనసాగించారు. జోర్డాన్‌లోని అమ్మాన్‌లో జరిగిన 2వ రోజు పోటీల్లో మూడు కమాండింగ్ విజయాలు సాధించారు. ఎస్‌జిఎఫ్ 2024 బంగారు పతక విజేత టికమ్ సింగ్ (52 కిలోలు) యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌కు చెందిన అలీ అల్మేస్మారిపై ఆధిపత్యం చెలాయించాడు. మూడవ రౌండ్‌లో రిఫరీ స్టాప్డ్ కాంటెస్ట్‌తో బౌట్‌ను ముగించాడు. ఇక ఉధమ్ సింగ్ (54 కిలోలు) ఇరాన్‌కు చెందిన మహ్మద్‌పర్సా మోటెవాలియా నస్తనెహ్‌సారిని అవుట్ బాక్సింగ్ చేసి 50 తేడాతో క్లీన్ విజయాన్ని నమోదు చేశాడు. ఇక ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జరిగిన బాలుర అండర్ -17 63 కిలోల తొలి రౌండ్‌లో భారత యువ బాక్సర్ అమన్ సివాచ్ 41తో కిర్గిస్థాన్‌కు చెందిన అబుబకీర్ దుషీవ్‌పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన అమన్..ప్రత్యర్థి బాక్సర్‌పై పదునైన పంచ్‌లతో చెలరేగాడు.



ఆట




## పసికూన జింబాబ్వే సంచలన విజయం

### 3 వికెట్ల తేడాతో స్వంత గడ్డపై బంగ్లాదేశ్ చిత్తు

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుకు వారి సొంతగడ్డపై పసి కూన జింబాబ్వే ఊహించని షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం బాంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్న జింబాబ్వే క్రికెట్ జట్టు తొలి టెస్టులో సంచలన విజయం సాధించింది. సిల్హెట్ వేదికగా బుధవారం జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తేడాతో బంగ్లాదేశ్ జట్టును చిత్తు చేసింది. దీంతో అరేళ్ల తర్వాత బంగ్లా గడ్డపై జింబాబ్వే విజయం సాధించినట్లయింది. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 191 పరుగులు చేయగా, జింబాబ్వే 273 పరుగులు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్ బుధవారం ఓవర్ నైట్‌తో కలిపి బంగ్లాదేశ్ 255 పరుగులు చేసి ఆలౌట్ కాగా, జింబాబ్వే 7 వికెట్లు నష్టానికి 174 పరుగులు చేసింది. దీంతో బంగ్లాదేశ్ రెండు ఇన్నింగ్స్‌లోనూ కలిపి 446 పరుగులు చేయగా, జింబాబ్వే 447 పరుగులు చేసింది. జింబాబ్వే బ్యాటర్లలో బ్రియాన్ బెన్నెట్ (52) టాప్ స్కోరర్‌గా నిలవగా, బెన్ కుర్రాన్ (44) పరుగులతో రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహది హసన్ మిరాజ్ 5 వికెట్లు పడగొట్టగా, తైజుల్ ఇస్లాం 2 వికెట్లు సాధించాడు. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బాంగ్లాదేశ్, జింబాబ్వే బౌలర్లు రెచ్చిపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ, వెల్లింగ్టన్ మసకద్జ తలో 3 వికెట్లు, న్యాయుచి, మదెవెరె చెరో 2 వికెట్లు తీసి బంగ్లాదేశ్ దెబ్బకొట్టారు. అనంతరం జింబాబ్వే తమ తొలి ఇన్నింగ్స్‌లో 273 పరుగులకు ఆలౌట్ అయింది. జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (57), సీన్ విలియమ్స్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా, వికెట్ కీపర్ న్యాషా మయవో (35), వెస్లీ మెదెవెరె (24), రిచర్డ్ నగరవ (28 నాటౌట్)గా పర్వాలేనిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ 5 వికెట్లతో చెలరేగగా, నహిద్ రాణా 3, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా బాంగ్లా బ్యాటర్లు తీరు ఏ మాత్రం మార లేదు. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 255 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ శాంటో (60), జాకీర్ (58), మోమినల్ (47) మినహా మిగిలిన బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో జింబాబ్వే ముందు కేవలం 174 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి పర్యాటక జట్టు ఛేదించింది. కాగా బంగ్లాపై జింబాబ్వేకు ఇది రెండో టెస్టు విజయం. ఇక ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ ఈ నెల 28 నుండి ఛటోగ్రామ్ వేదికగా జరగనుంది.

## ఆ రెండు టీమ్స్ ఇంటికే..

### ప్లే ఆఫ్ రేసులో ఉన్న జట్లు ఇవే

### మారుతున్న ఐపిఎల్ లెక్కలు



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 టోర్నమెంట్, 18వ సీజను కీలక దశకు చేరుకుంది. తాజాగా ఐపీఎల్ లీగ్‌లో మొదటి దశ ముగిసింది. ప్రతి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టికలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ సీజన్ లో కూడా కేవలం రెండు జట్లు తప్ప, మిగిలిన టీమ్స్‌లో టాప్ 4 కోసం గట్టి పోటీ ఉండేలా కనిపిస్తోంది. రెండవ దశ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. దీంతో ప్లే ఆఫ్ రేసు ఉత్కంఠగా మారింది. కానీ ప్రస్తుతం ఈ రెండు జట్ల పరిస్థితిని బట్టి చూస్తే ప్లే ఆఫ్ కు అర్హత సాధించడం కష్టంగా కనిపిస్తోంది. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ఈ సీజన్ చాలా కఠినంగా మారింది. ప్లే ఆఫ్స్‌లో చోటు దక్కించుకోవాలంటే ఈ జట్లు మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలవాలి. ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే 16 పాయింట్లు తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ తమ మిగిలిన అన్ని మ్యాచ్‌లను గెలవవలసి ఉంటుంది. చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ ఏప్రిల్ 25న జరుగుతుంది. కాబట్టి ఈ మ్యాచ్ చెన్నై భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. ఇక ముంబై ఇండియన్స్ వరుసగా 3మ్యాచ్‌ల్లో గెలిచి ప్లేఆఫ్ రేసులో నిలిచింది. అయితే హార్దిక్‌సేన తమ మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లో కనీసం 4 గెలవాలి. ఎందుకంటే ముంబైఖాతాలో ఇప్పుడు 8 పాయింట్లు ఉన్నాయి. కాబట్టి నాలుగు మ్యాచ్‌లు గెలిస్తే ఆ జట్టుకు 16 పాయింట్లు ఉంటాయి. ఇక కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కూడా ప్లే ఆఫ్ అవకాశం ఉంది. కానీ జట్టు మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదింటిని ఎలాగైనా గెలవాలి. కోల్‌కతా ఖాతాలో ఇప్పుడు 6 పాయింట్లు ఉన్నాయి. ఐదు మ్యాచ్‌లు గెలిస్తే రహానే టీమ్ కు 16 పాయింట్లు వస్తాయి. ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తదుపరి 6 మ్యాచ్‌లు చాలా ముఖ్యమైనవి. ప్రస్తుతం ఆర్‌సిబి ఖాతాలో 10 పాయింట్లు ఉన్నాయి. మిగిలిన 6 మ్యాచ్‌ల్లో 3 గెలిస్తే వారి ఖాతాలో 16 పాయింట్లు ఉంటాయి. గుజరాత్ టైటాన్స్ జట్టు 8 మ్యాచ్‌ల్లో 6 గెలిచింది. ఆ జట్టు ఖాతాలో 12 పాయింట్లు ఉన్నాయి. అలాగే, గుజరాత్ నికర రన్ రేట్ +1.104. కాబట్టి, గుజరాత్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే ఇంకా 2 మ్యాచ్‌లు మాత్రమే గెలవాలి. కాబట్టి, గుజరాత్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఐపిఎల్ 2025లో ఇప్పటివరకు సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ రెండూ 7 మ్యాచ్‌లు ఆడాయి. మిగతా 8 జట్లు ఒక్కొక్కటి 8 మ్యాచ్‌లు ఆడాయి. పాయింట్ల పట్టికలో గుజరాత్ తర్వాత ఢిల్లీ, ఆర్‌సిబి పంజాబ్ మరియు లక్నో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. నాలుగు జట్లు చెరో 5 మ్యాచ్‌ల్లో గెలిచాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రాజస్థాన్, హైదరాబాద్, చెన్నై జట్లు వరుసగా ఎనిమిదవ, తొమ్మిదవ, పదవ స్థానాల్లో ఉన్నాయి.




## అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో.. తెలంగాణ ఖాతాలో రెండో స్వర్ణం

### ఆంధ్రప్రదేశ్‌కు మరో స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఖాతాలో మరో స్వర్ణ పతకం చేరింది. దీంతో తెలంగాణ ఖాతాలో స్వర్ణ పతకాల సంఖ్య రెండుగా ఉంది. కొచ్చిలో జరుగుతున్న అథ్లెటిక్స్ చాంపియ్‌షిప్‌లో మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన అగసార నందిని పసిడి పతకాన్ని సొంతంచేసుకుంది. ఏడు క్రీడాంశాలైన 100 మీటర్ల హార్డిల్స, హై జంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు సమాహారమైన హెప్టాథ్లాన్‌లో నందిని మొత్తం 5813 పాయింట్లు స్కోరు చేస అగ్రస్థానంలో నిలిచింది. హరియాణాకు చెందిన పూజ 5401 పాయింట్లు సంపాదించి రజత పతకాన్ని దక్కించుకోగా, రిలయన్స్‌కు చెందిన మౌమిత మండల్ 5373 పాయింట్లతో కాంస్యం గెలిచింది. మరోవైపు మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి యర్రాజి జ్యోతి బంగారు పతకాన్ని దక్కించుకుంది. రిలయెన్స్ జట్టు తరపున బరిలోకి దిగిన జ్యోతి 100 మీటర్ల హార్డిల్స్ ఫైనల్ రేసును 13.23 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. విజేతగా నిలిచే క్రమంలో జ్యోతి ఆసియా ఛాంపియన్‌షిప్ అర్హత ప్రమాణ సమయాన్ని 13.26 సెకన్లతో అధిగమించింది.

## వాణిజ్యం

## సెన్సెక్స్, నిఫ్టీలకు ఐటి, బ్యాంకింగ్ మద్దతు

**ముంబై, ఏప్రిల్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఏడోరోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నా, మన మార్కెట్లు మాత్రం రాణించాయి. భవిష్యత్‌లో జరిగే వాణిజ్య చర్చల్లో చైనా దిగుమతులపై సుంకాలు తగ్గిస్తామని ట్రంప్ పేర్కొనడం, వడ్డీ రేట్ల విషయంలో విభేదిస్తున్న ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్‌ను తొలగించే ఉద్దేశమేదీ తనకు లేదంటూ ఆయన ప్రకటించడం మార్కెట్ సెంటి మెంట్‌ను బలపరిచింది. దేశీయంగా ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ మళ్లీ 80వేల మార్క్ ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఆరంభం లోనే 80 వేల మార్కును అందుకుంది. 80,142.09 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కాస్త ఒడుదొడుకులకు లోనైనా మళ్లీ పుంజుకొంది. ఇంట్రాడేలలో 80,2454 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి చివరికి 520.90 పాయింట్ల లాభంతో 80,116.49 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 161.70 పాయింట్ల లాభంతో 24,328.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 24 పైసలు బలహీన పడి 85.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.25 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు కాస్త తగ్గుముఖం పట్టి 3239 డాలర్ల వద్ద కొనసాగింది.




## 'ఇంటెల్'లో లేఆఫ్స్

**ముంబై, ఏప్రిల్ 23:** టెక్ పరిశ్రమలో అనిశ్చితులు ఇప్పట్లో కుదటపడేలా కనిపించడం లేదు. టాప్‌కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్నాయి. తాజాగా టెక్ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. తమ వర్క్‌ఫోర్స్‌లో 20 శాతానికిపైగా తొలగించాలని యోచిస్తోన్న ఇంటెల్ ఈ వారంలోనే లేఆఫ్‌లను ప్రకటించబోతున్నట్లు తెలిసింది. గత మార్చిలో సిఇఒగా బాధ్యతగా స్వీకరించిన లిప్-బు తాన్ నాయకత్వంలో ఇంటెల్ కంపెనీ ఈ వారం 20వేల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికను ప్రకటించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. 2024లో 19 బిలియన్ డాలర్ల నష్టంతో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇంటెల్, ఈ కోతలతో అధికారిక వ్యవస్థను తగ్గించి, నిర్వహణను




సరళీకరించి, ఇంజినీరింగ్-ఆధారిత సంస్కృతిని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇంటెల్ తన పరిస్థితిని మెరుగుపరచుకునేందుకు ఉద్యోగాల కోతలను చేపట్టడం ఇదే మొదటిసారి కాదు. 2024 ఆగస్టులో 15వేల మంది ఉద్యోగులను తొలగించింది. దీంతో కంపెనీ మొత్తం సంఖ్య 1,08,900కు చేరింది. అంతకుముందు సంవత్సరం 2023లో ఇంటెల్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,24,800 ఉండేది. 2025లో 257 టెక్ కంపెనీలు రోజుకు సగటున 450 మంది చొప్పున 50,372 మంది ఉద్యోగులను తొలగించాయని లేఆఫ్స్-ఎఫ్‌వైఐ తెలిపింది. 2024లో 1,115 కంపెనీల్లో 2,38,461 మంది ఉద్యోగులు తొలగింపునకు గురయ్యారు.

## ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లాభాలు పైపైకి

**ముంబై, ఏప్రిల్ 23:** ప్రైవేట్ రంగ సంస్థ ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్‌ఎఫ్‌బి) గతేడాది 2024-25 చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో నికర లాభం 18శాతం పెరిగి రూ.504 కోట్లకు చేరింది. ఇందుకు ఇతర ఆదాయం దోహదపడింది. అంతకుముందు యేడాది ఇదే కాలంలో రూ.428 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.3,385 కోట్ల నుంచి రూ.5,031 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 57శాతం పెరిగి రూ.2,094 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.7శాతం మెరుగుపడి 5.8శాతానికి చేరాయి. పూర్తి యేడాదికి బ్యాంకు నికర లాభం 32శాతం పెరిగి రూ.2,106 కోట్లయింది. 2023-24లో రూ.1,591 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ.ఒకటి చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా స్థూల మొండిబకాయిలు (ఎన్‌పిఎలు) 1.67శాతం నుంచి 2.28 శాతానికి, నికర ఎన్‌పిఎలు 0.55 శాతం నుంచి 0.74 శాతానికి పెరిగాయి. వెరసి ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ.118 కోట్ల నుంచి రూ.635 కోట్లకు భారీగా పెరిగాయి.

ప్రైవేట్ రంగ కంపెనీ మహీంద్రా లాజిస్టిక్స్ గతేడాది చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో స్టాండెలోన్ నికర లాభం 67శాతం పెరిగి రూ.13 కోట్లకు చేరింది. అంతకుముందు యేడాది ఇదే కాలంలో దాదాపు రూ.8 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.1,183 కోట్ల నుంచి రూ.1,293 కోట్లకు చేరింది. అయితే మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి నికర లాభం 30శాతం క్షీణించి దాదాపు రూ.44 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ.62 కోట్లు ఆర్జించింది. కాగా టర్నోవర్ 10శాతం వృద్ధితో రూ.5,013 కోట్లకు చేరింది. 2023-24లో రూ.4,530 కోట్ల ఆదాయం అందుకుంది.




## లగ్జరీ బ్యాగులు, వాచీలపై ఒకశాతం టిసిఎస్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** లగ్జరీ వస్తువుల విక్రయాలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.10 లక్షలు అంతకంటే ఎక్కువ విలువ చేసే బ్యాగులు, చేతి గడియారాల వంటి వాటిపై 1 శాతం టీసీఎస్ (మూలం వద్ద వసూలుచేసే పన్ను) ప్రకటించింది. ఏప్రిల్ 22 నుంచే ఈ టీసీఎస్ అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఆదాయపు పన్ను విభాగం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. పెయింటింగ్స్, శిల్పాలు, సన్‌గ్లాసెస్, హ్యాండ్‌బ్యాగ్‌లు, పాదరక్షలు, హోం థియేటర్ సిస్టమ్స్, రేసింగ్ గుర్రాలు, చేతి గడియారాలు, హై ఎండ్ స్పోర్ట్స్ వేర్, క్రీడా పరికరాలు వంటి వాటిపై ఈ టీసీఎస్ వర్తిస్తుందని ఐటీ శాఖ తమ నోటిఫికేషన్‌లో పేర్కొంది. అధిక విలువకలిగిన వస్తువుల విక్రయాల్లో పారదర్శకతను పెంచేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజా నిర్ణయంతో విక్రయదారులు టీసీఎస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అలాగే లగ్జరీ వస్తువులను కొనుగోలు చేసే సమయంలో కస్టమర్లు కేవీసీ, ఇతర డాక్యుమెంట్లను పూర్తిచేయాలి. ఈ నిర్ణయంతో లగ్జరీ వస్తువుల అమ్మకాలపై నియంత్రణ ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## ఏథర్ ఎనర్జీ ఐపిఒ

**ముంబై, ఏప్రిల్ 23:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓ ధరల శ్రేణిని ప్రకటించింది. రూ.2,981 కోట్ల ఐపీఓకు సంబంధించి ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.304-321గా పేర్కొంది. ఏప్రిల్ 28 నుంచి 30 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 25న విండో తెరుచుకోనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెయిన్ బోర్డు నుంచి పబ్లిక్ ఆఫర్‌కు వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం గమనార్హం. ఏథర్ ఎనర్జీ సంస్థ ఈ పబ్లిక్ ఇష్యూలో తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,626 కోట్లు సమీకరించనుంది. దీంతో పాటు 1.1 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రమోటర్లు, వాటాదారులు తమ వాటాలను ఆ మేర తగ్గించుకోనున్నారు. రూ.11,956 కోట్ల విలువ వద్ద మొత్తం రూ.2,981 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించేందుకు కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఐపిఒ ద్వారా సమీకరించిన నిధులను మహారాష్ట్రలోని ద్విచక్ర వాహన ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రుణాన్ని తగ్గించుకునేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. కొంత మొత్తాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు పెంచుకోవడానికి వినియోగించ బోతోంది. ఐపిఒలో భాగంగా 75 శాతం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు కంపెనీ కేటాయించింది. 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 10 శాతం షేర్లను రిటైల్ ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేసింది. యాక్సిస్ కేపిటల్, హెచ్‌ఎస్‌బీసీ సెక్యూరిటీస్, జేఎం ఫైనాన్షియల్, నొమురా బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. మరో విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్, గతేడాది రూ.రూ.6,415 కోట్లను ఐపీఓ ద్వారా సమీకరించింది. విద్యుత్ వాహన విభాగంలో ఐపీఓకు వస్తున్న రెండో సంస్థగా ఏథర్ ఎనర్జీ నిలవనుంది.




## టాటా కమ్యూనికేషన్స్ లాభాలు జూమ్

**ముంబై, ఏప్రిల్ 23:** ప్రైవేట్ రంగ సంస్థ టాటా కమ్యూనికేషన్స్ గతేడాది చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపుపైనా వృద్ధితో రూ.761 కోట్లను అధిగమించింది. సహచర కంపెనీకి చెన్నైలోని భూమిని విక్రయించడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతకుముందు యేడాది ఇదే కాలంలో కేవలం రూ.346 కోట్లు ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 కోట్ల డాలర్ల పెట్టుబడులు వెచ్చించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతేడాది 27 కోట్ల డాలర్లు కేటాయించినట్లు తెలియచేసింది. కాగా మొత్తం ఆదాయం కూడా 6శాతానికిపైగా పెరిగి రూ.6,059 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 6శాతం పెరిగి రూ.5,723 కోట్లకు చేరాయి. చెన్నైలోని భూమి అమ్మడంతో రూ.577 కోట్ల మేర అదనపు లాభం ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది. అంతేకాకుండా టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్స్ సొల్యూషన్స్‌లో వాటా విక్రయం ద్వారా రూ.311 కోట్లు అందుకున్నట్లు తెలియచేసింది. మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి రూ.23,238 కోట్ల ఆదాయం సాధించింది. మార్చికల్లా రూ.9,377 కోట్ల రుణభారం నమోదైంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.